




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 06 మంగళవారం | మే2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 232

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# యుద్ధం..భారీ నష్టం

- యుద్ధం వస్తే పాక్‌కే కొండంత నష్టం
- సంచలన నివేదిక వెలుగులోకి..
- యుద్ధం కారణం పాక్ నిధులన్నీ వ్యయం
- అప్పు కూడా పుట్టక ఆర్థిక మాంద్యం
- కుప్పకూలనున్న ఆర్థిక వ్యవస్థ
- మూడీస్ రేటింగ్స్ సంస్థ సర్వే వివరాలివే..

2




**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

జమ్ము కాశ్మీర్ ఉగ్రదాడిలో 26 మంది అమాయక టూరిస్టులు మరణించిన నేపథ్యంలో పాకిస్థాన్- భారత్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఏ క్షణమైనా యుద్ధం ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ను దెబ్బకు దెబ్బ తీయాలన్న కసిగా భారత్ ఉంది. ఈ క్రమంలో భారత్.. ఎప్పుడు, ఎక్కడ.. ఏ సమయంలో దాడి చేస్తుందోనని పాకిస్థాన్ బిక్కుబిక్కుమంటూ ఉంటోంది. ఒకవేళ భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగితే భారత్ కంటే పాకిస్థాన్ అధికంగా నష్టాన్ని చవిచూస్తుందని ప్రఖ్యాత మూడీ స్ రేటింగ్స్ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధం కారణంగా పాకిస్థాన్ దగ్గర ఉన్న నిధులు పూర్తిగా అయిపోతా యని.. అప్పు కూడా పుట్టదని.. దేశం ఆర్థిక మాంద్యంలోకి వెళ్తుందని సూచనలు చేసింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని హెచ్చరించింది. భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నవేళ పాకిస్థాన్‌కు సాయం చేసేందుకు ఏ దేశం కూడా ముందుకు వచ్చే పరిస్థితి లేదని

## భారత స్టాక్ మార్కెట్లకు

# స్వర్ణ యుగం



- 114.45 పాయింట్ల లాభాలతో సెషన్‌ను 24,461.15 వద్ద ముగింపు
- విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారత మార్కెట్లలోకి కొనసాగింపు
- తగ్గుతున్న ముడి చమురు ధరల కారణంగా తారాస్థాయికి మార్కెట్
- లాభపడ్డ ఇన్వెస్టర్లు..జోష్‌లో భారత స్టాక్ మార్కెట్

**ముంబై-నవభూమిబ్యూరో**

విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారత మార్కెట్లలోకి కొనసాగుతూనే ఉండటం, తగ్గుతున్న ముడి చమురు ధరల కారణంగా భారత మార్కెట్లు తారాస్థాయికి పెరుగుతున్నాయి. వీటి నేపథ్యంలో మెరుగైన సెంటిమెంట్ తోడవడంతో సోమవారం బెంచ్‌మార్క్ సూచీలు 2025కి అత్యధిక ముగింపు స్థాయిలో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి, సెన్సెక్స్ 0.4 శాతం లేదా 295 పాయింట్లు పెరిగి 80,797 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 0.47 శాతం లేదా 114.45 పాయింట్లు పెరిగి 24,461 వద్ద ఉంది. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 1.45 శాతం లాభపడగా, బిఎస్ఇ స్మాల్‌క్యాప్ 1.23 శాతం లాభపడింది.ఇక, సోమవారం ట్రేడింగ్ విషయానికొస్తే, మంచి గ్యాప్ అప్‌తో మార్కెట్లు ఓపెన్ అయ్యా యి. తర్వాత, ఇండెక్స్ రోజంతా రేంజ్‌బౌండ్‌లో ఉండి చివరికి 114.45 పాయింట్ల లాభాలతో సెషన్‌ను 24,461.15 వద్ద ముగించింది. బ్యాంక్ నిఫ్టీ, బ్యాంక్‌లు మినహా, అన్ని రంగాల సూచీలు గ్రీన్‌లో ముగిశాయి. ఆటో, ఎనర్జీ టాప్ పెర్ఫార్మర్‌లుగా ఉద్భవించాయి. మిడ్‌క్యా ప్ ఇంకా స్మాల్‌క్యాప్ సూచీలు గణనీయంగా పురోగమించి, ఫ్రంట్‌లైన్ ఇండెక్స్‌ను అధిగమించిన విస్తృత మార్కెట్లలో నిజమైన ఊపు కనిపించింది. బెంచ్‌మార్క్ సూచీలు గత 16 సెషన్లలో 12 సెషన్లు లాభపడటం విశేషం. దీనికి ప్రధాన కారణం ఫారిన్ పోర్ట్ పోలియో ఇన్వెస్టర్స్. వీళు తిరిగి కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో భారత మార్కెట్లు భారీగా పెరుగుతున్నాయి. దీంతో ఈ కాలంలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ 10 శాతానికి పైగా పెరిగాయి. గత 11 సెషన్లలోనే, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.38,300 కోట్లకు పైగా ఈక్విటీలను కొనుగోలు చేశారని డేటా చెబుతోంది.మరోవైపు, బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60 కంటే తక్కువగా పడిపోయాయి. ఇది ఈ సంవత్సరం ఇప్పటివరకు దాదాపు 20 శాతం తగ్గుదలను సూచిస్తుంది. ట్రంప్ సుంకాల సంబంధిత అనిశ్చితుల కారణంగా ఎగుమతి వేగం మందగించింది. ఇది భారత ఈక్విటీ మార్కెట్లకు సానుకూలంగా కూడా పరిణమించింది. ఇక, ఇండియాలో వృద్ధి అవకాశాలు దేశీయ ఈక్విటీలలో చురుకుగా ఉండటానికి ప్రోత్సహిస్తున్నాయి. అయితే ద్రవ్యోల్బణాన్ని తగ్గించే అంచనాలు కొంత హెచ్చుతగ్గులకు లోనైనప్పటికీ బాండ్ మార్కెట్లకు స్థిరత్వాన్ని అందించాయి.

# సహకారమా..సమరమా!

- ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?..ఎందుకు సమరం?
- గతంలో లేని విధంగా మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?
- గత పాలకులు రూ. 8,500 కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని సమ్మె మానండి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఆర్టీసీ కార్మికులు చేపట్టనున్న సమ్మె నిర్ణయంపై వెనక్కి తగ్గేది లేదంటూ ప్రభుత్వానికి వారు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టనున్న సమ్మెపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో జీ అవార్డులు 2025 ఫంక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?.. ఎందుకు మీ సమరం.గతంలో లేని విధంగా మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా? అంటూ ఆర్టీసీ కార్మికులను ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతీ నెలా రూ. 7 వేల కోట్లు ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలుగా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. గత పాలకులు రూ. 8,500 కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలు పెట్టి వెళ్లారని ఈ సందర్భంగా వారికి ఆయన గుర్తు చేశారు. అయితే కొన్ని రాజకీయ పార్టీలు తమపై ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అవన్నీ గత ప్రభుత్వంలోని వాళ్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టి వెళ్లిన బకాయి లేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కేవలం పదహారు నెలల్లో తమ ప్రభుత్వం రైతుల ఖాతాలకు రూ. 30 వేల కోట్ల నగదును బదిలీ చేసిందన్నారు. ఉచిత విద్యుత్ అని చెప్పి విద్యుత్ శాఖకు బకాయిలు పెట్టి వెళ్లారంటూ గత ప్రభుత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొనుగోలు చేసి సింగరేణికి సైతం బకాయిలు పెట్టి వెళ్లిన ఘనత గత ప్రభుత్వానిదని ఆయన విమర్శించారు. ప్రాజెక్టులు నిర్మించామని చెప్పి..కాంట్రాక్టర్లకు సైతం బకాయిలు పెట్టారని ఈ

# సైకిలెక్కనున్న అవంతి?

- గంటా ప్రత్యర్థి అవంతి శ్రీనివాసరావుకు టీడీపీ కండువా?
- మొన్న విశాఖ కార్పొరేషన్ కూటమి వశం కాపడానికి కారణం అవంతే
- అవంతి శ్రీనివాసరావు కూతురి ఒక్క ఓటుతో గట్టెక్కిన కూటమి
- దాంతో అవంతిని టీడీపీలోకి రావాలని ఆహ్వానిస్తున్న నేతలు
- గంటాకు ఇష్టం లేకపోయినా అవంతి చేరిక ఖాయమంటున్న నేతలు

2



**విశాఖ-నవభూమిబ్యూరో**

విశాఖ జిల్లాలో మాజీ మంత్రి టీడీపీ నాయకుడు అయిన గంటా శ్రీనివాసరావు ఎంత పవర్ ఫుల్ లీడర్ అన్న సంగతి తెలిసిందే. ఆయన ఏ రోజూ ఎన్నికల్లో ఓటమి పాలు కాలేదు. ఒకసారి ఎంపీగా అయిదు సార్లు ఎమ్మెల్యేగా రెండు సార్లు మంత్రిగా పనిచేసిన గంటా తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తులు చూశారు. ఆయన గెలిస్తే చాలు మంత్రి పదవి ఖాయం అన్న మాట ఉండేది. అలాంటిది ఈసారి మాత్రం అలా కుదరలేదు. 2024లో భీమునిపట్నం నుంచి ఎమ్మెల్యేగా గంటా గెలిచారు. ఆయన అంచనాలు తపకుండా టీడీపీ కూడా అధికారంలోకి వచ్చింది. కానీ గంటాకు చాన్స్ దక్కలేదు. జస్ట్ ఎమ్మెల్యేగా ఉండిపోయారు. ఇది ఇలా ఉంటే ఆయన మాట హైకమాండ్ వద్ద పెద్దగా చెల్లడంలేదా అన్న చర్చ కూడా సాగుతోంది. ఎందుకంటే ఆయన రాజకీయ ప్రత్యర్థిగా మారిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావుకు టీడీపీ కండువా కప్పుతోంది అని అంటున్నారు. తొందరలోనే అది జరగనుంది అని కూడా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. విశాఖ మేయర్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలిచేందుకు అవిశ్వాసం నెగ్గేందుకు ఒకే ఒక్క ఓటు తారకమంత్రంగా పనిచేసింది. ఆ ఓటే అవంతి కుమార్తె ఆరవ వార్డు కార్పోరేటర్ అయిన లక్ష్మీ ప్రియాంక. ఇలా టీడీపీకి సరైన సమయంలో ఆదుకున్న అవంతి మీద పార్టీ పెద్దలు ఎంతో దయ చూపుతున్నారుట. దాంతో ఒకనాడు తానుగా కోరి వెళ్ళి పసుపు తీర్థం పుచ్చుకుంటాను అంటే స్పందించని వారు ఇపుడు ఆయనని కావాలని పిలుస్తున్నారుట. దాంతో అవంతి వర్గం ఉబ్బితబ్బిబ్బు అవుతోంది. అన్నీ అనుకూలిస్తే అవంతి తొందరలోనే పసుపు పార్టీలో చేరి కొత్త

## సిబిల్ లేదా..

# యువ వికాసం లోన్ నో!



- రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులకు ఒక షాకింగ్ న్యూస్
- లోన్ రావాలంటే కీలకంగా దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ ముఖ్యం
- సిబిల్ స్కోర్ సక్రమంగా లేకపోతే రుణ దరఖాస్తులు తిరస్కారం
- ప్రతి ఒక్కరి సిబిల్ స్కోర్ తనిఖీకి రూ.100-200 వసూలు చేసే ఛాన్స్

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని కల్పించడం కోసం రేవంత్ సర్కార్ తీసుకువచ్చిన ఈ పథకంలో దరఖాస్తుదారులు అందరు తమకు లబ్ధి జరుగుతుందని భావిస్తున్నారు. జూన్ రెండో తేదీన రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తుదారులకు లోన్ అయితే ఇదే సమయంలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం అప్లై చేసుకున్న వారికి ఒక షాకింగ్ న్యూస్ వెలుగులోకి వచ్చింది. రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకున్న వారికి 50 వేల నుంచి నాలుగు లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణాలను బ్యాంకులు మంజూరు చేయవలసి ఉంది. జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. వారికి లోన్ కష్టమే ఈ సంవత్సరం సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వ నిర్ణయించింది. అయితే రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి లోన్ రావాలంటే వారి సిబిల్ స్కోర్ కీలకంగా మారింది. సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నవారు, బ్యాంకు రుణాలు తీసుకుని చెల్లించని వారు, పర్సనల్ లోన్స్ , వ్యవసాయ, గృహ, వాహన రుణాలను తీసుకుని చెల్లించని వారి దరఖాస్తులను బ్యాంకర్లు తిరస్కరించే అవకాశం ఉంది. అందరి సిబిల్ స్కోర్ లను తనిఖీ చేయనున్న బ్యాంకర్స్ తక్కువ సిబిల్ స్కోర్ ఉన్నవారిని మినహాయించి మిగతా వారికి మాత్రమే రాజీవ్ యువ వికాసం రుణాలను

# పునాది లేకుండా గోడ!

- సింహాచలం ఘటన.. ప్రభుత్వం చేతిలో కీలక నివేదిక
- చందనోత్సవానికి వారం రోజుల ముందు హడావిడి గోడ
- అలాగే గోడ నిర్మాణానికి ఎలాంటి డిజైన్లు కానీ లేవు
- ప్రాథమిక నివేదికలో కమిషన్ వెల్లడి

2

**విశాఖ-నవభూమిబ్యూరో**

సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా క్యూ లైన్‌లో నిలుచున్న భక్తులపై గోడ కూలిన ఘటనకు సంబంధించి త్రిసభ్య కమిషన్.. తన ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడుకి కమిషన్ చైర్మన్, పురపాలక శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ ఈ నివేదికను అందజేశారు. తాత్కాలికంగా నిర్మించిన గోడకు పునాది కూడా లేదని ఈ ప్రాథమిక నివేదికలో త్రిసభ్య కమిషన్ స్పష్టం చేసింది. భారీ వర్షం కారణంగా పెద్ద ఎత్తున నీరు.. బురద చేరడంతో బరువు కారణంగా ఆ గోడ కూలినట్టు కమిషన్ అభిప్రాయపడింది. గోడ దిగువకు నీరు వెళ్లేందుకు లీప్ హెూల్స్ కూడా లేవని ప్రాథమిక నివేదికలో పేర్కొంది. చందనోత్సవానికి వారం రోజుల ముందు ఈ గోడను హడావిడిగా నిర్మించినట్లు స్పష్టం చేసింది. అంతేకాకుండా.. ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా ఈ గోడ నిర్మాణానికి హడావిడిగా అనుమతులిచ్చారని తెలిపింది. అలాగే గోడ నిర్మాణానికి ఎలాంటి డిజైన్లు కానీ.. పునాదులు కానీ లేకుండా నిర్మించారని తన ప్రాథమిక నివేదికలో కమిషన్ వెల్లడించింది. గోడ పటిష్టత గురించి, భక్తుల భద్రత గురించి ఎలాంటి తనిఖీలు చేయలేదని చెప్పింది. విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌తో సహా పలువురు ప్రత్యక్ష సాక్షుల నుంచి దీనిపై స్టేట్‌మెంట్లు తీసుకుని వాటిని సైతం త్రిసభ్య కమిషన్ నమోదు చేసింది. ఈ దుర్ఘటనకు ఆలయ ఈఓ, ఇంజనీరింగ్ సిబ్బంది, టూరిజం కార్పోరేషన్ అధికారులు, కాంట్రాక్టర్ లక్ష్మణ్ రావు బాధ్యులని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. వీరందరిపై తీవ్ర చర్యలకు త్రిసభ్య

## పాక్‌లో

# భూకంపం

- భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా రికార్డ్
- నేషనల్ సెస్మాలజీ సెంటర్ వెల్లడి
- ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఛిత్రాల్ జిల్లాలో భూకంపం
- భారీగా ఆస్తినష్టం..ప్రాణ నష్టం నిల్..నివాసాలకు బీటలు

2



**ఇస్లామాబాద్-నవభూమిబ్యూరో**

పొరుగుదేశం పాకిస్తాన్‌లో భూకంపం సంభవించింది. ఇప్పటివరకు దీనివల్ల సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టాల వివరాలు ఇంకా తెలియరాలేదు. పలు నివాసాలు బీటలు వారినట్లు సమాచారం అందుతోంది. కొన్ని చోట్ల పాక్షికంగా కూలిపోయినట్లు చెబుతున్నారు. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా రికార్డయింది. ఈ సాయంత్రం సరిగ్గా 4 గంటలకు భూమి ప్రకోపించినట్లు నేషనల్ సెస్మాలజీ సెంటర్ వెల్లడించింది. ఖైబర్

# విషాదాన్ని మిగిల్చిన గాలివాన

- ఏపీలో ఏడుగురి మృతి, భారీగా పంట నష్టం
- రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులు పడి పలువురి మృతి
- తిరుపతి జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు మృతి
- అత్యధికంగా వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో కాకినాడ జిల్లా మొదటిస్థానం
- సర్కార్ ఆదేశంతో సహాయక చర్యలు చేపట్టిన సర్కార్

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో అనూహ్యంగా వచ్చిన గాలివాన తీరని విషాదాన్ని మిగుల్చింది. ఆదివారం ఉదయం మొదలై రాత్రి వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు భారీ వర్షం తోడయ్యి వ్యవసాయ, ఉద్యాన పంటలకు పెద్ద ఎత్తున నష్టం చేసింది. సుమారు 50వేలకు పైగా ఎకరాల్లో వరి పంట దెబ్బతిని ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా గాలుల తీవ్రతకు భారీవృక్షాలు సైతం నేలకొరిగాయి. అంతే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులు పడి పలువురు మృతి చెందగా.. చెట్టు కూలిన ఘటనలో ఒకరు మరణించారు. అత్యధికంగా వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో కాకినాడ జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో కూడా వర్షాల ప్రభావం అధికంగానే ఉన్నట్టు అధికారులు వివరించారు. ఇక ఈ క్రమంలోనే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని హెూంమంత్రి అనిత అధికారులను ఆదేశించారు. తాజా పరిస్థితులపై విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్‌ని ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. భారీ వర్షం నమోదైన టాప్ - 5 ప్రాంతాలు.. కాజులూరు - 100 మి.మీ చొల్లంగిపేట - 94.5 కరప - 75.5 అమలాపురం - 65.5 పైడిమెట్ట - 65.5మి.మీ. వర్షపాతం నమోదైంది. మృతి చెందిన వారి వివరాలు.. తిరుపతి జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు మరణించారు. నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగలో రైతు భాస్కర్(52), ఓజిలి మండలం గొల్లపాలెంలో కార్తీక్(11), చిల్లకూరు మండలం కాకువారిపాలెంలో మునీంద్ర(30)

## కరాచీ బేకరీ పేరు మార్చాలంటూ

# వైజాగ్‌లో నిరసనలు

- పహల్గాం దాడి ఎఫెక్ట్..!

2



**విశాఖపట్నం-నవభూమి బ్యూరో:** కాశ్మీర్‌లోని పహల్గాం లో ఉగ్రదాడి తర్వాత దేశం లోని అన్ని ప్రాంతాల్లోనూ పాకిస్తాన్ పై ఆగ్రహం అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ పై కేంద్రం దాడి చేయాల్సిందేనన్న డిమాండ్లు కూడా పెరుగుతున్నాయి. అదే సమయంలో పాకిస్తాన్ లోని కరాచీ నగరం పేరుతో ఉన్న కరాచీ బేకరీ పేరు మార్చాలంటూ విశాఖలో ఇవాళ నిరసనలు జరిగాయి. పహల్గాం దాడి నేపథ్యంలో ఈ కొత్త డిమాండ్ తెరపైకి వచ్చింది.పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ నగరం పేరుతో ఉన్న కరాచీ బేకరి పేరును మార్చాలని డిమాండ్ చేస్తూ ఇవాళ విశాఖలో హిందూ జన జాగరణ సమితీ నిరసనలు చేపట్టింది. ఈ గ్రూపు కార్యకర్తలు కరాచీ బేకరి వద్ద

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




# ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

**హైదరాబాద్-నవభూమి:**కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సీసీఎస్, పీఎఫ్ పైసలు వాడుకున్నారని విమర్శించారు. ఇవాళ(సోమవారం) మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామరెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్ , ఎస్డబ్ల్యూఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరికృష్ణ, తదితరులు ఉన్నారు. ఆర్టీసీ సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ సంఘాల నేతలు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ సమస్యలపై ఉద్యోగులు ఎప్పుడైనా తనను కలవవచ్చని.. వారికి తానెప్పుడు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించడానికి తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం తమ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని..సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సమ్మె చేయొద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీ అభివృద్ధి కోసం 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామని.. ఒక్కరినైనా ఇబ్బంది పెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.




## బస్సులో కల్లు తీసుకెళ్లొచ్చా..? చర్చకు దారి తీసిన మహిళ యవ్వారం..!



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ సంస్కృతిలో కల్లు ఒక భాగం. చాలా మంది తాటి, ఈత కల్లును ఇష్టంగా తాగుతుంటారు. కొందరు దాన్ని వ్యసనం అంటే.. మరికొందరు అలవాటు పడిన ఓ సాంప్రదాయం అంటుంటారు. ప్రకృతి ప్రసాదించిన అమృతమని చెబుతుంటారు. పట్టణాల్లో నివసించేవారు సైతం పల్లెటూళ్ల నుంచి వచ్చే తమ బంధువులు, స్నేహితుల ద్వారా కల్లును తెప్పించుకుంటుంటారు. అయితే ఇలా తీసుకొచ్చే క్రమంలో కొన్నిసార్లు ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రైవేట్ వెహికల్స్‌లో అయితే ఓకే కానీ.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అయిన ఆర్టీసీ బస్సుల్లో కల్లును తీసుకెళ్లొచ్చా..? ఇదే విషయంపై ఓ మహిళ యవ్వారం చర్చకు దారి తీసింది.వివరాల్లోకి వెళితే.. నల్గొండ జిల్లా కట్టంగూరుకు చెందిన ఓ మహిళ కల్లు బాటిళ్లతో నల్గొండ బస్సు ఎక్కింది. అది గమనించిన డ్రైవర్, కండక్టర్ బస్సులోకి కల్లు తీసుకురాకూడదని చెప్రారు. కల్లు బాటిళ్లు తీసుకెళ్లకూడదంటూ ఆమెను మధ్యలోనే దింపేశారు. దీంతో సదరు మహిళ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏకంగా ఆ బస్సుకు అడ్డుగా నిలబడి నిరసన వ్యక్తం చేసింది. ఇది తమ ఊరిలో చేసే సాంప్రదాయమని.. పుట్టిన రోజు సందర్భంగా కల్లు తీసుకెళ్తున్నానని వెల్లడించింది. కల్లు తీసుకెళ్తుంటే.. నువ్వెవ్వరు నన్ను ఆపేదంటూ కాసేపు హల్‌చల్ చేసింది.

సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను శాంత పరిచారు. అనంతరం బస్సు అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆర్టీసీ బస్సుల్లో కల్లు తీసుకురాకూడదనే రూల్ ఏమైనా ఉందా..? కల్లును బస్సులో తీసుకుపోవడాన్ని ప్రభుత్వం నిషేధించిందా? తెలంగాణలోని దానిని బ్యాన్ చేశారా..? ఈ విషయంలో ఆర్టీసీ యాజమాన్యం స్పందించాలని కొంతమంది నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇలా ఆ మహిళ యవ్వారం ఇప్పుడు కొత్త చర్చకు దారి తీసింది.ఇక రూల్స్ విషయానికొస్తే.. తెలంగాణలోని బస్సుల్లో కల్లు తీసుకెళ్లటం నిషేధం అంటూ స్పష్టమైన నిబంధనలు లేవు. సాధారణంగా ప్రయాణికులు తమ వ్యక్తిగత అవసరాల కోసం పరిమిత మోతాదులో తీసుకువెళ్లేందుకు అనుమతి ఉండవచ్చు. అయితే ఎక్కువ మొత్తంలో తరలించడం చట్టవిరుద్ధం కావచ్చు. వాణిజ్యపరమైన ఉద్దేశ్యంతో కల్లును తరలించటం పైనా నిషేదం ఉండొచ్చు. పరిమిత మోతాదులో కల్లును తీసుకెళ్లినా.. ప్యాకింగ్ సరిగా ఉండాలి, ఇతరులకు అసౌకర్యం కలిగించకూడదు. అలాగే కల్లును అనుమతించే విషయంలో ఆర్టీసీ అధికారుల తుది నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అయితే ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఎక్సైజ్ అధికారులు క్లారిటీ ఇవ్వాల్సి ఉంటుంది.

## ఉత్తర తెలంగాణలో భూప్రకంపనలు.. భయాందోళనతో బయటకు పరుగులు తీసిన ప్రజలు



**హైదరాబాద్-నవభూమి:**ఉత్తర తెలంగాణలో సోమవారం సాయంత్రం భూప్రకంపనలు కలకలం రేపాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని పలు చోట్ల భూమి కంపించింది. కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం మండలాల్లో 10 సెకన్ల పాటు భూమి స్వల్పంగా కంపించింది. రిక్టర్ స్కేలుపై తీవ్రత 3.8గా నమోదైనట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా భూప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఇండ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. కాగా, రెండుసార్లు భూమి కంపించిందని స్థానికులు చెబుతున్నారు.


## విజయ్ దేవరకొండపై కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు




**కులకచర్ల-నవభూమి:** గిరిజన జాతికి విజయ్ దేవరకొండ క్షమాపణ చెప్పాలని గిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. ఏప్రిల్ 24న రెట్రో సినిమా ప్రీ రిలీజ్ సందర్భంగా విజయ్ దేవర కొండ గిరిజన ప్రజల మనోభావాలను దెబ్బతీసేవిధంగా మాట్లాడటం పట్ల గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం కులకచర్ల పెద్ద గేటు చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులపై అనుచితంగా మాట్లాడిన విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండు చేశారు. 5వందల సంవత్సరాల కిందట గిరిజనులు బుద్ధి లేకుండా కొట్టుకున్నారనే వ్యాఖ్యలు సరికాదని అన్నారు. ఎస్టీలకు క్షమాపణ చెప్పడంతో పాటు గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్‌సేవాలాల్ మహారాజ్ పాదాలమీద పడి క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లెడ్ చౌదర్‌గూడెం మండల గిరిజన యువనాయకులు ఆకాశ్‌నాయక్, వికారాబాద్ జిల్లా గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు చిట్టునాయక్, కులకచర్ల మండల ప్రధాన కార్యదర్శి గణేశ్‌నాయక్, సేవాలాల్ సేనా మండల అధ్యక్షులు అంగూర్‌నాయక్, హన్మ్యనాయక్, మాజీ సర్పంచ్ రవినాయక్, అరుణ్, శ్రీను, గోపాల్, బాలకృష్ణ, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్టాఫ్ నర్సు పోస్టుల రాత పరీక్ష ఫలితాలు విడుదల

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని




నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్సు) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం విడుదల చేసింది. https://mhsrb.telangana.go v.in/MHSRB/home.htm% వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## ఏపీలోని ఆ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు లోకల్ కోటా కొనసాగించండి



**ఆంధ్రప్రదేశ్-నవభూమి:**ఆంధ్రప్రదేశ్ సైనిక్ స్కూల్స్‌లో ఈ విద్యా సంవత్సరం తెలంగాణ విద్యార్థులకు కొనసాగుతున్న 67 శాతం లోకల్ కోటాను రద్దు చేయవద్దని.. దాన్ని యథావిధిగా కొనసాగించాలని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌కు మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం (మే 05) రోజు ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు.ఏపీ సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారు 25 వేల నుంచి 30 వేల మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారని రఘునందన్ రావు తెలిపారు. అయితే, రక్షణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ సైనిక్ స్కూల్స్‌లో తెలంగాణ విద్యార్థులకు గత పదేళ్లుగా కొనసాగుతున్న 67 శాతం లోకల్ కోటాను ఈ విద్యా సంవత్సరం నుంచి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారని రఘునందన్ రావు వెల్లడించారు. ఈ ఉత్తర్వుల వల్ల తెలంగాణ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో ఫోన్‌లో మాట్లాడి, సమస్యను వివరించానని తెలిపారు. ఆయనను నేరుగా కలిసేందుకు అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నానని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి కొత్తగా మూడు సైనిక్ స్కూల్స్‌ను మంజూరు చేసే వరకు.. ఈ విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసిన తెలంగాణ విద్యార్థులందరికీ 67 శాతం లోకల్ కోటాను కొనసాగించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ఎంపీ చెప్పారు. కేంద్ర మంత్రి సంజయ్ సేథ్ కూడా ఈ విషయంలో సానుకూలంగా స్పందించారని రఘునందన్ రావు పేర్కొన్నారు. మంగళవారం (మే 06) రోజు సాయంత్రం కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను కలవనున్నట్లు రఘునందన్ రావు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యార్థుల సమస్యను మరింత బలంగా వినిపించి, న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని రఘునందన్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తప్పుడు దారిలో తల్లి.. తట్టుకోలేక తండ్రి.. మధ్యలో ఆ పిల్లలేం పాపం చేశారు..?



**సంగారెడ్డి-నవభూమి:**సంగారెడ్డి జిల్లాలో గుండెలు పిండేసే విషాదం చోటుచేసుకుంది. తన ఇద్దరు పిల్లలకు ఉరేసి చంపి.. అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు ఓ ఆర్ఎంపీ. ఈ దారుణ ఘటన ఐదు రోజుల క్రితం జరగ్గా.. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆదివారం (మే 04న) గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. తలుపులు పగలగొట్టి చూడగా.. ముగ్గురి మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి.మృతులను సుభాష్ (40), అతని కుమారుడు రిథిక్ మర్యాన్ (9), కుమార్తె ఆరాధ్య (5)గా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో భార్య మంజుల (35)కు వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం బయటపడింది. ఈ కారణంగా గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని రోజుల క్రితం మంజుల పుట్టింటికి వెళ్లిపోవడంతో సుభాష్ తన ఇద్దరు పిల్లలతో ఒంటరిగా ఉంటున్నాడు.

భార్య ప్రవర్తనతో తీవ్ర మానసిక వేదనకు గురైన సుభాష్, అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. తొలుత తన ఇద్దరు అమాయక పిల్లలైన రిథిక్ మర్యాన్‌కు, ఆరాధ్యకు ఉరివేసి చంపి, ఆ తర్వాత తను కూడా ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ హృదయ విదారక ఘటనతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. సంఘటనా స్థలంలో మృతుడు సుభాష్ రాసిన నాలుగు పేజీల సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో తన భార్య మంజుల ప్రవర్తన వల్లే తాను తన పిల్లలతో సహా చనిపోతున్నానని సుభాష్ స్పష్టంగా పేర్కొన్నాడు. తన భార్యకు డబ్బు ఆశ చూపి కొందరు ఆమెను శారీరకంగా వాడుకున్నారని కూడా ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశాడు. మంజులకు ఎన్నిసార్లు చెప్పినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తరచూ గొడవలు జరిగేవని సుభాష్ తన సూసైడ్ నోట్‌లో వివరించాడు. తన భార్య వివాహేతర సంబంధాల గురించి ఒక్కొక్కటిగా పేర్కొంటూ అతను తన ఆవేదనను నాలుగు పేజీల లేఖలో నింపాడు. ఈ ఘటన సంగారెడ్డి ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

## సహకారమా..సమరమా!

**(1వపేజీ తరువాయి)**సందర్భంగా గుర్తు చేశారు. 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారని.. ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదని.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వమన్నారు. మనం పాలకులం కాదని సేవకులమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన ఉద్యోగ సంఘాల నాయకులు.. సమరమని అంటున్నారని మండిపడ్డారు. ఎవరిపై సమరం ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాల నాయకులపై లేదా? అంటూ కార్మిక జేఏసీ నేతలను ఆయన నిలదీశారు. ఉద్యోగ సంఘాల నాయకులకు తాను ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నానని.. ఏదైనా సమస్య ఉంటే చర్చించుకుందామన్నారు. మనం సమరం చేయడానికి ఇక్కడ లేమని.. ప్రజలకు సేవ చేయడానికే ఇక్కడ ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రజలపై యుద్ధం చేసి.. బాగుపడినవారు ఎవరూ లేరని గుర్తు చేశారు. ప్రభుత్వాన్ని అస్థిర పరిచాలనే రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దంటూ కార్మికల నేతలకు ఆయన హితవు పలికారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుందన్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన మీరు.. బాధ్యత మరిచి వ్యవహరిస్తే తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు.. కానీ ఎక్కడా అప్పు పుట్టడం లేదన్నారు. స్వీయ నియంత్రణనే దీనికున్న ఏకైక పరిష్కారమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఉద్యోగ సంఘాల నాయకుల్లారా.. రాష్ట్ర ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబ పరువును బజారున పడేయొద్దంటూ కార్మిక సంఘాల నేతలకు ఆయన హితవు పలికారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నన్ను కోసినా%ౌ% వచ్చిన ఆదాయానికి మించి నేను ఏం చేయలేనని స్పష్టం చేశారు. ఆర్థిక విధ్వంసం చేసిన వ్యక్తి%ౌ% ఇపుడు ఫామ్ హౌస్‌లో హాయిగా పాడుకున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరోక్షంగా విమర్శించారు. ఉద్యోగ సంఘాల నాయకుల్లారా ఇప్పుడు కావాల్సింది సమరం కాదు%ౌ% సమయస్ఫూర్తి, సంయమనమని పేర్కొన్నారు. మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా%ౌ% తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దని సూచించారు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళదామని ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు.

తెలంగాణలో పోలీసులు నూటికి నూరు శాతం శాంతి భద్రతలు కాపాడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలబడి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందన్నారు. దేశ సరిహద్దుల్లోని సైనికుల్లా రాష్ట్రంలో శాంతి భద్రతలను పోలీసులు పరిరక్షిస్తున్నారని చెప్పారు. పోలీస్ ఉద్యోగం కత్తి మీద సాము లాంటిదని ఆయన అభివర్ణించారు. విధి నిర్వహణలో పోలీసులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారు కాబట్టే మనం ప్రశాంతంగా ఉండ గలుగుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు భరోసా అందిస్తున్నామని స్పష్టం చేశారు.

## పునాది లేకుండా గోడ!

**(1వపేజీ తరువాయి)**కమిషన్ సిఫార్సు చేసింది. ఏప్రిల్ 21వ తేదీన నిర్మించిన గోడకు వీపింగ్ హెూల్స్ లేక పోవడం ప్రమాదానికి ప్రధాన కారణమని ఈ కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది.

కనీసం పునాది లేకుండా, కాంక్రీట్ వేయకుండా గోడను నిర్మించినట్టు నివేదికలో వెల్లడించింది. ఫ్లై యాష్ వినియోగించి ఈ స్థాయిలో 20 మీటర్ల గోడను నిర్మించినట్టు తెలిపింది. గోడ నిర్మాణం తరవాత సరిగా క్యూరింగ్ కూడా జరగలేదని తమ విచారణలో వెల్లడైనట్లు చెప్పింది. నిర్మితమైన గోడను దేవాదాయ, టూరిజం కార్పొరేషన్ ఇంజినీర్లు సర్టిఫై కూడా చేయలేదని తన నివేదికలో కమిషన్ పేర్కొంది. మెట్ల రూట్ మార్చడంలో నిర్దిష్టమైన అనుమతులు సైతం లేవని ఆ నివేదికలో కమిషన్ వెల్లడించింది.

ఏప్రిల్ 30 తేదీన సింహాచలంలో కొలువు తీరిన శ్రీవరాహ స్వామి వారికి చందనోత్సవం నిర్వహించారు. ఆ రోజు స్వామి వారి నిజరూప దర్శనం కోసం ఆ ముందు రోజు అర్ధరాత్రి నుంచి భక్తులు టికెట్ల కోసం క్యూ లైన్‌లో నిలుచున్నారు. ఆ క్రమంలో క్యూలైన్‌లో ఉన్న భక్తులపై గోడ కూలింది. ఈ ఘటనలో ఏడుగురు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఇక ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలంటూ సీనియర్ ఐఏఎస్ అధికారి సురేష్ కుమార్ సారథ్యంలో త్రిసభ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఘటనలో మృతి చెందినవారితోపాటు గాయపడిన వారికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించిన సంగతి తెలిసిందే.

## సైకిలెక్కనున్న అవంతి?

**(1వపేజీ తరువాయి)**తమ్ముడు అయిపోతారు అని అంటున్నారు. అయితే అవంతి టీడీపీలో చేరడం గంటాకు ఇష్టం లేదని అంటున్నారు. నిజానికి గంటా వల్లనే అవంతి చేరిక కూడా గతంలో ఒకసారి బ్రేక్ పడింది అని కూడా అంటున్నారు. గంటాయే అవంతిని రాజకీయాల్లోకి తెచ్చారు. ఆయన వల్లనే ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి అవంతి గెలిచారు. అలా గంటాను రాజకీయ గురువుగా చేసుకుని ఎంపీగా కూడా మరోసారి నెగ్గారు.

వైసీపీ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ కానీ 2019 ఎన్నికల ముందు ఇద్దరి మధ్యన భీమిలీ సీటు ఫైట్ తెచ్చింది. దాంతో గంటాతో విభేదించి ఆయన వైసీపీలో చేరారు అక్కడ మంత్రి అయ్యారు. ఇక గంటా వైసీపీలోకి రావాలని చూసినపుడు అవంతి అక్కడ అడ్డు చక్రం వేశారు అని అంటారు. ఇలా ఇద్దరూ ఒకరి పొడ మరొకరు గిట్టకుండా అయిదారేళ్ళుగా రాజకీయ సమరమే సాగిస్తున్నారు. అలాంటిది అవంతి టీడీపీలో చేరడానికి సిద్ధమవుతున్న వేళ గంటా వర్గం రియాక్షన్ వేరేగా ఉందని అంటున్నారు అయితే గంటాను జస్ట్ ఎమ్మెల్యేగా మాత్రమే చేసిన అధినాయకత్వం ఆయనకు పెద్దగా గిట్టని ఒకనాటి ప్రత్యర్థి అవంతిని పార్టీలోకి తీసుకుని రావడం ద్వారా ఏ రకమైన సందేశం ఇస్తున్నారు అన్నదే చర్చగా ఉందట.

## యుద్ధం..భారీ నష్టం

**(1వపేజీ తరువాయి)**మూడీస్ రేటింగ్స్ సంస్థ పేర్కొంది. విదేశీ మారక ద్రవ్యాలు ఇప్పుడు కావాల్సిన దాని కంటే తక్కువే ఉన్నాయని యుద్ధం కారణంగా మరింత తగ్గుతాయని నివేదిక పేర్కొంది. పాకిస్థాన్ దగ్గర ఉన్న విదేశీ మారక ద్రవ్యాలు 15 బిలియన్ డాలర్లు కాగా భారత్ వద్ద 688 బిలియన్ డాలర్లు ఉన్నట్లు.. దీన్ని బట్టి చూస్తేనే పాకిస్థాన్ పరిస్థితి అర్థం అవుతోందని మూడీస్ నివేదిక పేర్కొంది. కేంద్రానికి ఇంటెలిజెన్స్ రిపోర్ట్" పాకిస్థాన్‌తో పోల్చితే భారత్ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది. పెట్టుబడులు, ప్రైవేట్ సంస్థల ఉత్పత్తుల వినియోగం కారణంగా భారత్ ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని మూడీస్ పేర్కొంది. యుద్ధం కారణంగా భారత్ లో పెద్దగా మార్పు ఉండదని.. భారత్ ఎగుమతుల్లో కేవలం 0.5 శాతం మాత్రమే యుద్ధం ప్రభావం చూపుతుందని తెలిపింది. ఇక పాకిస్థాన్ పై ప్రతీకారం ఎలా తీర్చుకోవాలన్న దానిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. అధికార వర్గాలతో ప్రధాని మోదీ.. భేటీ అవుతుండటం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే ప్రధాని మోదీ త్రివిధ దళాలతో సమావేశం అయ్యారు. వాళ్లకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. పాకిస్థాన్ కు ఎలాంటి జవాబు ఇవ్వాలో సైన్యమే నిర్ణయిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు సింధూ జలాల రద్దుతోపాటు, వీసాల జారీ రద్దు, అటారీ-వాఘా బోర్డర్ మూసివేత కారణంగా పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది.

## యువ వికాసం లోన్ నో!

**(1వపేజీ తరువాయి)**ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇక ఇదే సమయంలో దరఖాస్తుదారులు అందరి సిబిల్ స్కోర్‌ను తనిఖీ చేయడం కోసం బ్యాంకర్లు ప్రభుత్వ నుండి ఒక్కొక్క దరఖాస్తుకు 100 రూపాయల నుండి 200 రూపాయల వరకు ఫీజు వసూలు చేయాలని నిర్ణయించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాయి. రాజీవ్ యువ వికాసం పథకానికి అప్లై చేసిన 16 లక్షల మంది ఇక రాజీవ్ వికాసం పథకానికి 16 లక్షల 25 వేల 441 దరఖాస్తులు రాగా, అన్ని దరఖాస్తుల సిబిల్ స్కోర్ పరిశీలించాలంటే దాదాపు ప్రభుత్వం బ్యాంకర్లకు 16 కోట్ల రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. ఇక స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ప్రభుత్వం ఈ ఫీజును మినహాయింపు ఇవ్వాలని బ్యాంకర్లను కోరనుంది. %ూశ్రీంశీ =ముం% రైతులకు చంద్రబాబు శుభవార్త.. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ! సిబిల్ స్కోర్ తక్కువ ఉన్నవారికి షాక్ ఇదిలా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకానికి బీసీల నుండి 5 లక్షల 35 వేల 666, ఎస్సీల నుండి 2 లక్షల 95 వేల 908, ఎస్టీల నుండి 1 లక్ష 39 వేల 112, ఈబీసీల నుండి 23,269, మైనారిటీల నుండి 1 లక్షా 7 వేల 681, క్రిస్టియన్ మైనారిటీల నుండి 2,689 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం పదహారు లక్షలకు పైచిలుకు దరఖాస్తులను బ్యాంకు సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న వారు పోగా, అధికారుల అంచనా ప్రకారం మిగిలిన 60 శాతం మందికి రుణాలు మంజూరయ్యే అవకాశం ఉన్నట్టుగా సమాచారం.

## పాక్‌లో భూకంపం

**(1వపేజీ తరువాయి)**ఫక్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఛిత్రాల్ జిల్లాలో ఈ భూకంపం సంభవించింది. ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల దిగువన టెక్టానిక్ ప్లేట్స్‌లల్లో చోటు చేసుకున్న కదలికల వల్ల భూమి కంపించింది. ఆఫ్ఘనిస్తాన్, తజకిస్తాన్ సరిహద్దుల్లో ఉంటుందీ ఛిత్రాల్ జిల్లా. దీని ప్రకంపనలు ఈ రెండు దేశాల్లో నమోదయ్యాయి. భూకంపం సంభవించిన వెంటనే స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇళ్లల్లో నుంచి బయటికి పరుగులు తీశారు. ప్రధాన భూకంపం తరువాత కూడా స్వల్ప స్థాయిలో ప్రకంపనలు సంభవించడం వల్ల ఇళ్లల్లోకి వెళ్లడానికి వెనుకాడారు. ఈ భూకంపం వల్ల ప్రాణనష్టం సంభవించినట్లు ఇప్పటివరకు సమాచారం అందలేదు. ఆస్తినష్టం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. భౌగోళికంగా- క్రియాశీలక భూకంప ప్రాంతం పాకిస్తాన్. యురేషియన్- ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ల పరిధిలోకి వస్తుందీ దేశం. దీని పరిధిలో తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, గిల్గిట్-బాల్టిస్తాన్, కొన్ని గిరిజన ప్రాంతాలు.. యురేషియన్ ప్లేట్ దక్షిణ అంచున ఉన్నాయి. సింధ్, పంజాబ్ ప్రావిన్స్‌తో పాటు మనదేశంలోని జమ్మూ కాశ్మీర్.. ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్స్ పరిధిలో ఉంటాయి. ఫలితంగా ఈ రీజియన్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తుంటాయని సెస్మాలజీ సెంటర్ తెలిపింది.

## విషాదాన్ని మిగిల్చిన గాలివాన

**(1వపేజీ తరువాయి)**మరణించారు. ప్రకాశం జిల్లా ఈదుమూడికి చెందిన గొర్రెల కాపరి నాగమల్లేశ్వరరావు(40) బాపట్ల జిల్లా చినగంజాంలో గేదెలు మేపుతున్న గడ్డం బ్రహ్మయ్య(50) పిడుగు పడటంతో మృతిచెందారు. కృష్ణా జిల్లా శ్రీకాకుళం రేవు నుంచి ద్విచక్రవాహనంపై గాజులంక వెళ్తున్న సుప్రదీప్(23) పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయాడు. పిడుగుపాటుకు గురై మండవల్లి మండలం చింతపాడు శివారు దెయ్యంపాడులో రైతు సైదు గిరిబాబు(33) చనిపోయాడు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లిలో చెట్టు పడటంతో పదేళ్ల బాలుడు మామిడి బాలగోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు.

## కరాచీ బేకరీ పేరు మార్చాలంటూ

**(1వపేజీ తరువాయి)**ప్లకార్డులతో నిరసనలు చేపట్టారు. వాటిలో కరాచీ పేరు తొలగించి భారత్ ను గౌరవించాలనే నినాదాలు ఉన్నాయి. జాతీయ జెండాలతో జాగరణ సమితి కార్యకర్తలు ఈ నిరసన చేపట్టారు. కాసేపు నిరసనల తర్వాత వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఇప్పటివరకూ భారత్-పాక్ మధ్య ఎన్ని విభేదాలున్నా, యుద్ధాలు కూడా జరిగినా కరాచీ బేకరి పేరు మార్పు డిమాండ్ మాత్రం ఎక్కడా వినిపించలేదు. కానీ ప్రస్తుతం పహల్గాం దాడి తర్వాత మాత్రం ఇలా కరాచీ బేకరీ పేరుపై కూడా హిందూ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇలా నిరసనలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. అయితే నిరసన శాంతియుతంగానే సాగడంతో పోలీసులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.మరోవైపు పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ పై పరిమితంగా అయినా దాడి చేసేందుకు భారత్ సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రధాని మోదీ త్రివిధ దళాధిపతులతోనూ సమావేశమయ్యారు. ఇవాళ రక్షణ కార్యదర్శితోనూ భేటీ అయ్యారు. పాకిస్తాన్ పై యుద్ధసన్నద్ధతను వారితో చర్చించారు.

## ఎకరం రూ.20 కోట్లు.. అమరావతిలో భూముల విక్రయం

**అమరావతి-నవభూమి:**ఎకరం రూ.20 కోట్లు.. అమరావతి భూముల విక్రయానికి ప్రభుత్వం సన్నాహాలు! ఎకరా రూ.20 కోట్లు కనీస ధర నిర్ణయించి సుమారు 4 వేల ఎకరాలు విక్రయించడం ద్వారా రూ.80 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం నిధుల వేట ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతోంది. దాదాపు రూ.లక్ష కోట్ల రూపాయలతో రాజధాని అమరావతిని అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రజలపై ఒక్కపైసా భారం పడకుండా పూర్తిగా సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా అమరావతిని ప్రాజెక్టు చేస్తున్నారు. ఇందులో భాగంగా రైతుల నుంచి 34 వేల ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. మరో 20 వేల ఎకరాలు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని చెబుతున్నారు. దీంతో నిధుల సమీకరణకు సంబంధించి తొలివిడతగా నాలుగు వేల ఎకరాలను విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నెల 2న అమరావతి పనుల పునఃప్రారంభాన్ని ప్రధాని మోదీ చేతులమీదుగా చేపట్టారు. దీనికి దాదాపు రూ.49 వేల కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు.



## హారన్ మోగించవద్దన్న సెక్యూరిటీ గార్డు.. వాహనంతో ఢీకొట్టిన డ్రైవర్



**న్యూఢిల్లీ-నవభూమి:** నైట్ డ్యూటీ చేసిన సెక్యూరిటీ గార్డు ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. క్రాసింగ్ వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నించాడు. ఎదురుగా వచ్చిన ఎస్‌యూవీ వాహనం డ్రైవర్ పలుసార్లు హారన్ మోగించాడు. దీనిపై అభ్యంతరం తెలిపిన సెక్యూరిటీ గార్డును వాహనంతో ఢీకొట్టి తొక్కించాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌కు చెందిన రాజీవ్ కుమార్, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి నైట్ షిఫ్ట్ డ్యూటీ చేశాడు. సోమవారం ఉదయం మహిపాల్‌పూర్ క్రాసింగ్ వద్ద క్యాబ్ దిగాడు. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు.కాగా, రోడ్డు క్రాసింగ్ వద్ద ఎస్‌యూవీ వాహనం రాజీవ్ కుమార్ సమీపానికి వచ్చింది. డ్రైవర్ పలుసార్లు హారన్ మోగించాడు. హారన్ మోగించవద్దని రాజీవ్ కుమార్ చెప్పాడు. దీంతో ఆగ్రహించిన డ్రైవర్, తన వాహనంతో కుమార్‌ను ఢీకొట్టాడు. వాహనాన్ని రివర్స్ చేసి రోడ్డుపై పడిన కుమార్‌ను టైర్లతో తొక్కించాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు.మరోవైపు సెక్యూరిటీ గార్డు రాజీవ్ కుమార్ ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే అతడి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని ఆసుపత్రికి తరలించి అడ్మిట్ చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఎస్‌యూవీ వాహనం డ్రైవర్ విజయ్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## శబరిమలకు రాష్ట్రపతి ముర్ము..

### ఆలయాన్ని సందర్శించబోయే తొలి ప్రెసిడెంట్‌గా రికార్డు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పాటు కేరళ లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో శబరిమల అయ్యప్ప ఆలయాన్ని కూడా సందర్శించనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఈనెల 18, 19 తేదీల్లో రాష్ట్రపతి ముర్ము కేరళలో పర్యటించనున్నారు. 18వ తేదీన రాష్ట్రపతి కొట్టాయం చేరుకుంటారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 19వ తేదీన పంపా బేస్ క్యాంపుకు వెళ్లనున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి శబరిమల అయ్యప్ప ఆలయం వద్దకు చేరుకోనున్నారు. అయితే, అందరి భక్తుల్లా రాష్ట్రపతి కొండపైకి వెళ్తారా.. లేక అత్యవసర అవసరాల కోసం ఉపయోగించే రహదారి ద్వారా ఆలయానికి చేరుకుంటారా అన్నదానిపై స్పష్టత లేదు. దీనిపై స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ నిర్ణయం తీసుకుంటుందని ట్రావెన్‌కోర్ దేవస్వం ప్రెసిడెంట్ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ద్రౌపదీ ముర్ము ఓ రికార్డు నెలకొల్పనున్నారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రెసిడెంట్‌గా ముర్ము నిలవనున్నారు.

## ఓబీసీ కోటా దుర్వినియోగం.. చిక్కుల్లో యూపీఎస్సీ ర్యాంకర్ పూర్వ చౌదరి




**న్యూఢిల్లీ-నవభూమి:** యూపీఎస్సీ పరీక్షలో మరో వివాదం బయటపడింది. ర్యాంక్ హోల్డర్ పూర్ చౌదరిపై ఆరోపణలు వచ్చాయి. ఆల్ ఇండియా ర్యాంక్‌లో ఆమెకు 533 ర్యాంక్ వచ్చింది. తన ర్యాంక్ వివరాలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీంతో ఆమెపై విమర్శలు గుప్పుమన్నాయి. ఓబీసీ-నాన్ క్రీమీ లేయర్ కోటాను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి.సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఫోటోల్లో పూర్వ చౌదరీ చాలా లగ్జరీగా ఉన్నట్లు కనిపించింది. 4 లక్షల ఖరీదైన బ్యాగ్‌ను ఆమె ధరించింది. అంతర్జాతీయ ట్రిప్‌లకు కూడా వెళ్లినట్లు తన ఫోటోల ద్వారా తెలుస్తోంది. ఆమె తండ్రి ఏడీఎం. అయితే ఆమె ఎలా ఓబీసీ-ఎన్సీఎల్ సర్టిఫికేట్ వాడిందని నెటిజన్లు ప్రశ్నించారు. యూపీఎస్సీలో మరో కోటా స్కామ్ జరిగినట్లు కొందరు ఆరోపించారు.ఓబీసీ కోటా కింద పూర్వ చౌదరీ సెలెక్ట్ అయినా.. ఇన్‌స్టా అకౌంట్ ఫోటోలు ఆమె విలాస జీవితాన్ని ప్రతిబింబింప చేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. రిజర్వేషన్ దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో.. పూర్వ చౌదరీ తన ఇన్‌స్టా అకౌంట్‌ను డిజైబుల్ చేసింది. దాంట్లోని ఫోటోలను డిలీట్ చేసింది.పూర్వ తండ్రి పేరు ఓం ప్రకాశ్ సహరన్. ఆయన రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో ఆఫీసర్. తన కుమార్తెను ఆయన డిఫెండ్ చేసకున్నారు. 44 ఏళ్ల వయసులో ఆర్ఏఎస్ ఆఫీసర్‌ను అయ్యానని, కాబట్టి తన కుమార్తె సర్టిఫికేట్‌ను దుర్వినియోగం చేయలేదనట్లే అవుతుందన్నారు. రాజస్థాన్‌లోని కోట్‌పుత్లీలో అదనపు జిల్లా కలెక్టర్‌గా సహరన్ చేస్తున్నారు.కోటా అర్హతల గురించి తప్పుడు సమాచారం చేరవేస్తున్నారని పూర్వ తండ్రి ఆరోపించారు. క్లాస్ వన్ గవర్నమెంట్ పోస్టుల్లో ప్రమోషన్ పొందిన లేదా అపాయింట్ అయిన వారికి మాత్రం అనర్హత రూల్స్ వర్తిస్తాయన్నారు. తన కూతురిది ఆ కేసు కాదన్నారు.

## మద్యం మత్తులో ఎయిర్‌హోస్టెస్‌పై లైంగిక వేధింపులు.. వ్యక్తి అరెస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** విమాన ప్రయాణంలో చోటు చేసుకునే కొన్ని ఘటనలు ప్రముఖంగా వార్తల్లో నిలుస్తుంటాయి. ముఖ్యంగా ప్రయాణికుల ప్రవర్తన చర్చకు దారితీస్తుంటుంది. కొందరు వ్యక్తులు తప్పతాగి వికృతచేష్టలకు పాల్పడుతుంటారు. మరికొందరు తోటి ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటారు. తాజాగా ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో ఎయిర్‌హోస్టెస్ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఢిల్లీ -శిర్డీ విమానంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఎయిర్ ఇండియాకు చెందిన విమానం శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి శిర్డీకి బయల్దేరింది. అయితే, అందులోని ఓ ప్రయాణికుడు ఎయిర్ హోస్టెస్ పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె వెంటనే ఈ విషయాన్ని క్రూ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లింది. విమానం టాయిలెట్ వద్ద సదరు ప్రయాణికుడు తనను అసభ్యకరంగా తాకినట్లు ఫిర్యాదు చేసింది. దీంతో విమానం శిర్డీ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కాగానే అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించగా అతడు మద్యం తాగినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు.

## ఇదేం పని మంత్రి గారూ.. సమస్య తీర్చమంటే ఫోన్ లాక్కుంటారా..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఓ మీటింగ్ తర్వాత కన్హయ్య లాల్‌తో పాటు అడవులు, పర్యావరణ శాఖ మంత్రి సంజయ్ శర్మ బయటకు వచ్చారు. వీరిని ఆఖేపుర మొహల్లాకు చెందిన మహిళలు, యువకులు చుట్టు ముట్టారు. తమ సమస్య గురించి వారిని ప్రశ్నిస్తూ ఉన్నారు.ఎన్నికల ముందు ఓట్ల కోసం రాజకీయ నాయకులు జనాల చుట్టూ తిరగటం.. ఎన్నికల తర్వాత జనాలు వారి చుట్టూ తిరగటం సర్వ సాధారణ విషయం. ఏదైనా సమస్య ఉండి.. దాని గురించి చెబుదామంటే ఓట్లు వేసి గెలిపించిన వ్యక్తి మళ్లీ ఊర్లోకి అడుగు కూడా పెట్టడు. ఆయన దగ్గరకు వెళితే.. ట్రీట్మెంట్ వేరేలా ఉంటుంది. తాజాగా, రాజస్థాన్‌కు చెందిన ఓ మంత్రి.. సమస్య గురించి అడగడానికి వచ్చిన యువకుడితో కరుకుగా ప్రవర్తించాడు. సమస్య గురించి స్పందించాల్సింది పోయి.. అతడి ఫోన్ లాక్కున్నాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే..

రాజస్థాన్‌లోని ఆఖేపుర మొహల్లాకు చెందిన ప్రజలు గత కొంతకాలంనుంచి తీవ్రమైన నీటి సమస్యతో బాధపడుతున్నారు. సమస్య గురించి అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోలేదు. దీంతో వారు నీటి వనరుల శాఖ మంత్రి కన్హయ్య లాల్ చౌదరిని కలవడానికి మినీ సెక్రటేరియట్‌కు వెళ్లారు. ఓ మీటింగ్ తర్వాత కన్హయ్య లాల్‌తో పాటు అడవులు, పర్యావరణ శాఖ మంత్రి సంజయ్ శర్మ బయటకు వచ్చారు. వీరిని ఆఖేపుర మొహల్లాకు చెందిన మహిళలు, యువకులు చుట్టు ముట్టారు. తమ సమస్య గురించి వారిని ప్రశ్నిస్తూ ఉన్నారు.

## గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకునే దిశగా ఇజ్రాయెల్.. పక్కా ప్లాన్ ప్రకారం..!



**ఇజ్రాయెల్-నవభూమి:** గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుని, నిర్దిష్ట కాలం పాటు అక్కేడ ఉండేలా ఇజ్రాయెల్ ఓ ప్రణాళికను సిద్ధం చేసినట్లు ఆ దేశ భద్రతా మంత్రివర్గం వెల్లడించింది. గాజాకు చెందిన ఉగ్రవాద సంస్థ హమాస్ నుంచి బందీలను విడుదల చేయడానికి, అలాగే ఇజ్రాయెల్ నిబంధనలు మేరకు కాల్పుల విరమణపై చర్యలు జరిపేలా ఒత్తిడి తీసుకు రావడంలో భాగంగానే ఈ ప్లాన్ వేసినట్లు వివరించింది. అయితే ఈ ప్రణాళిక ప్రకారం లక్షలాది మంది పాలస్తీనియన్లను దక్షిణ గాజాకు తరలిస్తున్నట్లు కూడా స్పష్టం చేసింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. ఇజ్రాయెల్ సైనిక చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ ఆదివారం రోజు మాట్లాడుతూ.. 10 వేల మంది సైన్యాన్ని గాజాకు తీసుకువెళ్తున్నామని వివరించారు. వీరంతా అక్కడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడి చేస్తారని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటికే గాజాలోని సగం భూభాగాన్ని స్వాధీనం చేసుకుని నియంత్రిస్తోంది. ఇందులో ఇజ్రాయెల్ సరిహద్దులో ఒక బఫర్ జోన్ అలాగే స్ట్రిప్ వెంట తూర్పు-పడమర వైపున ఉన్న మూడు కారిడార్లు ఉన్నాయి.

**ఇప్పటికే సగం గాజా హస్తగతం..**


కొన్ని వారాలుగా తీవ్రవాద హమాస్ గ్రూపుపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు ఇజ్రాయెల్ అనేక ప్రయత్నాలు చేస్తోంది. మార్చి ప్రారంభంలో గాజాకు సహాయం అందకుండా చేసింది. ఇప్పటికీ దానిని కొనసాగిస్తూనే వస్తోంది. తాజాగా మరో కొత్త ప్రణాళికకు ఇజ్రాయెల్ ఆమోదం తెలిపింది. ఇజ్రాయెల్ సైన్యం లక్షలాది రిజర్వ్ సైనికులను మోహరించి, లక్షలాది పాలస్తీనియన్లను గాజా దక్షిణ భాగానికి తరలించేందుకు ప్రణాళికలు రచించింది. ఇప్పటికే సగం గాజాను హస్తగతం చేసుకున్న ఇజ్రాయెల్, గాజాకు ఏ సహాయం అందకుండా అడ్డుకుంటోంది. దాని వల్ల గాజాలో నిత్యావసరాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీని వల్ల దోపిడీలు పెరిగిపోయాయి. అయితే గాజాలో హమాస్ చేస్తున్న సహాయ పంపిణీ వల్ల వారి అధికారం బలోపేతం అవుతుందని భావిస్తున్న ఇజ్రాయెల్.. దానిని పూర్తిగా అడ్డుకునేలా ఈ కొత్త ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇజ్రాయెల్ చేస్తున్న చర్యలను ఐక్యరాజ్య సమితి ఖండించింది. ఇది సైనికి ఒత్తిడి పద్ధతి అంటూ విమర్శించింది. మరోవైపు గాజాలోని హమాస్ శిబిరాలపై ఇజ్రాయెల్ల వైమానికి దాడులు కొనసాగుతున్నాయి. ప్రాణనష్టం గణనీయంగా ఉంటోంది.

## జమ్మూ కాశ్మీర్‌పై మరో ఉగ్రదాడి.. ఈసారి జైళ్లను టార్గెట్ చేయనున్న ఉగ్రవాదులు!



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దేశంలోని కీలక ప్రాంతాలకు హై అలర్ట్ విధించారు. భారీగా బందోబస్తును మోహరించి.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టింది. ఇక జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా బలగాలు, పోలీసులు అనుక్షణం గస్తీ కాస్తున్నారు. ఈ ఒక్క ఉగ్రదాడి కారణంగా.. దేశవ్యాప్తంగా తీవ్ర అప్రమత్త చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ఉగ్రవాదులు.. మరోసారి జమ్మూ కాశ్మీర్ లక్ష్యంగా భీకర దాడికి తెగబడే అవకాశాలు ఉన్నట్లు భారత నిఘా వర్గాలకు ఉప్పందింది. దీంతో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇక జమ్మూ కాశ్మీర్‌లో ఉన్న జైళ్లే లక్ష్యంగా ఈసారి ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాద సంస్థలకు చెందిన హై ప్రొఫైల్ నాయకులు జమ్మూ కాశ్మీర్ జైళ్లలో ప్రస్తుతం ఖైదీలుగా ఉన్నారు. అయితే వారిని విడిపించడం కోసం ఉగ్రవాదులు భారీ కుట్రకు తెరలేపినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో అలర్ట్ అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలకు దిగాయి. ఈ నేపథ్యంలోనే కాశ్మీర్‌లోని శ్రీనగర్ సెంట్రల్ జైల్, కోట్ బాల్వాల్ జైల్.. జమ్మూలోని జైళ్లకు భారీగా బలగాలను మోహరించి పెద్ద ఎత్తున భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే పహల్గామ్ ఉగ్రదాడి దర్యాప్తులో భాగంగా చాలా మంది స్లీపర్ సెల్స్, ఓవర్ గ్రౌండ్ వర్కర్లను అదుపులోకి తీసుకుని ఈ జైళ్లలో నిర్బంధించారు.మరోవైపు.. ఈ పహల్గామ్ ఉగ్రదాడికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడిన వారు మాత్రమే కాకుండా గతంలో ఆర్మీ వాహనంపై దాడి చేసిన కేసులో నిందితులుగా ఉన్న నిస్సార్, ముష్తాక్ సహచరులను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) ప్రశ్నిస్తోంది. ఈ క్రమంలోనే జమ్మూ కాశ్మీర్‌లో ఉన్న జైళ్లపై దాడి జరగొచ్చనే కీలక సమాచారం నిఘా వర్గాలకు అందింది. దీంతో ఆయా జైళ్ల వద్ద భారీగా సెక్యూరిటీ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే శ్రీనగర్‌లో ఉన్నతాధికారులతో సీఐఎస్ఎఫ్ డీజీ ఇదే విషయంపై భేటీ అయి చర్చించినట్లు తెలుస్తోంది. 2023 నుంచి జమ్మూ కాశ్మీర్‌లో జైళ్ల భద్రతను మొత్తం సీఐఎస్ఎఫ్ బలగాలు చూసుకుంటున్నాయి.ఇదే సమయంలో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం.. జమ్మూ కాశ్మీర్‌లో పోలీసులు, భద్రతా బలగాలు.. భారీ ఆపరేషన్లు చేపడుతున్నారు. ఉగ్రవాద మూలాలను గుర్తించే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే పూంచ్ జిల్లాలో సోమవారం భద్రతా దళాలు ఒక ఉగ్రస్థావరాన్ని గుర్తించాయి. ఆ ఉగ్రస్థావరంలో కమ్యూనికేషన్ పరికరాలు, ఐదు ఐఈడీలు దొరకడం సంచలనం రేపుతోంది. ఇక ఇది సురాన్ కోట్ ప్రాంతానికి అతి సమీపంలోనే ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## కశ్మీర్‌లో భారీ ఉగ్రస్థావరం గుట్టురట్టు..



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గామ్ ఘటన తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు వేట కొనసాగిస్తున్నాయి. ఇదే సమయంలో వారికి సహకరించిన వాళ్లను అరెస్ట్ చేస్తున్నారు. కుల్గాం జిల్లాలో సైన్యం నుంచి తప్పించుకోడానికి ఉగ్రవాదులకు సాయం చేసిన వ్యక్తి నదిలోకి దూకి చనిపోయిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో ఉగ్రస్థావరాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా, సోమవారం పూంచ్ జిల్లాలో భారీ డంప్‌ను భద్రతా దళాలు గుర్తించాయి. ఇందులో భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. అధికారుల వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆర్మీ, జమ్మూ కశ్మీర్ పోలీసు, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో వినియోగానికి సిద్ధంగా ఉన్న ఐదు ఐఈడీలు (పేలుళ్ల పరికరాలు), వైర్‌లెస్ సెట్లు, కొన్ని దుస్తులు లభ్యమయ్యాయి.

ఈ ఐఈడీలు సగటున అర కిలో నుంచి ఐదు కిలోల వరకు బరువుండగా, అధికారులు వాటిని సంఘటన స్థలంలోనే నిర్వీర్యం చేశారు. భారీ దాడికి ఉగ్రవాదులు చేసిన కుట్ర భగ్నమైందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఐఈడీల్లో రెండు స్టీల్ బకెట్లలో ఉండగా, మిగతా మూడు టిఫిన్ బాక్సుల్లో భద్రపరచారని చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడిలో పాల్గొన్న స్థానిక ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం ధ్వంసం చేసింది.

## ఎవరీ శివానంద బాబా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ యోగా గురువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి శివానంద బాబా కన్నుమూశారు. 128 ఏళ్ల వయసు కల్గిన ఆయన వారణాసిలోని ఆయన స్వగృహంలోనే శనివారం రోజు రాత్రి ప్రాణాలు విడిచారు. అయితే ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండే ఆయన.. గత కొంత కాలంగా వయసురీత్యా వచ్చే అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ.. చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న రాజకీయ ప్రముఖులు అంతా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా అనేక మంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

ఎవరీ శివానంద బాబా?

1896 ఆగస్టు 8వతేదీన అవిభాజ్య భారత్‌లోని సిల్హెట్ జిల్లాలోని ఓ నిరుపేద కుటుంబంలో స్వామి శివానంద జన్మించారు. అయితే ఆయనకు ఆరేళ్ల వయసు ఉండగానే.. తల్లిదండ్రులు ఇద్దరూ ప్రాణాలు విడిచారు. దీంతో ఆయన బంగాల్‌లోని ఓ ఆశ్రమంలో పెరిగారు. గురు ఓంకారానంద గోస్వామి ఆయనను పెంచి పెద్ద చేశారు. తన వద్ద ఉండగానే.. శివానంద బాబాకు ఆధ్యాత్మిక విషయాలు సహా యోగా నేర్పించారు. ఇలా ఆయనకు మొదటి నుంచి వీటిపై ఆసక్తి పెరగ్గా.. యోగాలో నిష్ణాతులయ్యారు. అలా యోగా గురువుగా మారిన ఈయన.. సమాజ సేవ కూడా చేశారు.ముఖ్యంగా ఎవరూ దగ్గరకు రానీయని, ఎవరూ పట్టించుకోని కుష్టు రోగులకు ఆయన సేవ చేయాలని భావించి.. పూరికి వెళ్లారు. అక్కడే ఉంటూ గత 50 సంవత్సరాలలో 400 నుంచి 600 మంది కుష్టు రోగులకు సేవలు అందించారు. విషయం గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. ముఖ్యంగా 2022లో అప్పటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందించారు. ఆ సమయంలో తెల్లని ధోతి, కుర్తా ధరించి కాళ్లకు చెప్పులు కూడా లేకుండా వచ్చి పురస్కారాన్ని అందుకోగా.. ప్రజలంతా ఫిదా అయ్యారు. అంత సామాన్య మానవుడిలా ఉండడాన్ని చూసి మురిసిపోయారు.

అంత్యక్రియలు ఎక్కడ, ఎప్పుడంటే?

అయితే శనివారం రోజు అనారోగ్య సమస్యలతో శివానంద బాబా మృతి చెందగా.. ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. కాశీ నివాసి అయిన శివానంద బాబా జీ మరణం నాకు చాలా బాధ కల్గించిందని చెబుతూ.. ఆయన మృతి తీరని లోటని వివరించారు. అలాగే ఆయన దేశానికి చేసిన సేవలు.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. అలాగే యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ స్పందిస్తూ.. యోగా రంగానికి అసమానమైన కృషి చేసిన కాశీ యోగా గురు మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆయన చేసిన సేవలు దేశ ప్రజల గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని చెప్పుకొచ్చారు. మరోవైపు ఆయన అంత్యక్రియలను సోమవారం రోజు ఉదయం మణికర్ణికా ఘాట్‌లో నిర్వహిస్తామని ఆశ్రమవాసి అయిన బంగియా సమాజ్‌కు చెందిన దేభాషిష్ దాస్ తెలిపారు.

## పాక్‌కు చుక్కలు చూపించేందుకు భారత్ పక్కా ప్లాన్!

**జమ్ము కశ్మీర్:నవభూమి:** ఉగ్రవాదానికి అండగా నిలుస్తూ మనదేశం మీద కయ్యానికి కాలుదువ్వుతున్న పాకిస్తాన్ కు బుద్ధి చెప్పేందుకు భారత్ సిద్ధమైందా? ప్రపంచ దేశాలకు మన సత్తా చాటేలా, పాక్‌ను చిత్తు చేసేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తోందా? పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌ను మట్టికరిపించేందుకు త్రివిధ దళాలతో భారత్ సిద్ధమైందా? అంటే, అవునన్న సమాధానాలే వినిపిస్తున్నాయి.భారత్ పక్కా ప్లాన్‌తో యుద్ధానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం భారత్ తీసుకుంటున్న చర్యలు, వేస్తున్న అడుగులు పాక్ మీద భారీ దాడికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో వేగంగా పరిణామాలు మారుతున్నాయి. ఇప్పటికే త్రివిధ దళాలతో సమావేశాలు నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ, పాక్‌పై మూడు వైపుల నుంచి దాడి చేసేందుకు రెడీ అయ్యారు. పాక్‌కు ఊపిరి సలపకుండా దెబ్బకొట్టేందుకు బ్లూప్రింట్ కూడా రెడీ చేస్తున్నట్లు సమాచారం.వారం రోజుల్లో కార్యచరణ ప్రారంభించి, నిర్దిష్ట చర్యలు తీసుకోవడానికి భారత్ రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. అరేబియా సముద్రంలో నేవీ సర్వసన్నద్ధంగా ఉంది. ఎల్ఓసీ వెంబడి ఎనిమిది చోట్ల పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడితే, భారత్ దీటుగా సమాధానమిచ్చింది. ఇప్పటికే సరిహద్దుల్లో భారీ సైన్యాన్ని, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను మోహరించి భారత్ సిద్ధమవుతోంది.పెద్ద ఎత్తున ఆర్మీ కదలికలు కూడా పాక్ మీద త్వరలో భారీ దాడి జరగబోతోందనే సంకేతాలను ఇస్తున్నాయి.

## భారీ రోడ్డు ప్రమాదం.. ఇండియన్ ఐడల్ విన్నర్‌కు తీవ్ర గాయాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ సింగర్, ఇండియన్ ఐడల్ 2 విజేత పవన్ దీప్ రాజన్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. అహ్మదాబాద్‌లో సోమవారం తెల్లవారుజామున 3.40 గంటలకు ఆయన కారు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రాజన్‌కు వైద్యులు చికిత్స చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గాయాలతో ఆయన తీవ్ర వేదన అనుభవిస్తున్న దృశ్యాలు చూసి అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో అధికారులు ప్రకటించాల్సి ఉంది %ఘటన గురించి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. ఆయన ఆరోగ్యంపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన తాజా ఆరోగ్య స్థితిపై కూడా అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. కొన్ని రోజుల క్రితం తన పుట్టిన రోజు జరుపుకున్న రాజన్‌కు అభిమానులు వివిధ వేదికల ద్వారా పెద్ద ఎత్తున శుభాంకాంక్షలు తెలిపారు. ఇంతలోనే యాక్సిడెంట్ విషయం వెలుగులోకి రావడంతో అభిమానులు, సంగీత ప్రియులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇండియన్ ఐడల్‌లో గెలిచాక పవన్‌దీప్ పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగిపోయింది. రాత్రికి రాత్రి అతడో సంచలనంగా మారిపోయాడు. గుండెలకు హత్తుకునేలా ఉండే పవన్‌దీప్ గాత్రం అతడికి లక్షల మంది అభిమానులను సంపాదించిపెట్టింది. ఇక సీజన్ ఫినాలేలో ఆయన ఐదుగురు ఫైనలిస్టులను వెనక్కు నెట్టి విన్నర్‌గా నిలిచారు. ఒక కారు, రూ.25 లక్షల నగదును బహుమతులుగా అందుకున్నారు.ఉత్తరాఖండ్‌కు చెందిన పవన్‌దీప్ కుటుంబానికి సంగీత నేపథ్యం ఉంది. ఆయన తల్లి సరోజ్ రాజన్, తండ్రి సురేశ్ రాజన్, సోదరి జ్యోతిదీప్ రాజన్.. కుమోనీ జానపద కళాకారులు. దీంతో, చిన్నతనంలోనే పవన్‌దీప్ సంగీత ప్రతిభ జనాలను ఆకర్షించింది. రెండేళ్ల వయసులోనే ఆయన తబలా వాయిద్యంలో ప్రావిణ్యం సంపాదించారు. అత్యంత పిన్నవయస్కుడైన తబలా ప్లేయర్‌గా అవార్డు పొందారు. ఇండియన్ ఐడల్‌కు ముందే ఆయన తన గాత్రంతో అనేక మంది అభిమానులను సంపాదించుకున్నారు. 2015లో వాయిస్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో బాలీవుడ్ సింగర్ షాన్ బృందంలో సభ్యుడిగా పాల్గొని విజేతగా నిలిచారు. రూ.50 లక్షల నగదు, ఓ కారును బహుమతులుగా అందుకున్నారు.

## అసెంబ్లీలో ప్రశ్నలు అడగకుండా రూ.20లక్షలకు ఫిక్సింగ్.. ఎమ్మెల్యే అరెస్ట్..



**న్యూఢిల్లీ-నవభూమి:** అసెంబ్లీలో ప్రశ్నలు అడగకుండా ఉండటానికి లంచం తీసుకున్న కేసులో ఎమ్మెల్యే అరెస్టయ్యారు. అసెంబ్లీలో మైనింగ్‌పై చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే.. ప్రశ్నలు అడగకుండా ఉండేందుకు రూ.20లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కేసులో సదరు ఎమ్మెల్యేను పోలీసులు అరెస్ట్ చేశారు. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..రాజస్థాన్ జిల్లాలోని కరౌలి జిల్లాలోని తోడభీమ్ బ్లాక్‌లో మైనింగ్ లీజులకు సంబంధించి అసెంబ్లీలో గతంలో చర్చ నడిచింది. దీనిపై బాగిడోరాకు చెందిన భారత్ ఆదివాసీ పార్టీ ఎమ్మెల్యే జైకృష్ణ పటేల్ ప్రశ్నించారు. అయితే మళ్లీ మైనింగ్‌పై ప్రశ్నలు అడగకుండా ఉండేందుకు సదరు మైనింగ్ యజమాని నుంచి ఎమ్మెల్యే రూ.10 కోట్లు డిమాండ్ చేశాడు. చివరకు రూ.2.5 కోట్లకు ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించి ముందుగా రూ.1లక్ష అందించారు. తర్వాత రూ.20 లక్షలు ఇవ్వాల్సి ఉంది.ఈ క్రమంలో డబ్బు తీసుకునేందుకు.. జైపూర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని సంబంధిత వ్యక్తులను ఎమ్మెల్యే పిలిపించారు. జైకృష్ణ చెప్పినట్లుగానే సదరు మైనింగ్ వారు రూ.20లక్షలను అందించారు. ఆ డబ్బును ఎమ్మెల్యే.. తన అనుచరుడికి ఇచ్చి ఇంటికి పంపించారు. అయితే అయితే అదే సమయంలో ఏసీబీ అధికారులు ఎంటరై.. ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యేను అరెస్ట్ చేయబోతున్నట్లు సీఎం భజన్‌లాల్, స్పీకర్ వాసుదేవ్‌కి తెలియజేసి, ముందస్తు అనుమతి తీసుకున్నారని తెలిసింది. ఎమ్మెల్యే డబ్బు తీసుకుంటున్నట్లు తమ వద్ద ఆడియో, వీడియో ఫుటేజ్‌లు ఉన్నట్లు ఏసీబీ డైరెక్టర్ రవి ప్రకాష్ మెహర్దా తెలిపారు. డబ్బు సంచితో పారిపోయిన ఎమ్మెల్యే అనుచరుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఎమ్మెల్యే లంచం తీసుకుంటూ పట్టుబడటం రాష్ట్ర ఏసీబీ చరిత్రలో ఇదే మొదటి సారని ఏసీబీ డీజీ రవిప్రకాశ్ తెలిపారు. కాగా, ఎమ్మెల్యే కృష్ణ పటేల్ గత ఏడాది జరిగిన బగిడోరా ఉప ఎన్నికల్లో భారత్ ఆదివాసీ పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బాగిడోరా నియోజకవర్గం నుంచి గెలుపుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మహేంద్రజిత్ మాల్వియా బీజేపీలో చేరారు. దీంతో అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో ఉప ఎన్నికల్లో జైకృష్ణ పటేల్ బీజేపీ అభ్యర్థి సుభాష్ తంబోలియాపై 51 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
మంగళవారం
06 : మే : 2025



## టెల్‌అవీవ్ విమానాశ్రయ సమీపంలో క్షిపణి దాడి



న్యూఢిల్లీ-నవభూమి: ఇజ్రాయెల్ నగరం టెల్‌అవీవ్‌లోని ఓ విమానాశ్రయానికి సమీపంలో ఆదివారం ఉదయం క్షిపణి దాడి జరగడంతో ఢిల్లీ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న తన విమానాన్ని ఎయిర్ ఇండియా అబుదాబికి మళ్లించింది. టెల్ అవీవ్‌లో ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం ఏఐ139 దిగడానికి అరగంట ముందు ఈ క్షిపణి దాడి ఘటన జరిగింది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా అధికారులు అప్రమత్తమయ్యారు. మే 6 వరకు టెల్‌అవీవ్‌కు విమానాల రాకపోకలను తక్షణమే నిలిపివేసినట్టు ఎయిర్ ఇండియా తెలిపింది. టెల్‌అవీవ్ నుంచి ఢిల్లీకి ఆదివారం రావాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని కూడా రద్దు చేశారు. యెమెన్ నుంచి హౌతీ రెబెల్స్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి టెల్‌అవీవ్‌లోని బెన్‌గురియన్ విమానాశ్రయం మూడో టెర్మినల్‌కు 75 మీటర్ల దూరంలో పడింది. దీంతో 25 మీటర్ల లోతు గొయ్యి ఏర్పడింది. కాగా క్షిపణిని అడ్డుకోవడానికి పలు ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమైనట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ పేర్కొంది. క్షిపణి దాడి నేపథ్యంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తీవ్ర హెచ్చరిక చేశారు. విమానాశ్రయదాడికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు.



## ఆవేదనలోనూ మతం ఉన్నదా

ఈ దుఃఖ సమయంలో మోహన్ దాస్ కరంచంద్ గాంధీ జీవించి ఉంటే ఏమి చేసి ఉండేవారు? కలకత్తా, నౌఖాలీలో ఛిద్రమైన మానవతను చిగురించజేసినట్లుగానే ఆయన ఇప్పుడు కూడా కచ్చితంగా పహల్గాంకు వెళ్లి, ఉగ్రవాద భీభత్స బాధితుల కుటుంబ సభ్యులను, ఆ ఘాతుకం నుంచి ఎలాగో బయటపడ్డ వారిని పరామర్శించేవారు. వారితో కలిసి ప్రార్థనలు చేసేవారు. వేద మంత్రాలు పఠించాలని, భక్తి గీతాలు గానం చేయాలని, ఖురాన్ ప్రవచనాలు చదవాలని పట్టుబట్టి ఉండేవారు. పహల్గాంలోనే ఉండిపోయి వీధులలోను, కొండవాలుల్లోను సంచరిస్తూ ప్రతి గృహానికి, ప్రతి దుకాణానికి వెళ్లి గృహస్తులు, దుకాణదారులు, పట్టణవాసులు చెప్పేది సావధానంగా వినేవారు. వారి చేతులను ఆత్మీయంగా తన చేతుల్లోకి తీసుకునేవారు. అంతులేని వ్యాకులత, వీడని భీతిలో ఉన్న వారు తమ పనులు తాము చేసుకునేందుకు సహాయ పడేవారు. 'అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే కదా', వేదనకు సామాజిక అంతరాలు ఉండవని, జీవన వ్యాపకాలు కొనసాగేందుకు ఒకరికొకరు తోడ్పడుకుంటూ సమష్టిగా ముందుకు సాగాలని గాంధీ చెప్పి ఉండేవారు. గాంధీ ప్రేమానురాగాలు నిర్దేశించినవి. సామాజిక విధుల పాటింపును ఆయన పట్టించుకునేవారు కాదు. సమాజ నిర్దేశాలు మానవతా మమతలు పంచేందుకు ఆటంకాలు అని ఆయన భావించేవారు. మనిషి శ్రేయస్సు పట్ల ఎటువంటి సంకుచితత్వాలు లేని ఈ ఆరాటమే, గాంధీతో విభేదించేవారితో సహా ఎంతో మంది, ఆయనను మహాత్ముడుగా గౌరవించేలా చేసింది. ఒక మతోన్మాది కాల్పులకు ఆయన బలై 77 సంవత్సరాలు గడిచి పోయాయి. పహల్గాం సృష్టించిన ఈ దురవస్థలో నా ఆలోచనలు ఆయన వైపుకు మళ్లాయి. ఆ మహనీయ మానవతా స్ఫూర్తిని ఆవాహన చేసుకోవాలి కదా. ఉగ్రవాద దాడుల్లో చనిపోయిన వ్యక్తుల మత నేపథ్యం గురించి నేను సాధారణంగా ప్రస్తావించను. కుల మతాలు, మరేయితర సామాజిక అంతరాలకు అతీతంగా ప్రతి మనిషి జీవితమూ చాలా విలువైనది. మానవత అఖండమైనది. ప్రతి సామాన్యుడి జీవితమూ దానిలో ఒక అంతర్భాగం. ఉగ్రవాద ఘాతుకంలో, ఏ మతం వాడైనా లేదా నాస్తికుడు అయినా ఒక వ్యక్తి జీవితం ఛిద్రమైపోవడం మన మనసును గాయపరుస్తుంది, మన ఆత్మను చీల్చివేస్తుంది. మనలను ఒక నిస్సహాయత ఆవహించేలా చేస్తుంది. ఏమి చేయాలి? ఏమి చేయాలో తెలియని పరిస్థితిలోకి మనలను నెట్టి వేస్తుంది. దురాగతానికి పాల్పడినవారు తాము నిర్దిష్టంగా ఎవరిని లక్ష్యంగా చేసుకున్నది సందేహాతీతంగా చెప్పినప్పటికీ మన దుఃఖాలు, ఆవేదనలకు హత్యకు గురైన వారి సామాజిక%-% మత అస్తిత్వాలు కారణాలు కాకూడదు. బాధితుల సామాజిక, మత నేపథ్యాలను బట్టి మన ఆవేదనలు ఉండకూడదు. ఇది అరిగిపోయిన మాటే అయినప్పటికీ నేను మళ్లీ మళ్లీ చెప్పుతాను. ఉగ్రవాదులకు మతం లేదు. ఉగ్రవాదమే వారి మతం. తమది ఫలానా మతం అని వారు చెప్పవచ్చు. ఆ మతాన్ని తమ చర్యకు ఉపయోగించుకుని ఉండవచ్చు. అయితే అలా చేసే హక్కు వారికి లేదు. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు అవసరమైన చర్యలను ఏ ప్రభుత్వమైనా చేపట్టి తీరాలి. హింసాకాండ, జాతి విద్వేషం, మత మౌఢ్యాన్ని తిరస్కరించిన మనుషులుగా ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు మనమూ పూనుకోవాలి. పౌర సమాజ సభ్యులుగా అది మన కర్తవ్యం. అయితే నేడు బాధితుల మత అస్తిత్వం గురించి ప్రస్తావించకుండా ఉగ్రవాద దురాగతాల గురించి మాటా మంతీ జరపలేకపోతున్నాం. అలా చేయడంలో మనం ఒక సామాజిక బృందం పట్ల మన అపేక్షను వ్యక్తం చేస్తున్నాం. మరో వర్గం ప్రజల పట్ల వేలెత్తి చూపుతున్నాం. లేదా ఈ రెండిటి మధ్య ఒక సమతౌల్యతను పాటిస్తున్నాం. ఈ మూడు రకాల వైఖరులను మనం జాగరూకతతో ప్రదర్శిస్తున్నాం. ఈ బలవంతానికి ఆవలివైపు కొన్ని ఆశలు ఉన్నాయి. ప్రతి ఖండన మూల్యాంకనమవుతుంది. ఉగ్ర చర్యను ఖండించిన వ్యక్తి బాధితుడి సామాజికవర్గానికి చెందినవాడైతే బాధను వ్యక్తం చేయడంతో సరిపోతుంది. అయితే ఉగ్ర ఘాతుకానికి పాల్పడిన మతానికి చెందినవాడైతే ఆ ఖండన హెచ్చుస్థాయిలో ఉండాలని ఆశిస్తారు. ప్రతిస్పందన అంతకంటే ఏ మాత్రం తక్కువగా ఉన్నా ఆ వ్యక్తి మీద ఆరోపణలు వెల్లువెత్తుతాయి, వెలివేతకు దారితీస్తుంది. జనం ఇలా ఒక ఉచ్చులో చిక్కుకొని, తాము ఎటున్నాము, మిగతావారు తమను ఎలా చూస్తున్నారన్న సంశయంలో ఇరుక్కుంటారు. ఇలా ఆచితూచి స్పందించాల్సిన పరిస్థితికి లోనైనప్పుడు దుఃఖం అనేది కేవలం ఒక బాహ్య వ్యక్తీకరణగా, ఒక ముసుగులాగా మిగిలిపోతుంది. దుఃఖం ఒక శక్తిమంతమైన మానవానుభవం. మనలను సృజనాత్మక జీవులుగా పరివర్తన చెందించే శక్తి దానికి ఉన్నది. దుఃఖ సమయంలో సామాజిక చిరునామాలు అదృశ్యమవుతాయి, విభేదాలు, వ్యత్యాసాలు క్షయిస్తాయి. ఆనందం సైతం ఏకం చేయలేని విధంగా దుఃఖం మనుషులను సమైక్యపరుస్తుంది. సంతోష సంబరాల నుంచి మనం తేలిగ్గా వెనక్కి వెళ్లిపోగలం. అయితే బాధతో రోదించినప్పుడు, కుంగిపోయినప్పుడు మన చెంతనే ఎవరూ ఉన్నా వారిని చుట్టుకుపోతాం. పరస్పరం ఓదార్చుకుని సాంత్వన చెందుతాం. ఈ అనుద్దేశపూర్వకమైన భాగస్వామ్యంలో ఎటువంటి నిర్ణయమూ లేదు. ఒకసారి బాధాతప్త సమూహంలో భాగమైపోయినప్పుడు దాని నుంచి మనలను మనం విడదీసుకోవడం చాలా కష్టం. భావోద్వేగ సామీప్యత ప్రభావం మనలను వేరుపడనీయదు. ఉద్దేశపూర్వకంగా ఎవరూ తమ నిజభావాలకు విరుద్ధంగా ప్రవర్తించరు. ఈ మానవ ప్రవృత్తి కారణంగానే పహల్గాం, దాని పరిసర ప్రాంతాల ప్రజలు ఉగ్రవాద ఘాతుకం సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. ఆ దురాగతం తమకు ఏమి చేసిందో ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నప్పుడు వారి మాటల్లో ఆ మానవతా సున్నితత్వం మనకు అవగతమవుతుంది. వారి మాటల్లో ఆవేదన మనకు విశదమవుతుంది. ఆ దుర్మార్గ ఘటన తమ గడ్డపై జరిగినందుకు వారు లజ్జాభావంతో కుంగిపోతున్నారని కూడా మనం అర్థం చేసుకుంటాం. దురదృష్టవశాత్తు పహల్గాం ఉగ్రచర్యకు సాక్షులుగా ఉన్నవారి, ఆ ప్రాంతంలో నివసించే వారి ఆవేదనాపూరిత మాటలను ఉపేక్షించడం జరుగుతోంది. పహల్గాం విషయమై మాట్లాడేవారు నాతో సహా ఎవరూ కశ్మీర్‌లో నివసిస్తున్నవారు కాదు, ఆ ఉగ్రవాద దాడికి ప్రత్యక్షంగా ప్రభావితమైనవారూ కాదు. అయినప్పటికీ ఆ ఘటన విషాదానికి సంబంధించి హృదయాన్ని మెలిపెట్టే కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఆ తీవ్ర మనోవ్యాకులతతో మనం ఏం చేస్తున్నాం? ఆ విషాద అనుభవంతో మనం అంటిపెట్టుకుని ఉండాలి. పరిసరాల నైసర్గిక శోభను వీక్షిస్తూ తన్మయులై ఉన్న వారు ఉగ్రవాద నైచ్యం కారణంగా కొద్ది నిముషాలలో నిండు జీవితాలను కోల్పోవడం ఎంత బాధాకరమైన విషయం! ఆ కఠోర వాస్తవాన్ని అంగీకరించేందుకు ఎంతగా గింజుకోవాలి? అయితే మనం అందుకు బదులుగా ఆ ఘాతుక చర్యకు బలయిన మనుషులను మరచిపోయి, వారిని ఫలానా సామాజిక సమూహాలకు చెందినవారుగా గుర్తిస్తున్నాం. ఆగ్రహాన్ని, విద్వేషాన్ని వ్యక్తం చేస్తున్నాం. దుఃఖాన్ని అతిక్రమించినప్పుడు మనం ఇతరుల బాధల్లో పాలుపంచుకోలేం. సహానుభూతిని వ్యక్తం చేయలేం. ఆత్మరక్షణ కొరవడిన మానవ దుర్బలత్వాన్ని నిర్నిబద్ధంగా పంచుకోలేము. సామాజిక అనుబంధాలు రెండు విధాలుగా ఉపయోగపడతాయి. ఒకరు హిందువు అయితే, ఉగ్రదురాగతం పట్ల ఆవేదన వ్యక్తం చేసేందుకు ఆ ఘటన బాధితులు హిందువులు అన్నది స్పష్టమవడం తప్పనిసరి అవుతుంది. హతుడి మత అస్తిత్వం తెలియనప్పుడు బాధ వ్యక్తీకరణ హృదయపూర్వకంగా ఉండదు. హిందువులు 'ఇతరులు' మాదిరిగా తమ సొంత మతస్తుల

### భారతదేశంలో సంస్కరణలకు పునాది వేసిన

# మహానుభావుడు చత్రపతి సాహు మహారాజ్



**భారత దేశంలో రిజర్వేషన్ల పితామహుడు సామాజిక ప్రజాస్వామ్య కు మూలస్థంభం**

**విద్యాసంస్థల నెలకొల్పి బాల బాలికలకు విద్య నేర్పించిన ఘనుడు**

**పరిపాలనలో అందరికీ భాగస్వామ్యం కల్పించిన మహారాజు**

**ఆనాటి సంస్కరణలే నేటి భారత రాజ్యాంగానికి మూలాలు**

**సాహూ మహారాజ్ అంటే సాహసానికి మరో పేరు**

**( మే 6 న చత్రపతి సాహు మహారాజ్ 103 వ వర్ధంతి సందర్భంగా వ్యాసం )**

భారత రిజర్వేషన్ల పితామహుడు., భారత సామాజిక ప్రజాస్వామ్య మూలస్థంభం "ఛత్రపతి సాహు మహారాజ్" 103 వ వర్ధంతి నేడు . 1874 జూన్ 26న రాధాబాయి, జయసింగ్ ఆబాసాహేబ్ ఘాట్గేలకు జన్మించిన యశ్వంతరావు ఘాట్గేనే ఆ తర్వాత కాలంలో సాహుమహారాజ్ గా ప్రసిద్ధి చెందాడు.

భారతదేశ చరిత్రలో బహుజనులను బ్రాహ్మణుల పెత్తనం నుండి విముక్తి చేయటానికి సైద్ధాంతికంగా., పాలనపరంగా మహాత్మ జ్యోతిబా పూలే., ఛత్రపతి శివాజీల వారసుడిగా కృషి చేసి భవిష్యత్ భారతానికి సామాజిక న్యాయ-ప్రజాస్వామిక తాత్విక పునాదిని ఏర్పరచి ప్రజల రాజుగా చేసి మిగిలిపోయిన మహనీయుడు రాజర్షి ఛత్రపతి సాహుమహారాజ్.

ఘాట్గేలు మహారాష్ట్ర లో వెనుకబడిన తరగతులకి ఓబీసీ చెందిన వ్యవసాయం చేసుకుని జీవించే కున్బీ కాపు కులం. ఛత్రపతి శివాజీ స్థాపించిన మరాఠ సామ్రాజ్యంలోని కొల్హాపూర్ రాజ్యంలో వారసులు లేకుంటే నాల్గవ శివాజీ భార్య రాణీ ఆనందబాయి 1884 మార్చి , 17 న తన బంధువుల అబ్బాయిని దత్తపుత్రుడిగా స్వీకరించి యశ్వంత్ రావు ఘాట్గే కి ముద్దుగా ' సాహు ' అని పేరు పెట్టుకుంటది. మూడేళ్ళకే తల్లిని కోల్పోయిన సాహు , 1886 మార్చి 20 న తండ్రి మరణంతో 11 ఏళ్ళకే తల్లిదండ్రులిద్దరులేని వాడైనాడు .సాహు చిన్నతనమంతా ఆంగ్లేయ అధ్యాపకుల పర్యవేక్షణ లో జరిగినందున ఆధునిక భావాలు పుణికి పుచ్చుకున్నాడు .యుక్తవయసు రాగానే 1894 ఎప్రిల్ 2 న సింహాసనం అధిష్టిస్తాడు సాహు మహారాజ్. 1900 వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఒక రోజు సాహు మహారాజ్ పంచగంగా నదిలో స్నానం చేస్తున్న సమయంలో బ్రాహ్మణ పురోహితుడు స్నానం చేయకుండానే వచ్చి సాహు మహారాజ్ క్షత్రియ వంశస్తుడు కానందున ఒక వ్యవసాయం చేసుకునే కులానికి చెందిన శూద్రుడైనందున ఈసడింపుతో వేదోక్త మంత్రాల బదులు పౌరాణిక మంత్రాలు చదివి అవమానిస్తాడు . పుట్టుకతోనే మనిషి కులం నిర్ణయించబడుతుందనీ రాజైనంత మాత్రాన , దత్తత వచ్చినంత మాత్రాన క్షత్రియుడిగా మారిపోడని వాదనకు దిగుతాడు. ఈ సంఘటన సాహు మహారాజ్ ని మహాత్మ జ్యోతిబాపూలే సత్యశోధక సమాజ్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే వారసత్వాన్ని ఎన్నుకోవడానికి కారణమైతది. బాస్కరరావు జాదవ్ అనే ఉద్యోగిని ' సత్యశోధక్ సమాజ్ ' నడిపే బాధ్యతలు అప్పచెప్పి ' మరాఠ దీనబందు ' పేరుతో పత్రికని నడిపించి సత్యశోధక సమాజ తాత్విక దృక్పథాన్ని ప్రచారం చేయించిండు . బ్రాహ్మణేతరులకి పురోహిత శిక్షణనిచ్చేందుకు సత్యశోధక్ సమాజ్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రారంభమైంది. కొల్హాపూర్ పరిసర ప్రాంతాల్లో వందలాది వివాహాలు , వేడుకలు సత్యశోధక్ సమాజ్ పద్ధతిలో జరిగాయి. తను సింహాసనం అధిష్టించే నాటికి తన రాజ్యంలో మత కర్మలలో మొదలు పరిపాలనలోని అన్ని ఉద్యోగ రంగాలతో పాటు వ్యాపారం , వడ్డీ వ్యాపారం లో కూడా బ్రాహ్మణులే నిండిపోవడం సాహు గమనించిండు . బ్రాహ్మణేతరులని ఉన్నతోద్యోగాల్లోకి తెస్తే తప్ప వారి సామాజిక హోదాలో , జీవితాల్లో మార్పు రాదని , బ్రాహ్మణ ఆధిపత్యానికి అడ్డుకట్టపడదని సాహు భావించిండు . తన ప్రైవేట్ సెక్రెటరీ ఉద్యోగానికి అండర్ గ్రాడ్యేట్ డిగ్రీ స్థాయి లేని అయిన ఒక జైనుడిని ఎన్నిక చేసుకుంటే బ్రాహ్మణ సమాజం ఏకమై పెద్ద ఎత్తున నిరసన తెలియచేసింది. ఐతే ఆ రాజ్యంలో అప్పటికి గ్రాడ్యేషన్ పూర్తి చేసిన బ్రాహ్మణేతరుడు ఒక్కరు లేరు. సమస్యను గుర్తించిన సాహు వెనుకబడిన కులాల వారందరికి స్కూల్స్ , హాస్టల్స్ ప్రారంభించి విద్యని ఒక ఉద్యమంగా నడిపిండు . కొల్హాపూర్ పట్టణంలో హాస్టల్స్ కాలనీనే నిర్మించిండు . ప్రపంచ చరిత్రలో ఇదొక అరుదైన విషయం. 1901 లో జైన హాస్టల్ , విక్టోరియ మరాఠ హాస్టల్ , 1906 లో ముస్లింలకు , 1907 లో వీరశైవ లింగాయత్ లకు , 1908 లో అంటరానివారికి , మరాఠాలకీ 1921లో దర్జీ మరియు నేత కులస్తులకి నామ్ దేవ్ హాస్టల్ , విశ్వకర్మలకి సోనార్ హాస్టల్స్ నిర్మించిండు .ప్రతి గ్రామంలో కనీసం ఒక ప్రాథమిక పాఠశాలనేర్పరచి అందరికి , అన్ని కులాల వారికి ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యనందించిండు . పాఠశాలలకు



స్వంత భవనాలు ఏర్పడే వరకు గ్రామాల్లోని అన్ని ఆలయాలను , చావడీలను పాఠశాలలుగా వాడాలనీ , ఏ గ్రామంలో ఏ కులస్తులు మెజారిటీ గా ఉన్నారో చూసి ఆ కులపు వ్యక్తినే ఉపాధ్యాయుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులనిచ్చింది. ముస్లింలకు వాళ్ళ మాతృ భాషలోనే పాఠశాలలు ప్రారంభమైనాయి . ఆ తర్వాత కాలంలో కొంత మార్పు రాగానే కులపరమైన విద్యాసంస్థలని రద్దు చేస్తూ అన్ని కులాల , మతాల వారు కలిసిమెలిసి ఏ పాఠశాలలోనైనా , విద్యా సంస్థలో నైనా చదువొచ్చని ప్రకటన ఇచ్చింది సాహు ప్రభుత్వం .వ్యవసాయం ఇతర వృత్తులు చేసే వయోజనుల కోసం రాత్రి పాఠశాలలు ఏర్పడ్డాయి. జులై 26 , 1902 భారత దేశ చరిత్రలో ఒక చరిత్రాత్మక దినం. ఆ రోజు ఛత్రపతి సాహు మహారాజ్ ప్రభుత్వం ,ప్రభుత్వ పాలన వ్యవహారాల్లో ' ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంత ' ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వోద్యోగాలన్నింటిలో వెనుకబడినవర్గాల వారికి 50 శాతం రిజర్వేషన్ లు కల్పిస్తూ సంచలనాత్మక ఉత్తర్వులని జారీ చేసింది . వెనుకబడిన వర్గాలు అనగా బ్రాహ్మణ , ప్రభు , షెన్వీ , పార్శీ మరియు ఇతర అభివృద్ధి చెందిన కులాలు మినహా మిగిలిన అన్ని కులాల వారు . అంటరానివారి నుండి అన్ని మతాలలో వెనుకబడినవారు కూడా రిజర్వేషన్ కిందికే వస్తారు. బాలగంగాధర తిలక్ లాంటి బ్రాహ్మణ జాతీయోద్యమ నాయకులు సాహు మహారాజ్ నడిపిస్తున్న పూలే వారసత్వ ఉద్యమాన్ని , పరిపాలన లో చేస్తున్న మార్పులని చూసి ఓర్వలేక అనేక కుట్రలు చేస్తారు. దాడికి దిగుతారు. గ్రామ పరిపాలన రంగంలో వంశపారంపర్యంగా వచ్చే ముఖ్యులైన పటేల్ పాటిల్ , పట్వారీ కులకర్ణి వ్యవస్థని 1918 లో రద్దు చేసిండు .ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయినంకా దాదాపు 66 సంవత్సరాలకు రద్దైంది పటేల్ , పట్వారి వ్యవస్థ. ఉపాధ్యాయులుగా కూడా వారసత్వంగా పని చేయడాన్ని రద్దు చేసిండు . టీచర్ ట్రైనింగ్ మరియు పాటిల్ ట్రైనింగ్ స్కూల్స్ పెట్టించిండు. విద్యారంగం లో సాహు కృషి కేవలం అక్షరాస్యత కే కాకుండా సంగీత, సాహిత్య , నాటక ప్రక్రియలన్నింటిని ప్రోత్సా హించిండు . సాహు ఆస్థానంలో అల్లాదియాఖాన్ అనే గొప్ప సంగీత విద్యావేత్త ఉండేవాడు . రాజవల్లి అనే గొప్ప గాయనీ ఉ%శీ%దేది.సాహు కాలంలో నాటక రంగం అభివృద్ధి చెందింది. కొల్హాపూర్ జ్ఞాన సమాజ్ , కిర్లోస్కర్ కంపెనీ , స్వదేశ్ - హితా చింతక్ వంటి నాటక సమాజాలకు ఉదారంగా విరాళాలిచ్చేవాడు .భారత దేశంలో మొట్టమొదటి మహిళా నాటక సమాజమైన ' శేషశాని స్త్రీ సంగీత నాటక మండలి ' కొల్హాపూర్ కి చెందినదే . సాహు ఏర్పరిచిన భూమిక పై నుండే వి.శాంతారాం , మాస్టర్ వినాయక్ షిండే లాంటి ప్రసిద్ధులైన సినిమా దర్శకులు కొల్హాపూర్ ప్రాంతం నుండి వచ్చారు.ఒక ఉద్యమాన్ని నడిపించే నాయకుడు కేవలం ఉపన్యాసాలిస్తే సరిపోదని తను చెప్పిన ఆచరించి చూపిండు సాహు మహారాజ్ . నిరక్షరాస్యుడైన గంగారామ్ కాంబ్లే అనే అంటరాని వక్తి ఆధారం చూపించమంటే సాహు డబ్బిచ్చి హోటల్ పెట్టిస్తే ఎవరు ఆ హోటల్ కి రాకుంటే సాహు మహారాజ్ స్వయంగా తన పరివారంతో వెళ్ళి ముందు తను టీ తాగి తన వాళ్ళందరికి తాగిస్తాడు . పాలన నిర్వహణకి అవసరమైన విద్యార్హతలు లేని అంటరాని వారిని తన కుటుంబంలో వివిధ రకాల పనులకి తీసుకున్నాడు . రథచోదకులుగా , మావటీలుగా , రక్షకభటులుగా నియమించిండు . 1919 , సెప్టెంబర్ 6న అంటరానితనాన్ని పాటించడం నేరమని ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. అంటరాని ఉద్యోగులతో ప్రజలు గానీ , ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర ఉద్యోగులు అగౌరవంగా ప్రవర్తిస్తే పిర్యాదు అందితే నేరస్తుల మీద చర్యలు తీసుకుంటామని, నేరస్తులు ఉద్యోగులైతే ఆరు వారాల్లోగా విచారణ జరిపి నేరస్తులని తేలితే ఉద్యోగం నుండి తొలగింపుతో పాటు పెన్షన్ కూడా రద్దైపోతుందని ప్రకటించిన మహానుభావుడు సాకు మహారాజ్ . భారత ప్రభుత్వం తెచ్చిన ఎస్.సి. ఎస్.టీ. అట్రాసిటీ చట్టం కూడా ఇంత బలమైనది కాదు. 1920 మే , 3వ తేదిన వెట్టిచాకిరి వ్యవస్థ ని రద్దు చేస్తూ చట్టం చేసింది ప్రభుత్వం . ఆ తర్వాత 55 ఏండ్లకు స్వాతంత్రం వచ్చినంకా 1975 లో మాత్రమే భారత ప్రభుత్వం వెట్టిచాకిరి నిర్మూలన చట్టం చేసింది . గ్రామీణ పరిపాలనలో కింది స్థాయి ముఖ్య ఉద్యోగాలైన ' తలారీ ' సుంకరి , గ్రామ రెవెన్యూ సహాయకులు లుగా అస్పృశ్యులే ఉంటారు కాబట్టి వాళ్ళందరికి ఉద్యోగ నిర్వహణకు అవసరమైన శిక్షణనిచ్చేందుకు ట్రేనింగ్ స్కూల్స్ ప్రారంభించారు. 1919 నవంబర్ 6 న వెలువడిన చట్టం ప్రకారం అన్ని విధాల వృత్తుల్లోను , ఉద్యోగాల్లోను ఉండే అస్పృశ్యులకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాన్ని కల్పించిండు. ఇప్పటికీ గ్రామీణ స్థాయి గ్రామ రెవెన్యూ సహాయకులకి ఈ సదుపాయం నేటి ప్రభుత్వాలు కల్పించలేదు . కనీస వేతనాలు లేవు. సాహు మహారాజ్ అంటరానివారికి ఆపద్బాంధవుడిగా మారిన విషయం తెలుసుకున్న బాబా సాహేబ్ అంబేద్కర్ సాహు మహారాజ్ ల మధ్య పరిచయం పెరిగి రాబోయే బ్రిటీష్ చట్టాలు మంచిచెడుల గురించి మాట్లాడుకునేవారు. అంబేద్కర్ అస్పృశ్యుల హక్కుల సాధన కోసం ఒక పత్రిక పెట్టాలనుకుంటున్నాననీ , ఐతే ఆర్థిక ఇబ్బందులతో చేయలేకపోతున్నానడంతో ఆ పత్రిక కి ఆర్థిక వనరులు సమకూర్చే బాధ్యతను తీసుకొని మొదట 2500 రూపాయలు ఇవ్వడంతో ' మూక్ నాయక్ ' పత్రిక ప్రారంభమైంది. 1920 , ఎప్రిల్ 15 న నాసిక్ లో అంబేద్కర్ మరియు మిత్రులు అంటరానివారికోసం ఒక హాస్టల్ కట్టాలనుకుంటే ఆ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరై ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు సాహు మహారాజ్ . 1920 లో అంబేద్కర్ ఇంగ్లాండ్ వెళ్ళి చదువుకొనుటకై ఆర్థిక సహాయం చేస్తాడు సాహు మహారాజ్ . అంబేద్కర్ విదేశాల్లో ఉన్నంత కాలం ' మూక్ నాయక్ ' పత్రిక నిర్వహణ కి ఆర్థిక సహాయం చేసిండు .రమాబాయి యోగక్షేమాలను విచారిస్తూ , ఆమెకు అవసరమైన ఆర్థిక సహాయం చేస్తూ బాధ్యత గల స్నేహితుడిగా వ్యవహరించిండు సాహు మహారాజ్ . 1922 ఫిబ్రవరి 16న డిల్లీలో జరిగిన అంటరాని కులాల జాతీయ మహాసభలో పాల్గొన్న సాహు మహారాజ్ ' ఈ సభలో ప్రసంగించే అర్హత నాకన్న మించి ఉన్న అంబేద్కర్ ఇంగ్లాండ్ లో ఉన్నందున పాల్గొనలేకపోవడం మన దురదృష్టం. మీ జాతి గర్వించదగిన మహోన్నత నాయకుడు అంబేద్కర్ ను మీరందరు ఆదర్శంగా స్వీకరించాలని , ఆయన స్థాయికి అందుకోవడానికి మీ అభివృద్ధికి కావలిసిన సేవలను అందించడానికి నన్ను అనుమతించమని ప్రార్థన అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు . పితృస్వామ్య , కుల , మత వ్యవస్థల వల్ల స్త్రీల మీద జరుగుతున్న అమానుషాలని గ్రహించిన సాహు మొదట తన భార్య లక్ష్మీబాయి కి యూరోపియన్ టీచర్ ల ద్వారా ఆధునిక విద్యను చెప్పించారు . సంగీతంలో , చిత్రలేఖనంలో , ఎంబ్రాయిడరీ లో శిక్షణ ఇప్పించారు .కొల్హాపూర్ సంస్థానంలో బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభం చేశారు .ఉన్నత విద్యలోకి బాలికలను ప్రోత్సహించేందుకు ఉపకారవేతనాలు , ప్రోత్సాహక బహుమతులు ఏర్పాటు చేసారు . కొల్హాపూర్ రాజారాం కాలేజీ లో బాలికలకు ప్రత్యేక విభాగం ఏర్పరిచారు . వెనుకబడిన ఆడపిల్లలకు ఉచిత భోజన , వసతి సదుపాయాలు కల్పించారు . 1919 జూన్ లో బాల్య వివాహాల రద్దు చట్టం వచ్చింది. 1919 జులై 12న కులాంతర , వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ చట్టం తెచ్చిన ' కొల్హాపూర్ స్పెషల్ మ్యారేజీ ఆక్ట్ - 1918 ' ప్రకారం ఎందరో యువతీ యువకులు తమకు నచ్చిన భాగస్వామ్యులని ఎన్నుకున్నారు. విడాకులు మంజూరు చేయడం లో స్త్రీల నిర్ణయానికే ప్రాధాన్యతనిస్తూ 1919 ఆగస్ట్ 2 న విడాకుల చట్టం మరియు స్పెషల్ మ్యారేజీ ఆక్ట్ అప్పుడు దేశంలో సంచలనాలను సృష్టించాయి. 1920 జనవరి 17న జోగిని , దేవదాసీ వ్యస్థను రద్దు చేసారు . ప్రభుత్వం దేవదాసీ ల పునరావాసానికి చర్యలు తీసుకుంది. 1919 జులైలో వ్యభిచార వృత్తిలో ఉన్న స్త్రీలకు పునరావాసాన్ని కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించిండు. కొల్హా పూర్ ప్రాంతంలోని కోర్టులన్ని%శీ%టిలో సివిల్ , క్రిమినల్ కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతుండేది. రోజుకి ఎన్ని కేసులు విచారణ జరుపుతామనే అంచన లేక పెద్ద సంఖ్యలో పిలవడము చాలా మంది కేసు బెంచ్ మీదికి రాకనే తిరిగి పోవడం పదే పదే జరుగడంతో చాలా మంది పేదలు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యకి పరిష్కారంగాను 1919 అక్టోబర్ 17న చట్టం చేస్తూ రోజు కు కేవలం మూడు కేసులకి మించి విచారణకు స్వీకరించకూడదు.అక్కడ సరైన న్యాయం జరగలేదని ఏ పౌరుడైనా భావిస్తే నేరుగా మహారాజ్ ని కలవచ్చు నని ఆదేశాలు జారీ చేశారు సాహు మహారాజ్ . 1920 లో రూపొందించిన హిందూ న్యాయశాస్త్రం లోని అనేక అంశాలను స్వాతంత్రానంతరం రూపొందిన ' హిందూ పర్సనల్ లా ' లో భాగంగా భారత పార్లమెంట్ ఆమోదించింది.ఉన్నత విద్యావంతుడైన సాహు మహారాజ్ నిరంతరం ప్రజల మద్యే ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ ప్రజల భాషలో మాట్లాడేవాడు .

పరిపాలనలో ప్రజలకు అర్థం కాని , ప్రజలకు ఇబ్బంది కల్గించే బ్రాహ్మణ గుమాస్తాల , పట్వారీలు వాడే మోడీ లిపిని పరిపాలన వ్యవహారాల్లో రద్దు చేస్తూ 1917 మార్చి లో నిర్ణయం తీసుకున్నాడు .

కరువు వచ్చినపుడు రైతులకు అన్ని రకాల పన్నులను , రుణాలని మాఫీ చేసిండు . అప్పుల కింద రైతుల ఆస్తులని , పనిముట్లనీ , పశువులని బలవంతంగా జప్తు చేసే చర్యలను నిషేధిస్తూ 1894 లోనే చట్టం చేసిండు. 1918 లో తన రాజ్యంలో వడ్డీ వ్యాపారాన్ని పూర్తిగా నిషేధిస్తూ సహకార సంఘాలని ఏర్పాటు చేసిండు . రాజ్యంలో ప్లేగు వ్యాధి వచ్చినపుడు టెలిఫోన్ వ్యవస్థను ఏర్పాటు చేసి యంత్రాంగాన్ని సమర్థవంతంగా పని చేయించారు సాహు మహారాజ్ .

రాధానగరి , పనాలా , కరవీర్ , శిరోల్ వంటి ప్రాజెక్ట్ లని నిర్మించిండు . ' కింగ్ ఎడ్వర్డ్ అగ్రికల్చరల్ ఇన్స్టిట్యూట్ ' ద్వారా రైతులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిండు. తన తండ్రి పేరుతో ఏర్పరచిన ' జైసింగ్ రావు ఘాట్గే టెక్నికల్ ఇన్స్టిట్యూట్ ' ద్వారా సాంకేతిక శిక్షణ లభించి పరిశ్రమలు ఏర్పడ్డాయి. చక్కర కర్మాగారాలు , బట్టల మిల్లులు , గోనే సంచుల ఫ్యాక్టరీలు , చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పడ్డాయి. స్వాతంత్రం గురించి సాహు 1917 , డిసెంబర్ 27 నాసిక్ లో జరిగిన సభలో ' ఇపుడున్న కులవ్యవస్థ యధాతథంగా కొనసాగుతూ ఉండేట్లైతే ఒకవేళ మన చేతికి రాజకీయాధికారం వచ్చినప్పటికీ అదొక నియంతృత్వ రాజ్యం గానే తయారవుతుందని సాహు మహారాజ్ ఆందోళన వ్యక్తం చేశారు.స్వరాజ్యం పేరిట ఒక నియంతృత్వ రాజ్యం ఏర్పడటాన్ని నిరోధించాలంటే కనీసం పదేళ్ళ పాటు వెనుకబడిన కులాలకు విద్యా , ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం కల్పించే విధానం కొనసాగాలి అని సూచించారు . బొంబాయి ప్రెసిడెన్సి బ్రిటీష్ ప్రభుత్వ సెక్రెటరీ లార్డ్ విల్లింగ్టన్ కు 1917 , డిసెంబర్ 29 న లేఖ రాస్తూ ' వెనుకబడిన కులాలను , ముఖ్యంగా అస్పృశ్యులను సామాజికంగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను గురించి గతంలో నేను ప్రస్తావించి ఉన్నాను కనుక కొత్తగా రూపొందుతున్న భారత రాజ్యా%శీ%గం లో ఈ కులాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించవలసిందిగా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను అని, అస్పృశ్యులకు సంబంధించి మరింత శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయం వెలి బుచ్చారు. ' ప్రభుత్వం నియమించబోయే స్థానిక పాలక మండళ్ళలో వెనుకబడిన కులాలకు , అస్పృశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ముంబాయిలో కార్మికుల సమస్యల పైన ర్యాలీ పాల్గొని వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ' రష్యా , జర్మనీ , ఇంగ్లాండ్ లలో వలే యుక్త వయసు వచ్చిన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు ఉండాలి అని మొదటిసారి ప్రతిపాదించిన భారతీయుడు సాహు మహారాజ్ 1917 లో మరాఠ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ ' నేనిక్కడికి ఒక మహారాజ్ గా రాలేదు ఒక సామాన్యుడిగా వచ్చాను. మీరు నన్ను మీలోని ఒక శ్రామికుడిగా , రైతుగా భావించవచ్చు. నా పూర్వీకులు ఇదే పని చేశారు ' అనడం సాహు మహారాజ్ ఎంతటి నిగర్వి , సామాన్య ప్రజలకు ఎంత దగ్గరగా చేరువయ్యాడో అర్థం చేసుకోవచ్చు. అందుకే ఒక అమెరికన్ చరిత్రకారుడు ఇలా అంటాడు ' సాదారణ రైతు కుటుంబానికి , వెనుకబడిన కులానికి చెందిన జ్యోతిబాపూలే సామాజిక ఉద్యమ కారుడు కావడంలో ఆశ్చర్యం లేదు. కానీ ఒక రాజు అయిన సాహు మహారాజ్ ఇంత నిబద్ధతతో సామాజిక ఉద్యమాలను నిర్వహించడం నిజంగా అరుదైన విషయం అని కొనియాడారు . కేవలం మహారాష్ట్ర కే కాకుండా దక్షిణ భారతంలో జస్టిస్ పార్టీ ఉద్యమంతో పాటు భారతదేశం మొత్తం మీద ప్రభావం చూపిన సాహు మహారాజ్ మే 6 , 1922 న మరణించిండు . అతని మరణాంతరం అంత్యక్రియలు సైతం బ్రాహ్మణేతర పురోహితుల చేత జరిగాయి. భారతదేశంలో మొట్టమొదటి తత్వవేత్తగా అన్ని వర్గాల ప్రజల క్షేమం సంక్షేమం కోరిన గొప్ప మహానుభావునిగా చరిత్ర ఎక్కా రు. కొల్లాపూర్ సంస్థానంలో మహారాజు గా ఉన్న సాహూ మహారాజ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం చేయకపోతే ఈ దేశంలో అణగారిన ప్రజల హక్కులు ఎలా ఉండేవి వారి జీవన విధానం ఎలా ఉండేది అని ఎవరికి వారు ప్రశ్న వేసుకుంటే వివక్షతతో కూడి ఉండేదని ఇంకా దుర్భర జీవితం ఉండేదని మనందరికీ తెలుసు.

సాహు మహా రాజ్ సేవలను గుర్తించిన బహుజన్ సమాజ్ పార్టీ నిర్మాత ఆనాటి ముఖ్యమంత్రి మాయావతి తో కలిసి లక్నోలో స్ఫూర్తి చిహ్నాన్ని నిర్మించి గౌరవించారు. బహుజనుల కోసం మహాత్మ జ్యోతిబాపూలే , సాహూ మహారాజు లాంటి చరిత్రలను నేటి తరానికి అందించవలసిన బాధ్యత చరిత్రకారుల పైన ఉంది.

**( వ్యాసం సోషల్ మీడియా సేకరణ )**

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**



## ఈ యోగం గురించి ఆనాడే...

భక్తి

ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు మాత్రమే మానవులు అత్యున్నతమైన ఆనంద స్థితికి చేరుకోగలరు. దీనికోసం తపస్సులు చేయనక్కరలేదు. ఉపవాసాలు ఉండనక్కర్లేదు. ఏ కులం, మతం, ప్రాంతం వారైనా, పురుషులైనా, స్త్రీలైనా దాన్ని సాధించవచ్చు" అని ప్రబోధించడమే కాదు... సహజయోగ ద్వారా దాన్ని ఆచరణాత్మకంగా నిరూపించారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. కాగా, ఇటువంటి మార్గాన్ని మానవాళికి చూపించడానికి ఒక యోగి రాక గురించి, ఆ యోగం తాలూకు లక్షణాల గురించి పూర్వ గ్రంథాలలో ప్రస్తావన ఉండడం విశేషం. సప్త ఋషులలో ఒకరైన భృగు మహర్షిని జ్యోతిష శాస్త్రానికి ఆద్యుడిగా భావిస్తారు. ఆయన 'భృగు సంహిత' కన్నా ముందే గొప్ప నాడీ గ్రంథాన్ని (భృగు నాడి) రచించారు. పురాతన జ్యోతిష గ్రంథాల్లో నేటికీ దాన్ని ప్రామాణికమైనదిగా పరిగణిస్తారు. దీనిలో భవిష్యత్తులో జరగబోయే గొప్ప ఆధ్యాత్మిక సంఘటనలను కూడా అందులో వివరించారు. ఆ గ్రంథాన్ని మూడు వందల ఏళ్ళ క్రితం ఆచార్య శ్రీభుజేందర్ మరాఠీ భాషలో తర్జుమా చేశారు. అందులో ప్రస్తావితమైన భవిష్య వాణి ప్రకారం:ఇప్పుడు అందరికీ సాధ్యమే...బృహస్పతి మీనరాశిలో ఉన్నప్పుడు... పరబ్రహ్మ స్వరూపమైన ఒక గొప్ప యోగి భూమిపై అవతరిస్తారు. కొన్నేళ్ళ తరువాత... ఒక కొత్త యుగం ప్రారంభం అవుతున్నట్టు చాలామందికి స్పష్టంగా తెలుస్తుంది. మానవుడి జీవితం సంపూర్ణ పరివర్తనకు లోనవుతుంది. అలాంటి సమయం ఆసన్నమయ్యేవరకు... ఒక యోగి లేదా భక్తుడు మోక్షం ద్వారా లభించే ఆనందం పొందాలన్నా, జీవిత పరమార్థం తెలుసుకోవాలన్నా కేవలం భక్తి, జ్ఞానం, ప్రాచీన యోగమార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే సాధ్యం. కానీ దానికోసం అతను తన సూక్ష్మ శరీరంలో నిద్రాణ స్థితిలో ఉన్న వివిధ చక్రాల శక్తులను మేలుకొలపడం కోసం, కుండలినీ శక్తి ఉద్దీపన కోసం తీవ్రమైన తపస్సు చేయవలసి ఉంటుంది. కానీ ఆ గొప్ప యోగి రూపొందించే సరికొత్త యోగ పద్ధతి ద్వారా మానవులు తమ జీవితకాలంలోనే మోక్షం తాలూకు ఆనందాన్ని పొందగలుగుతారు. దేనినీ త్యాగం చేయవలసిన అవసరం ఉండదు. అప్పటిదాకా గొప్ప గొప్ప యోగులు మాత్రమే... అదికూడా వారు సమాధి స్థితికి చేరుకొని, మరణించడానికి ముందు మాత్రమే ఈ బ్రహ్మానందాన్ని అనుభవించగలుగుతారు. కానీ ఈ కొత్త తరహా యోగం ద్వారా సమాధి స్థితిలోకి చేరకుండానే అది సాధ్యం అవుతుంది. ప్రారంభంలో ఈ యోగాన్ని, తద్వారా మోక్షాన్ని పొందడం లక్షల్లో ఒకరికి మాత్రమే సాధ్యం అవుతుంది. ఆ తరువాతి కాలంలో మానవ జాతి మొత్తానికి అది వ్యాప్తి చెందుతుంది. అప్పుడు ప్రజలు నిత్యావసరాలకు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. వారు సాధారణ జీవితాలను గడుపుతూనే... ఈ యోగ పద్ధతి ద్వారా భగవంతుడితో ఐక్యతను అనుభూతి చెందుతారు. అజ్ఞానం, మాయ ముసుగులు తొలగిపోతాయి. గతంలో యోగులు చాలా కష్టపడి, తీవ్ర తపస్సు ఫలితంగా సాధించిన అనంతమైన ఆనందం, మోక్షం ఎంతోమంది మానవులకు సులభంగా అందుబాటులోకి వస్తుంది.కొత్తదేం కాదు...ఆ గ్రంథంలో పేర్కొన్న సమయం... నిర్మలాదేవి సహజయోగ పద్ధతిని ఆవిష్కరించిన సమయం దాదాపుగా సరిపోతున్నాయి. ఆమె భౌగోళికంగా భారతదేశానికి మధ్యలో ఉన్న చింద్వారా ప్రాంతంలో... పగలు, రాత్రి సమానంగా ఉండే విషువత్తు రోజున... 1923 మార్చి 21 మధ్యాహ్నం పన్నెండు గంటలకు జన్మించారు. 1970 మే 5వ తేదీన సహజ యోగ మార్గాన్ని ఆవిష్కరించచారు. ఎలాంటి తపస్సులు, బాధలు, ఉపవాసాలు లేకుండా, అన్ని కోరికలను త్యజించాల్సిన అవసరం లేకుండా... దీని ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందవచ్చునని స్పష్టం చేశారు. కుండలినీ శక్తిని ఆమె ఉత్థానం చేయడాన్ని, ఆ శక్తి ఉత్థానం చెందినప్పుడు వివిధ చక్రాల వద్ద కలిగే ప్రతిసంందించడాన్ని వేలాదిమంది తిలకించారు.

## విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి



లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.

# చమట పొక్కులకు చెక్



వేసవిలో పిల్లలను వేధించే ప్రధాన సమస్య... చమట పొక్కులు. ఈ సమస్య నుంచి పిల్లలకు ఉపశమనం కలగడం కోసం కొన్ని చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే...
శరీరంపై చమట ఆరిపోవడం లేదా, చర్మపు ముడతల్లో చమట, మట్టి పేరుకుపోవడం మూలంగా చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు ఈ కాలంలో ఇబ్బంది పెడతాయి. సాధారణంగా మామిడి పండ్లు తినడం వల్ల వేడిచేసి సెగ గడ్డలు మొదలయ్యాయని అందరూ అనుకుంటూ ఉంటారు. కానీ సెగ గడ్డలకు కారణం చర్మం మీద చమట ఇంకిపోయి, చర్మ రంధ్రాలు మూసుకుపోయి, ఇన్‌ఫెక్షన్ తలెత్తడమే! చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, సెగ గడ్డలు పిల్లలను వేధించకుండా ఉండాలంటే రోజుకు రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి. వీటికి తోడు ఈ అదనపు జాగ్రత్తలు కూడా పాటించాలి.

చల్లని వాతావరణం: చల్లనీటి స్నానంతో శరీర ఉష్ణోగ్రత తగ్గి, ఉపశమనం కలుగుతుంది. అలాగే పిల్లలు గాలి ధారాళంగా చొరబడే వీలున్న చల్లని గదుల్లోనే ఉండాలి

దుస్తులు: తేలికగా, చమటను పీల్చుకునే, గాలి చొరబడే వీలున్న మెత్తని దుస్తులనే పిల్లలకు వేయాలి

ఉపశమనం: పొక్కిన ప్రదేశంలో దురద, మంటలను తొలగించడం కోసం చల్లని తడి వస్త్రాన్ని కప్పి ఉంచవచ్చు. లేదా వస్త్రంలో మంచు ముక్కలను ఉంచి, కాపడం పెట్టుకోవచ్చు

**ఆయింట్‌మెంట్లు:** జిడ్డుగా ఉండే తైలాలు, ఆయింట్‌మెంట్లు పూయకూడదు

గోకకూడదు: చమట పొక్కులు వచ్చిన ప్రదేశాల్లో దురద సహజం. కాబట్టి పిల్లలు అదే పనిగా గోక్కునే ప్రయత్నం చేస్తారు. దాంతో పుండ్లు పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఉపశమనం దక్కడం కోసం ఆయా ప్రదేశాల్లో సున్నితంగా రుద్దాలి

**ఓట్‌మీల్:** చర్మం మంట తగ్గడం కోసం స్నానం నీళ్లకు ఓట్‌మీల్ జోడించాలి

సోడా ఉప్పు: చర్మరంధ్రాలు తెరుచుకుని, ఇన్‌ఫ్లమేషన్ తగ్గడం కోసం రెండు స్పూన్ల సోడా ఉప్పును స్నానం చేసే నీళ్లలో కలుపుకోవాలి

**నియంత్రణ ఇలా...**

నీళ్లు: శరీరంలో నీరు తరిగిపోకుండా చూసుకుంటే చమట పొక్కుల సమస్య తలెత్తకుండా ఉంటుంది. కాబట్టి పిల్లలు సరిపడా నీళ్లు తాగుతున్నారో లేదో గమనించుకుంటూ ఉండాలి

అలసట: ఎండలో ఎక్కువసేపు ఆడుతూ చమటలు పట్టకుండా చూసుకోవాలి

**పౌడర్:** అదనపు చమటను పీల్చుకునేలా చమట పట్టే వీలున్న ప్రదేశాల్లో టాల్కమ్ పౌడర్ చల్లాలి. అయితే అవసరానికి మించి పౌడర్ చల్లితే, చర్మ రంధ్రాలు మూసుకుపోయి చమటపొక్కులు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి పౌడర్‌ను పరిమితంగా వాడుకుంటూ, రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి

వైద్యులను ఎప్పుడు కలవాలి?
మూడు రోజులు దాటినా చమట పొక్కులు తగ్గనప్పుడు.చమట పొక్కుల తీవ్రత అంత కంతకూ పెరుగుతున్నప్పుడు
చమట పొక్కులు చీము పట్టినప్పుడు.చమట పొక్కులకు జ్వరం తోడైనప్పుడు

# నడకలో నలతలు

అరచేతులు, పాదాల్లో తిమ్మిర్లు: అధిక చక్కెర రక్తప్రసరణను ప్రభావితం చేసి, నాడులను దెబ్బతీస్తుంది. దాంతో అరచేతులు, పాదాల్లో నొప్పి, తిమ్మిర్లు వేధిస్తాయి. దీన్నే న్యూరోపతీ అంటారు. ఈ లక్షణాలతో పాటు సూదులు గుచ్చినట్టు కూడా అనిపించవచ్చు

నొప్పులు: కాళ్లలో నొప్పులు వేధిస్తాయి. ఇది కూడా నాడీ నష్టానికి సూచనే! దీర్ఘకాలికంగా అత్యధిక చక్కెరలను కలిగి ఉన్నప్పుడు ఈ పరిస్థితి తలెత్తుతుంది. కాళ్లలోని రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు కూడా కాళ్ల నొప్పులు వేధిస్తూ ఉంటాయి. కాబట్టి నొప్పులకు కారణాన్ని తెలుసుకోవాలి

అలసట: క్రమం తప్పక నడక అలవాటు ఉన్నప్పటికీ, కొత్తగా అలసట మొదలైనా, కొద్ది దూరానికే ఓపిక నశిస్తున్నా వెంటనే అప్రమత్తం కావాలి. చక్కెర పెరిగినా, తగ్గినా అలసట, నిస్సత్తువలు వేధిస్తాయి. నిరంతరం అలసట వేధిస్తున్నా, సరిపడా విశ్రాంతి తీసుకున్నప్పటికీ నిస్సత్తువగా ఉంటున్నా, శరీరం చక్కెరను సమర్థవంతంగా నిర్వహించడం లేదని అర్థం.

పాదాల్లో వాపులు: నడక ముగించుకున్న తర్వాత పాదాలు, కాలి గిలకలూ వాస్తుంటే రక్తంలో చక్కెర మోతాదులు హెచ్చుతగ్గులకు లోనవుతున్నట్టు అర్థం చేసుకోవాలి. మధుమేహం మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తుంది. ఫలితంగా శరీరంలో నీటి నిల్వ పెరిగి, పాదాలు, కాలి గిలకల్లో వాపులు మొదలవుతాయి.



# టమాటాల నిల్వ ఇలా!



టమాటాలను శుభ్రంగా కడిగి నీళ్లు లేకుండా తుడవాలి. ఆ తర్వాత వాటిని చిన్న చిన్న ముక్కలుగా తరిగి.. వాటిని ఒక మూకుడులో వేసి ఉడికించాలి. ఇలా ఉడికిన మిశ్రమాన్ని మిక్సిలో వేసి మెత్తగా రుబ్బాలి. దీనిలో తగినంత ఉప్పు, చక్కెర, వెనిగర్ వేసి కలపాలి. ఈ సాస్‌ను గాజు సీసాలో పోసి రిఫ్రిజరేటర్‌లో పెడితే చాలా కాలం నిల్వ ఉంటుంది.లేత పసుపు రంగులో ఉన్న టమాటాలను సన్నని చక్రాలుగా కోసి ఎండలో పెట్టాలి. టమాటా ముక్కల్లో నీరంతా పోయి బాగా ఎండేలా చూసుకోవాలి. తరవాత వీటిని గాలి చొరబడని డబ్బాలో పోసి ఉంచుకుంటే నాలుగు నెలల వరకూ నిల్వ ఉంటాయి.టమాటాలను బాగా ఉడికించి తొక్కలు తీసేయాలి. వీటిని మిక్సీలో వేసి బాగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌ట్రేలలో వేసి ఫ్రిజర్‌లో పెట్టాలి. ఇవి బాగా గట్టి పడిన తర్వాత జిప్‌లాక్ బ్యాగుల్లోకి మార్చుకోవాలి. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

పచ్చి టమాటాలను నీటిలో కడిగి, తడి లేకుండా పల్చని గుడ్డతో తుడిచి.. జిప్‌లాక్ బ్యాగుల్లో వేసి ఫ్రీజర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటాయి.
టమాటాలను చిన్న ముక్కలుగా కోసి ఒక గాజు సీసాలో వేయాలి. ముక్కలు మునిగేవరకు ఆలివ్ ఆయిల్ పోయాలి. ఇందులో సన్నగా తరిగిన వెల్లుల్లి ముక్కలు, వెనిగర్ వేసి కలపాలి. వెనిగర్ వల్ల టమాటా ముక్కలు తాజాగా ఉంటాయి. ఈ ముక్కలను పాస్తా, వెజిటబుల్ సలాడ్, శాండ్‌విచ్‌ల తయారీలో వాడుకోవచ్చు.
దోరగా పసుపు రంగులో ఉండే టమాటాలను తెచ్చుకుని శుభ్రంగా కడిగి, తడి లేకుండా తుడవాలి. వీటిని సన్నని పొడవైన ముక్కలుగా కోయాలి. వీటిని బాగా ఎండబెట్టాలి. బాగా ఎండిన టమాటా ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేయాలి. ఈ టమాటా పొడిని గాజు సీసాలో పోసి మూత పెట్టి రిఫ్రిజరేటర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటుంది.

# నారింజ పండుతో ఫేస్‌వాష్


నారింజ పండ్లు ఆరోగ్యానికి ఎంత మంచివో.. చర్మ ఆరోగ్యాన్ని కూడా అదే విధంగా కాపాడతాయి. అందుకే, చాలా స్కిన్ కేర్ ప్రోడక్ట్స్‌లో వీటి ఎక్స్‌ట్రాక్ట్స్‌ని వాడతారు. అందులో భాగంగా, ప్రజెంట్ ఆరెంజ్ పల్ప్‌తో మంచి క్లెన్సర్ ఎలా తయారుచేయాలో తెలుసుకోండి.
నారింజ పండుతో ఫేస్‌వాష్, రెగ్యులర్‌గా వాడితే స్కిన్‌పై మచ్చలు, ముడతలు మాయం, బయటకొనే ఫేస్‌వాష్ ఏమూలకి పనికిరాదు
నారింజ పండ్లని చాలా మంది ఇష్టంగా తింటారు. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అవన్నీ శరీరానికి ఎంతగానో మేలు చేస్తాయి. ఇక ఇందులోని పల్ప్‌లో క్లెన్సింగ్ గుణాలు ఉన్నాయి. దీనిని క్లెన్సింగ్‌లా వాడితే చర్మం మరింత తాజాగా, అందంగా మారుతుంది. పైగా దీనిని మీరు ఎక్స్‌ఫోలియేషన్, ఫేస్‌ప్యాక్స్, ఫేస్‌వాష్‌లా వాడొచ్చు. ఎలా వాడినా కూడా స్కిన్ ప్రాబ్లమ్స్ దూరమై చక్కగా స్కిన్ మెరుస్తుంది.
నారింజ పండుతో స్కిన్ బెనిఫిట్స్
నారింజ పండులో విటమిన్ సి యాంటీ ఆక్సిడెంట్స్‌లా పని చేసి స్కిన్‌పై మచ్చలు, పిగ్మంటేషన్‌ని తగ్గించి ముడతలు లేకుండా చేస్తుంది. ఇందులోని సిట్రిక్ యాసిడ్ నేచురల్ ఎక్స్‌ఫోలియేట్‌గా పనిచేస్తుంది.
దీనిని వాడడం వల్ల హైడ్రేషన్ అంది స్కిన్ రీఫ్రెష్‌గా ఫీల్ అవుతుంది. ఇందులోని యాంటీ మైక్రోబయల్ గుణాలు బ్యాక్టీరియాతో పోరాడి స్కిన్‌ప్రాబ్లమ్స్‌ని దూరం చేస్తాయి.
కావాల్సిన పదార్థాలు



మంచి జ్యూసీ నారింజ తొనలు
తేనె
పెరుగు
ఆలివ్ ఆయిల్
ఏం చేయాలి
మచ్చలు లేని స్కిన్ కోసం ముందుగా మన ముఖాన్ని చక్కగా క్లీన్ చేసుకోవాలి. అప్పుడే నారింజలోని గుణాలన్నింటిని స్కిన్ అబ్జార్బ్ చేసుకుంటుంది.
ఇప్పుడు ఓ గిన్నెలో ఆరెంజ్ పల్ప్ కొద్దిగా, తేనె, పెరుగు, ఆలివ్ ఆయిల్ కొద్దికొద్దిగా వేసి బాగా కలపాలి. ఇది ప్యాక్‌లా తయారవుతుంది.
ఎలా అప్లై చేయాలి
తయారైన పేస్ట్‌ని తీసుకుని స్కిన్, ఫేస్‌పై కళ్ల చుట్టూ కాకుండా రాయాలి. తర్వాత మెల్లిగా మసాజ్ చేస్తూ ఎక్స్ ఫోలియేట్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే మీకే రిజల్ట్ కనిపిస్తుంది. దీనిని ప్యాక్ అనుకోవచ్చు. మంచి ఎక్స్‌ఫోలియేట్‌తో కూడిన క్లెన్సర్ కూడా అనుకోవచ్చు.
బెనిఫిట్స్
ఇందులో తేనె కలిపాం. కాబట్టి, స్కిన్ మంచి మాయిశ్చరైజింగ్‌గా ఉంటుంది.
పెరుగులోని లాక్టిక్ యాసిడ్ ఎక్స్‌ఫోలియేషన్ చేస్తుంది. ఆలివ్ ఆయిల్మంచి హైడ్రేషన్, మాయిశ్చరైజన్‌ని అందిస్తుంది.
?గమనిక :ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు



# పుచ్చకాయ తొక్కలతో ఎనర్జీ డ్రింక్



వేసవిలో డీహైడ్రేషన్ నుంచి కాపాడి శరీరానికి కావాల్సినంత ఎనర్జీ ఇచ్చే ఫ్రూట్స్ లో పుచ్చకాయ ఒకటి. ఇందులో దాదాపు 90 శాతం నీరే ఉంటుంది. అందుకే సమ్మర్ లో కచ్చితంగా పుచ్చకాయలు తినాలని వైద్యులు సూచిస్తుంటారు. పైగా ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉన్న మలినాలను తొలగించి చర్మాన్నీ ఆరోగ్యంగా ఉంచుతాయి. అయితే..కేవలం పుచ్చకాయ తినేటప్పుడు సాధారణంగా మనం కట్ చేసి లోపలి ముక్కలంతా తినేసి ఆ తరవాత పైన ఉండే కాయను పడేస్తాం.
కానీ ఇప్పుడు చెప్పుకోబోయే చిట్కా గురించి తెలుసుకున్నాక పొరపాటున కూడా మీరు ఆ పని చేయరు. మనం ఎందుకూ పనికి రాదని పడేస్తున్న ఈ పుచ్చకాయ పొట్టు కూడా ఎంతో ఆరోగ్యాన్నిస్తుంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు ఓ ఫిట్ నెస్ ఎక్స్ పర్ట్. అసలు ఈ పొట్టుతో ఓ ఎనర్జీ డ్రింక్ తయారు చేయొచ్చా అని ఆశ్చర్యపోతాం. పైగా తయారు చేసుకోవడం చాలా సింపుల్.
**యాంటీ ఆక్సిడెంట్ బూస్ట్**
ఈ డ్రింక్ కి యాంటీ ఆక్సిడెంట్ బూస్ట్ అని పేరు పెట్టాడు ఈ ఫిట్ నెస్ ఎక్స్ పర్ట్. బాడీలో టాక్సిన్స్ పేరుకుపోయే కొద్దీ అనారోగ్య సమస్యలు ఎక్కువవుతాయి. ఆయిల్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ అతిగా తీసుకుంటే ఈ ఇబ్బందులు తప్పవు. నిజానికి లివర్, కిడ్నీలు,చర్మం ద్వారా లోపలి టాక్సిన్స్ బయటకు సహజంగానే బయటకు వెళ్లిపోతాయి. కానీ ఎప్పుడైతే ఆహార నియమాలు పాటించరో అప్పుడు ఈ అవయవాల పని తీరుపై ప్రభావం పడుతుంది. ఫలితంగా టాక్సిన్స్ పెరిగిపోతాయి. అలాంటప్పుడు ప్రత్యేకంగా డ్రింక్స్ తయారు చేసుకుని వాటి ద్వారా టాక్సిన్స్ ని తొలగించుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు వాటర్ మెలన్ పుట్టుతో అలాంటి డ్రింక్ తయారు చేసుకోవచ్చు.
**ఎలా తయారు చేసుకోవాలి**
ముందుగా పుచ్చకాయను శుభ్రంగా కడగాలి. ఆ తరవాత పీలర్ తో పొట్టుని తీయాలి. ఎంత డ్రింక్ కావాలో లెక్క వేసుకుని ఆ మేరకు పొట్టు తీసుకుంటే సరిపోతుంది. ఇప్పుడీ పొట్టుని మిక్సీ జార్ లో వేయాలి. అందులో నీళ్లు పోసి మిక్సీ పట్టాలి. మరీ లూజ్ గా కాకుండా కాస్తంత స్మూత్ గా, పేస్ట్ లా వచ్చేలా చూసుకోవాలి. ఆ తరవాత ఈ జ్యూస్ లో కొంత తీసి ఐస్ క్యూబ్ ట్రేలో పోసి డీప్ ఫ్రీజ్ చేయాలి. అవి ఐస్




క్యూబ్ లు గా మారేంత వరకూ అలాగే ఉంచాలి. అవి ఐస్ క్యూబ్ లు గా మారిన తరవాత అంతకు ముందు మిక్సీ పట్టిన పేస్ట్ లో ఈ ఐస్ క్యూబ్ లు వేసి మళ్లీ ఓ సారి మిక్సీ పట్టాలి. ఇలా చేయడం వల్ల డ్రింక్ చల్లగా ఉండడంతో పాటు స్మూత్ గా వస్తుంది. ఇలా కాదనుకుంటే కుండలో ఉండే చల్లని నీళు పోసి మిక్సీ పట్టినా సరిపోతుంది. ఇలా యాంటీ ఆక్సిడెంట్ డ్రింక్ తయారవుతుంది.
**తయారీ విధానం**
**రక్త ప్రసరణ కోసం**
పుచ్చకాయ పొట్టులో ఏముంటుందిలే అని మనం లైట్ తీసుకోవచ్చు. కానీ ఇందులో మన శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ ఉంటాయి. ముఖ్యంగా ఈ పొట్టులో అధిక మొత్తంలో సిట్రలైన్ ఉంటుంది. ఇది కండరాలను బలంగా మార్చడంతో పాటు బ్లడ్ ప్రెజర్ ని తగ్గిస్తుంది. కండరాల నొప్పులనూ పోగొడుతుంది. ముఖ్యంగా గుండె ఆరోగ్యానికి ఇది ఎంతో తోడ్పడుతుంది. దీంతో పాటు పుచ్చకాయ పొట్టులో అమినో యాసిడ్ ఉంటుంది. ఇది రక్త ప్రసరణను మెరుగు పరుస్తుంది. చాలా మంది అథ్లెట్స్ ఈ వాటర్ మెలన్ పీల్ జ్యూస్ ని తప్పనిసరిగా తీసుకుంటారు. ఇది రెగ్యులర్ గా తాగితే రక్తం శుద్ధి అవడంతో పాటు బాడీ స్ట్రెంత్ కూడా పెరుగుతుంది.
**షుగర్ కంట్రోల్**
ఈ వాటర్ మెలన్ పీల్ జ్యూస్ తాగితే జీర్ణ వ్యవస్థ మెరుగవుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. నిజానికి పుచ్చకాయ లోపల ఉండే ముక్కల్లో కన్నా ఈ పొట్టులోనే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది ఉదర సంబంధిత సమస్యల్ని పోగొడుతుంది. ఫైబర్ ఆహారం సులువుగా జీర్ణమయ్యేలా చూస్తుంది. దీంతో పాటు బ్లడ్ షుగర్ లెవెల్స్ నీ కంట్రోల్ చేస్తుంది. బీపీ, షుగర్ ఉన్న వాళు ఈ జ్యూస్ తాగితే ఈ రెండు జబ్బులనూ నియంత్రించవచ్చు. శరీరానికి కావాల్సినన్ని పోషకాలు కూడా అందుతాయి.
**కీళ్ల నొప్పులు దూరం**
ఈ పొట్టులో ఉండే క్లోరోఫిల్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ శరీరాన్ని తేలిక చేస్తాయి. పొట్టు ఆకుపచ్చగా ఉండడానికి కారణం ఈ క్లోరోఫిల్. ఇమ్యూనిటీని పెంచడంతో పాటు కీళ్ల నొప్పులను దూరం చేస్తాయి. పుచ్చకాయ ముక్కల్లోనే కాదు. పొట్టులోనూ వాటర్ కంటెంట్ ఉంటుంది. ఇది కూడా బాడీ హైడ్రేషన్ కి తోడ్పుతుంది. పైగా ఇందులో పొటాషియం ఉంటుంది. ఇది నరాల పని తీరుని మెరుగుపరచడంతో పాటు కండరాలనీ బలపరుస్తుంది.
?గమనిక :ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు

# ఇంట్లో వాటర్ ప్రాబ్లమ్ ఉందా, అతి తక్కువ నీళ్లతో స్నానం చేసేందుకు టిప్స్

ఎర్రని ఎండలు. వడ గాలులు. బయటకు వెళ్లిన కాసేపటికే చెమటలు పట్టేస్తున్నాయి. ఉదయం స్నానం చేసి వెళ్లినా అసలు చేసినట్టే అనిపించనంత చిరాకు. అందుకే సమ్మర్ లో రెండు పూటలా స్నానాలు చేసేస్తుంటారు చాలా మంది. అలా అయితేనే కాస్తంత ప్రశాంతంగా నిద్రపడుతుంది. కానీ..సిటీల్లో ఓ పూట స్నానం చేయడానికే నీళ్ల కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. దాదాపు అన్ని చోట్లా పెద్ద పెద్ద అపార్ట్ మెంట్ లు వచ్చేస్తున్నాయి. వందల అడుగుల కొద్దీ తవ్వినా నీటి జాడే కనిపించడం లేదు. అందుకే ఉన్న నీటినే చాలా పొదుపుగా వాడుకోక తప్పని పరిస్థితి.మరి ఇలాంటి సిచ్యుయేషన్ లో కేవలం స్నానం కోసం అనే బకెట్ల కొద్దీ నీళ్లు వృథా చేస్తూ పోతే ఇబ్బందులు తప్పవు. అలా అని స్నానం చేయకుండా అయితే ఉండలేం. అందుకే నీటిని పొదుపు చేస్తూనే తక్కువ నీళ్లతో స్నానం కానిచ్చేయాలి. ఇది కాస్త ఇబ్బందిగానే అనిపిస్తుండొచ్చు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంతకు మించి ఆప్షన్ ఇంకేమీ లేదు. అయితే..నీళ్లు ఎక్కువగా వేస్ట్ చేయకుండా స్నానం చేసేందుకు కొన్ని పద్ధతులున్నాయి.



బేకింగ్ సోడా..సాధారణంగా స్నానం అంటే కనీసం ఓ బకెట్ నీళ్లు అవసరం. ఒళ్లంతా శుభ్రం చేసుకోవాలంటే ఈ మాత్రం నీళ్లు కావాల్సిందే. కానీ ఇది మామూలు రోజుల్లో. నీటి కొరత ఉన్నప్పుడు కూడా ఇన్ని నీళ్లు వాడితే ఇబ్బంది తప్పదు. అందుకే కాస్తంత పొదుపుగా వాడుకోవాలి. బకెట్ నిండుగా కాకుండా సగమే నీళ్లు నింపాలి. సబ్బు పెట్టుకోవడం వల్ల ఎక్కువ నురగ వస్తుంది. ఈ నురగ పోవాలంటే ఎక్కువ నీళు అవసరం అవుతాయి. అందుకే సబ్బు లేకుండా స్నానం చేయాలి. అదెలా అంటే..బేకింగ్ సోడాతో. మీరు స్నానం చేసే నీళ్లలో కాస్తంత బేకింగ్ సోడా కలుపుకోవాలి. ఇది పూర్తిగా నీళ్లలో కరిగిపోయేంత వరకూ మిక్స్ చేయాలి. అప్పుడు ఆ నీళ్లతో స్నానం చేయాలి. స్కిన్ అలెర్జీ, శరీర దుర్వాసన లాంటి సమస్యలుంటే ఈ బేకిగ్ సోడా బాత్ చాలా మంచిది. అయితే..నీళ్లను కాస్తంత వేడి చేసుకుని ఆ తరవాత బేకింగ్ సోడా వేసుకుంటే ఇంకా బాగా పని చేస్తుంది.
బాడీ స్క్రబర్..బేకింగ్ సోడా కలపడం వల్ల నీటి వృథా తగ్గుతుండొచ్చు. కానీ వాటిని కూడా మొత్తం వేస్ట్ చేయకుండా ఉండాలంటే మరో చిట్కా పాటించాలి. బాడీ స్క్రబర్ ని నీళ్లలో ముంచి ముందుగా శరీరమంతా రబ్ చేయాలి. మరీ అవసరమైతే కాస్తంత సబ్బు వాడొచ్చు. అవి కూడా నురగ ఎక్కువగా రాని సబ్బులు వాడితే బెటర్. స్క్రబర్ తో బాడీ అంతా స్పాంజిగ్ చేసుకోవాలి. క్లీన్ అయింది అనుకుంటే మరోసారి నీళ్లలో ముంచి స్క్రబ్ చేసుకుంటే సరిపోతుంది. ఆ తరవాత టవల్ తో శుభ్రంగా తుడుచుకోవాలి. బేకింగ్ సోడా వేయడం వల్ల శరీరంపై ఉన్న మురికి అంతా క్లీన్ అయిపోతుంది. మీకు స్నానం చేసిన ఫీల్ కూడా కలుగుతుంది.



## ప్రస్తుతానికైతే 'టీ జీరో' ట్రేడింగ్ ఐచ్ఛికమే



**న్యూఢిల్లీ-నవభూమి:** స్టాక్ మార్కెట్లో ప్రస్తుతానికైతే టీంజీరో ట్రేడింగ్ ఐచ్ఛికమని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ స్పష్టం చేసింది. అయితే ఈ వెసులుబాటు మార్కెట్ వర్గాలు క్రమంగా ఈ విధానానికి మారేందుకు దోహదం చేస్తుందని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే చెప్పారు. షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు, నగదు చెల్లింపుల ప్రక్రియ ఒకేరోజు ముగిసే విధానాన్ని టీంజీరో సెటిల్‌మెంట్ అంటారు. సెబీ ప్రస్తుతం ఈ విధానాన్ని తప్పనిసరి పద్ధతిలో కాకుండా ఐచ్ఛిక పద్ధతిలోనే అమలు చేస్తోంది. కాగా కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంపైనా సెబీ చీఫ్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదన్నారు. నియంత్రణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు సెబీ ఇప్పటికే ఏఐని వినియోగిస్తోందన్నారు. ప్రస్తుతం ఐపీఓ పత్రాల ప్రాసెసింగ్, ఇతర కార్యకలాపాల పర్యవేక్షణ కోసం దీన్ని ఉపయోగిస్తున్నట్టు వెల్లడించారు. ఏఐ టూల్స్ సాయంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక ఆర్థిక సలహా సేవలకు చెక్ పెడుతున్నట్టు పాండే చెప్పారు.

కేంద్రీకృత కేవైసీ వ్యవస్థ: కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇతర ఆర్థిక రెగ్యులేటరీ సంస్థలతో కలిసి కేంద్రీకృత నో యువర్ కస్టమర్ (కేవైసీ) వ్యవస్థ ఏర్పాటు కోసం పని చేస్తున్నట్టు పాండే వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఒక కమిటీ ఇందుకోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించిందన్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే కేవైసీ విధానం అత్యంత సులభమవుతుందన్నారు.

## ఐఎంఎఫ్ ఈడీ కేవీ సుబ్రమణియన్‌పై వేటు



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్‌పై ఆర్థిక యుద్ధాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత తీవ్రం చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ)లో మన దేశం తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఉన్న కేవీ సుబ్రమణియన్‌ను కేంద్ర ప్రభుత్వం ఆకస్మికంగా తొలగించింది. ఆయన పదవీ కాలం ఇంకా ఆరు నెలలు ఉండగానే ప్రభుత్వం ఆయనపై వేటు వేసింది. వాస్తవానికి సుబ్రమణియన్ పదవీ కాలం ఈ ఏడాది అక్టోబరుతో ముగియా ల్సి ఉంది. అయితే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ నెల ఒకటో తేదీ నుంచే సుబ్రమణియన్‌కు ఉద్వాసన పలకాలని నిర్ణయించింది. ఇందుకు కారణాలు మాత్రం వెల్లడించలేదు. పాక్‌పై ఒత్తిడి పెంచేందుకే: తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. ఐఎంఎఫ్ విషయ సేకరణపై సుబ్రమణియన్ గతంలో చేసిన వ్యాఖ్యలు ఆ సంస్థలోని చాలా దేశాలకు రుచించలేదు. దీనికి తోడు ఇటీవల ఆయన తన తాజా పుస్తకం 'ఇండియా ః 100: ఎన్‌విజనింగ్ టుమారోస్ ఎకనామిక్ ప్రమోషన్' ప్రమోషన్ కోసం చేసిన ప్రచారం ఆయన స్థాయికి తగ్గట్టు లేదని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 9న జరిగే ఐఎంఎఫ్ సమావేశంలో పాకిస్థాన్‌కు కొత్త రుణాలు పుట్టకుండా మిగతా దేశాల మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో పాక్‌కు మరో విడత 130 కోట్ల డాలర్ల రుణం మంజూరు చేయడంతో పాటు ఇప్పటికే మంజూరు చేసిన రుణాల వినియోగాన్ని ఐఎంఎఫ్ సమీక్షించనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఆకస్మికంగా సుబ్రమణియన్‌ను ఐఎంఎఫ్ ఈడీ పదవి నుంచి తొలగించాలని నిర్ణయించడం విశేషం.

## సెలవుల సంతోషానికి సురక్షిత రక్షణ..ట్రావెల్ ఇన్సూరెన్స్




**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా అనేక మంది కూడా వీకెండ్ వస్తే చాలు టూర్లకు ప్లాన్ చేస్తుంటారు. మరికొంత మంది ప్రతి నెలలో కూడా లాంగ్ టూర్లకు వెళ్తుంటారు. అలాంటి సమయాల్లో అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. రోడ్డు లేదా అగ్ని ప్రమాదం వంటివి జరుగుతుంటాయి. కానీ ఇలాంటి సమయంలో ముందుగానే ట్రావెల్ ఇన్సూరెన్స్ తీసుకుంటే ఎలాంటి భయాందోళన లేకుండా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వీటిని తీసుకోవడం ద్వారా అనేక సౌకర్యాలను పొందవచ్చని అంటున్నారు. ఈ క్రమంలో ఫ్లైట్ ఆలస్యం,లగేజ్ మిస్సింగ్, వైద్య అత్యవసర పరిస్థితి వంటి సమస్యలు ఎప్పుడైనా తలెత్తవచ్చు. ఇటువంటి సందర్భాల్లో ట్రావెల్ ఇన్సూరెన్స్ మీకు రక్షణ కల్పిస్తుందని చెబుతున్నారు. చాలా మంది పర్యాటకులు దీనిని పట్టించుకోకపోయినా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇది చక్కగా ఉపయోగపడుతుంది.

ట్రావెల్ ఇన్సూరెన్స్ మీ ప్రయాణంలో మనశ్శాంతిని అందిస్తుంది. ఇది కేవలం మీ ట్రావెల్ ఇన్వెస్ట్‌మెంట్‌ను రక్షించడమే కాకుండా, అనుకోని పరిస్థితుల్లో మీకు ఆర్థిక భద్రతను కూడా అందిస్తుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ ద్వారా మీ జీవితంలో అనుకోనివి జరిగినప్పుడు మీకు రక్షణ కవచం పనిచేస్తుంది. కాబట్టి, మీ బ్యాగ్‌లు సిద్ధం చేసుకునే ముందు ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను మీ ప్రయాణ ప్రణాళికలో భాగం చేసుకోండి. కొంచెం ప్లాన్ చేయడం ద్వారా మీరు భవిష్యత్తులో పెద్ద ఒత్తిడుల నుంచి తప్పించుకోవచ్చు.

అప్పుడప్పుడు మీరు నెలల తరబడి మీ సెలవులను ప్లాన్ చేస్తారు. కానీ చివరి నిమిషంలో మీ కుటుంబ పరిస్థితి కారణంగా రద్దు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ క్రమంలో రీఫండ్, ఎయిర్‌లైన్ టికెట్లు, హోటల్ రిజర్వేషన్ వంటి వేల లేదా లక్షల రూపాయల మొత్తాన్ని మీరు ట్రావెల్ ఇన్సూరెన్స్ చేసుకుంటే కవరేజ్ చేసుకోవచ్చు. దీంతోపాటు వైద్య అత్యవసర పరిస్థితుల నుంచి కూడా రక్షించుకోవచ్చు.

సాధారణ హెల్త్ ఇన్సూరెన్స్ కవర్ చేయని దేశంలో మీరు అనారోగ్యానికి గురైతే లేదా గాయపడితే, ఆసుపత్రి బిల్లులు భారీగా ఉండవచ్చు. ట్రావెల్ ఇన్సూరెన్స్ ఇలాంటి వాటిని కవర్ చేస్తుంది. అత్యవసరంగా ఆసుపత్రిలో చేరికలు, డాక్టర్ సందర్శనలను కవర్ చేయడం ద్వారా మీకు రక్షణ కల్పిస్తుంది. ఇది మీ ఆందోళనలను తొలగించి, అనుకోని పరిస్థితులతో వ్యవహరించడానికి బదులుగా జ్ఞాపకాలను సృష్టించడంపై దృష్టి పెట్టేలా చేస్తుంది.

**ఎంచుకోవడం ఎలా**

ట్రావెల్ ఇన్సూరెన్స్ ఎంచుకునేటప్పుడు, మీ ప్రయాణ రకం, గమ్యస్థానం, వ్యక్తిగత అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొన్ని ఇన్సూరెన్స్ పాలసీలు వైద్య అత్యవసర పరిస్థితులపై ఎక్కువ దృష్టి పెడితే, మరికొన్ని ట్రిప్ రద్దు లేదా సామాను కోల్పోవడంపై ఎక్కువ కవరేజ్ అందిస్తాయి. మీరు సాహస ప్రయాణాలకు వెళుతున్నట్లయితే, హైకింగ్ లేదా స్కీయింగ్ వంటి కార్యకలాపాలను కవర్ చేసే పాలసీని ఎంచుకోండి. అంతేకాకుండా పాలసీని కొనుగోలు చేసే ముందు దాని నిబంధనలను జాగ్రత్తగా చదవండి.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 300 పాయింట్లు జంప్..

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ రంగంలో తప్పా మిగతా అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,661.62 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. చివరి వరకు అదే జోరును కొనసాగించాయి. ఈ క్రమంలో ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,657.71 పాయింట్ల కనిష్ఠానికి చేరగా.. అత్యధికంగా 81,049.03 పాయింట్లకు పెరిగింది. చివరకు 294.85 పాయింట్ల లాభంతో 80,796.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114.45 పాయింట్లు పెరిగి.. 24,461.15 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2462 షేర్లు లాభాలను నమోదు చేశాయి.

మరో 1404 షేర్లు పతనం కాగా.. 171 షేర్లు మారలేదు. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒక శాతం కంటే ఎక్కువ పెరిగాయి. బ్యాంకింగ్ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు ఆటో, పవర్, ఎనర్జీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్, గ్యాస్ ఒక్కొక్కటి ఒకశాతం పెరిగాయి. నిఫ్టీలో అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం అత్యధికంగా లాభపడ్డాయి. కొటక్ మహీంద్రా బ్యాంక్, ఓఎన్‌జీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్‌బీఐ నష్టపోయాయి.

## భారత్‌లో తయారు చేసిన స్మార్ట్ స్పీకర్‌ను ఆవిష్కరించిన ఫోన్‌పే




**న్యూఢిల్లీ-నవభూమి:** సరికొత్త స్మార్ట్‌స్పీకర్ 4జి కనెక్టివిటీ, వేగంగా ఛార్జ్ అయ్యే సామర్థ్యం, ఎక్కువ సేపు నిలిచే బ్యాటరీతో వస్తోంది. మర్చంట్ల మారుతున్న వ్యాపార అవసరాలకు తగినట్టు అప్‌గ్రేడ్ చేసిన తన సరికొత్త స్మార్ట్‌స్పీకర్‌ను ఆవిష్కరించామని ఫోన్‌పే నేడు ప్రకటించింది. ఒరిజినల్ స్మార్ట్‌స్పీకర్ పునాదులపై నిర్మించిన దీనిని భారతదేశంలోనే తయారు చేయడం గమనార్హం. తాజా అప్‌గ్రేడ్ ఇదివరకటి స్మార్ట్‌స్పీకర్‌లోని పాపులర్ ఫీచర్లను అలాగే కొనసాగిస్తూనే, ముఖ్యమైన మెరుగుదలలను కూడా ప్రవేశపెట్టింది. దీనిపై ఫోన్‌పేలోని మర్చంట్ బిజినెస్ విభాగం చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ, "భారతదేశంలో తయారైన మా సరికొత్త స్మార్ట్‌స్పీకర్లను ప్రవేశపెట్టడం మాకెంతో ఆనందంగా ఉంది. స్థానికంగా ఈ పరికరాలను తయారు చేయడం వల్ల మా మర్చంట్ల నిర్దిష్ఠ అవసరాలు, ప్రాధాన్యతలకు తగ్గట్టు ఉత్పత్తులను సిద్ధం చేసే సౌలభ్యతలను మాకు అందిస్తుంది. ఈ స్మార్ట్‌స్పీకర్లు, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్థిక సేవలు అంతగా లేని మారుమూల ప్రాంతాలలోని మర్చంట్లకు ఆర్థిక మేళవింపును ప్రోత్సహించడంతో పాటు దేశంలోని డిజిటల్ రూపాంతరంలో భారతీయ తయారీదారులు కూడా అంతర్గత భాగస్వాములయ్యేలా స్థానిక నవ్యావిష్కరణలను ప్రోత్సహిస్తాయి" అని అన్నారు. ఫోన్‌పే తన స్మార్ట్‌స్పీకర్‌ను 2022లో ఆవిష్కరించింది. తద్వారా వాయిస్ నోటిఫికేషన్లను అందించే ఒక నమ్మకమైన, సౌకర్యవంతమైన పేమెంట్ సొల్యూషన్‌ను తన ఆఫ్‌లైన్ మర్చంట్లకు అందిస్తోంది. వైవిధ్యమైన 21 భాషలలో అందుబాటులో ఉన్న స్మార్ట్‌స్పీకర్‌లో ప్రముఖ భారతీయ నటుల స్వరంతో కూడిన ఒక సెలబ్రిటీ వాయిస్ ఫీచర్ కూడా ఉంది. పేమెంట్లు విజయవంతమైనప్పుడు వచ్చే ఈ తక్షణ ఆడియో అలెర్ట్ లు పేమెంట్లను నిర్ధారించుకోవడంకోసం మర్చంట్లకు %హామీ% చెకింగ్ లేదా యాప్ నోటిఫికేషన్లను చెక్ చేయడంపై ఆధారపడాల్సిన పరిస్థితిని తగ్గిస్తుంది. ఇది పేమెంట్ అప్ డేట్లకోసం తమ ఫోన్లను నిరంతరం చెక్ చేసుకోకుండా తమ వ్యాపారంపై దృష్టి పెట్టడానికి అనుమతిస్తుంది. ఈ సరికొత్త 'మేడిన్ ఇండియా" స్మార్ట్‌స్పీకర్ ఇదివరకటి అన్ని ఫీచర్లను కలిగి ఉండడంతో పాటు కనెక్టివిటీ, విద్యుత్ సామర్థ్యంలలో చెప్పుకోదగిన మెరుగుదలలతో వస్తోంది. ఇది మరింత ఎక్కువ వేగం, నెట్‌వర్క్ విశ్వసనీయత కోసం 4 జి నెట్‌వర్క్‌ను వినియోగించుకుంటుంది. తాజా వెర్షన్ సుమారు 75 నిమిషాల్లో పూర్తిగా ఛార్జ్ అవుతుంది. బ్యాటరీ మరింత ఎక్కువ కాలం లైఫ్ కలిగి ఉంటుంది. ఇది కాకుండా, ఎక్కువ శబ్ధం ఉంటున్న వాతావరణంలోనూ ఆడియో స్పష్టంగా వినిపిస్తుంది. కౌంటర్ ప్రదేశాలు అత్యంత రద్దీగా ఉన్నా మర్చంట్లకు వాటిని ఉపయోగించడం సౌకర్యవంతంగా ఉంటుంది.

## విదేశీ ఇన్వెస్టర్ల రాక..లాభపడిన స్టాక్ మార్కెట్



**న్యూఢిల్లీ-నవభూమి:** విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారత మార్కెట్లలోకి కొనసాగుతూనే ఉండటం, తగ్గుతున్న ముడి చమురు ధరల కారణంగా భారత మార్కెట్లు తారాస్థాయికి పెరుగుతున్నాయి. బెంచ్‌మార్క్ సూచీలు గత 16 సెషన్లలో 12 సెషన్లు లాభపడటం విశేషం.

విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారత మార్కెట్లలోకి కొనసాగుతూనే ఉండటం, తగ్గుతున్న ముడి చమురు ధరల కారణంగా భారత మార్కెట్లు తారాస్థాయికి పెరుగుతున్నాయి. వీటి నేపథ్యంలో మెరుగైన సెంటిమెంట్ తోడవడంతో ఇవాళ (మే 5న) బెంచ్‌మార్క్ సూచీలు 2025కి అత్యధిక ముగింపు స్థాయిలో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి, సెన్సెక్స్ 0.4 శాతం లేదా 295 పాయింట్లు పెరిగి 80,797 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 0.47 శాతం లేదా 114.45 పాయింట్లు పెరిగి 24,461 వద్ద ఉంది. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 1.45 శాతం లాభపడగా, బిఎస్ఇ స్మాల్‌క్యాప్ 1.23 శాతం లాభపడింది. ఇక, ఇవాల్టి ట్రేడింగ్ విషయానికొస్తే, మంచి గ్యాప్ అప్ తో ఇవాళ మార్కెట్లు ఓపెన్ అయ్యాయి. తర్వాత, ఇండెక్స్ రోజంతా రేంజ్‌బౌండ్‌లో ఉండి చివరికి 114.45 పాయింట్ల లాభాలతో సెషన్‌ను 24,461.15 వద్ద ముగించింది. బ్యాంక్ నిఫ్టీ, %ప్రాఖ% బ్యాంక్‌లు మినహా, అన్ని రంగాల సూచీలు గ్రీన్‌లో ముగిశాయి. ఆటో, ఎనర్జీ టాప్ పెర్ఫార్మర్‌లుగా ఉద్భవించాయి. మిడ్‌క్యాప్ ఇంకా స్మాల్‌క్యాప్ సూచీలు గణనీయంగా పురోగమించి, ఫ్రంట్‌లైన్ ఇండెక్స్‌ను అధిగమించిన విస్తృత మార్కెట్లలో నిజమైన ఊపు కనిపించింది. బెంచ్‌మార్క్ సూచీలు గత 16 సెషన్లలో 12 సెషన్లు లాభపడటం విశేషం. దీనికి ప్రధాన కారణం ఫారిన్ పోర్ట్ పోలియో ఇన్వెస్టర్స్. వీళ్లు తిరిగి కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో భారత మార్కెట్లు భారీగా పెరుగుతున్నాయి. దీంతో ఈ కాలంలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ 10 శాతానికి పైగా పెరిగాయి. గత 11 సెషన్లలోనే, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.38,300 కోట్లకు పైగా ఈక్విటీలను కొనుగోలు చేశారని డేటా చెబుతోంది. మరోవైపు, బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు %వి%60 కంటే తక్కువగా పడిపోయాయి. ఇది ఈ సంవత్సరం ఇప్పటివరకు దాదాపు 20 శాతం తగ్గుదలను సూచిస్తుంది. ట్రంప్ సుంకాల సంబంధిత అనిశ్చితుల కారణంగా ఎగుమతి వేగం మందగించింది. ఇది భారత ఈక్విటీ మార్కెట్లకు సానుకూలంగా కూడా పరిణమించింది. ఇక, ఇండియాలో వృద్ధి అవకాశాలు ు దేశీయ ఈక్విటీలలో చురుకుగా ఉండటానికి ప్రోత్సహిస్తున్నాయి. అయితే ద్రవ్యోల్బణాన్ని తగ్గించే అంచనాలు కొంత హెచ్చుతగ్గులకు లోనైనప్పటికీ బాండ్ మార్కెట్లకు స్థిరత్వాన్ని అందించాయి.

## ఐదు ప్రముఖ బ్యాంకులపై ఆర్బీఐ భారీ ఫైన్.. ఎందుకో తెలుసా..



**న్యూఢిల్లీ-నవభూమి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలోని ఐదు ప్రముఖ బ్యాంకులపై భారీ జరిమానాలు విధించింది. ఈ బ్యాంకుల్లో %ICICI%, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, %IDBI%, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉన్నాయి. ఈ ఐదు బ్యాంకులపై మొత్తం రూ.2.52 కోట్లకు పైగా జరిమానా పడింది. సైబర్ సెక్యూరిటీ, %ఖ్జ%, కస్టమర్ సర్వీస్ వంటి అంశాల్లో ఈ బ్యాంకులు నియమాలను ఉల్లంఘించిన క్రమంలో ఆర్బీఐ ఫైన్ వేసింది. ఈ క్రమంలో బ్యాంకులు నియమాలను సరిగ్గా పాటించని విషయాలపై ఆర్బీఐ ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూనే ఉంది.

**ఏ బ్యాంకులపై ఎందుకు జరిమానా?**

ICICI బ్యాంక్: ఈ బ్యాంకుపై రూ. 97.80 లక్షల జరిమానా విధించారు. సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్, %KYC% నిబంధనలు, క్రెడిట్/డెబిట్ కార్డ్ జారీలో నియమాలను పాటించలేదని %=దీ×% గుర్తించింది. ఈ లోపాలు కస్టమర్ల డేటా భద్రతను ప్రభావితం చేస్తాయని %RBI% తెలిపింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా: ఈ బ్యాంకుకు రూ. 61.40 లక్షల జరిమానా పడింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, కస్టమర్ సర్వీస్ నిబంధనలను అనుసరించలేదని %RBI% తెలిపింది. ఈ క్రమంలో కస్టమర్లకు అందించే సేవల్లో లోపాలు ఉన్నాయని గమనించారు.

%IDBI% బ్యాంక్: %IDBI% బ్యాంకుపై రూ. 31.80 లక్షల జరిమానా విధించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా వ్యవసాయ రుణాలకు సంబంధించిన వడ్డీ సబ్సిడీ స్కీమ్ నిబంధనలను పాటించలేదని %RBI% గుర్తించింది.


బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర: ఈ బ్యాంకుపై కూడా రూ. 31.80 లక్షల జరిమానా పడింది. %KYC% నిబంధనలను సరిగ్గా అమలు చేయలేదని %RBI% తెలిపింది.

యాక్సిస్ బ్యాంక్: యాక్సిస్ బ్యాంకుపై రూ. 29.60 లక్షల జరిమానా విధించారు. అంతర్గత/కార్యాలయ ఖాతాలను అనధికారికంగా నిర్వహించినట్లు %RBI% గమనించింది.

**ఈ జరిమానాలు ఎందుకంటే**

%RBI% బ్యాంకులపై జరిమానాలు విధించడం అనేది కేవలం శిక్షణ కోసం మాత్రమే కాదు. ఇది బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత, భద్రత, కస్టమర్ హక్కులను కాపాడేందుకు చేసే ప్రయత్నమని చెప్పవచ్చు. సైబర్ సెక్యూరిటీ, %ఖ్జ% వంటి నిబంధనలు కస్టమర్ల డేటా, డబ్బును సురక్షితంగా ఉంచడానికి రూపొందించినవి. కానీ ఈ నిబంధనలను బ్యాంకులు ఉల్లంఘిస్తే మాత్రం చర్యలు తప్పవని ఆర్బీఐ మరోసారి స్పష్టం చేసింది.

## తగ్గిన ధరలకు బ్రేక్..మళ్లీ పుంజుకున్న బంగారం, తగ్గిన వెండి ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా గత వారం భారీగా పడిపోయిన ధరలకు బ్రేక్ పడింది. ఈ వారం మళ్లీ పెరుగుదల ట్రెండ్ వచ్చేసింది. ఈ క్రమంలోనే నేడు (మే 5, 2025) బంగారం ధరలు మళ్లీ పెరిగాయి (%+శీశ్రీ౧ ్రాతీఱవెం =ఱంవ%). సోమవారం మార్కెట్ మొదలైన నేపథ్యంలో బంగారం ధరలు ఊపందుకున్నాయి. అదే సమయంలో వెండి ధరలు భారీగా తగ్గడం విశేషం. ఈ నేపథ్యంలో మే 5, 2025న 22 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 87,750కి చేరుకుంది. ఇది మునుపటి రోజుతో పోలిస్తే రూ. 20 ఎక్కువ. ఇక 100 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ. 8,77,500గా ఉంది. ఇక 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 22 పెరిగింది. ఈ క్రమంలో 100 గ్రాముల ధర రూ. 9,57,300కు చేరుకుంది.

**%వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

బంగారం ధరలు పెరుగుతుంటే, వెండి ధరలు మాత్రం భారీగా తగ్గాయి. ఈ క్రమంలో మే 5న కేజీ వెండి ధర రూ. 1000 తగ్గి రూ.97,000కు చేరుకుంది. ఈ క్రమంలో హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి రేటు రూ.108,000కు చేరుకోగా, ఢిల్లీ, ముంబై, బెంగళూరులో రూ.97,000గా ఉంది. మరోవైపు చెన్నై,కేరళ, భువనేశ్వర్?లో మాత్రం రూ.108,000గా ఉంది.

**ప్రధాన నగరాల్లో బంగారం ధరలు**

ఈ క్రమంలో చెన్నై, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్‌లలో 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 87,750గా ఉంది. ఢిల్లీలో మాత్రం ధర కాస్త ఎక్కువగా రూ. 87,900గా కలదు. అదే విధంగా, 24 క్యారెట్ బంగారం ధర ఈ నగరాల్లో 10 గ్రాములకు రూ. 95,730గా ఉంది. ఇదే సమయంలో పాట్నా, సూరత్?లో 24 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.95,780గా ఉండగా, 22 క్యారెట్ పసిడి ధర రూ.87,800గా ఉంది.

గత రోజుల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..

మే 4, 2025 ఆదివారం రోజు బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. 22 క్యారెట్ ధర గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 87,550 కాగా, 24 క్యారెట్ పసిడి ధర 10 గ్రాములకు రూ. 95,510గా ఉంది. మే 2న మాత్రం 22 క్యారెట్ రూ. 20, 24 క్యారెట్ రూ. 22 తగ్గాయి. మే 1 రోజు మాత్రం అతిపెద్ద పతనం కనిపించింది. 22 క్యారెట్ రూ. 200, 24 క్యారెట్ రూ. 218 తగ్గాయి. ఏప్రిల్ 30 నాడు కూడా 22 క్యారెట్ రూ. 5, 24 క్యారెట్ రూ. 6 తగ్గాయి.

## మల్టీ అసెట్ ఫండ్స్.. మదుపరులకు ఓ స్మార్ట్ ఆప్షన్

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ మదుపరులకు స్థిరమైన పోర్ట్‌ఫో లియోనే ప్రాధాన్యతగా ఉంటుంది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు ఉన్నప్పుడు, అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఏర్పడినప్పుడైతే దీనికే ఇన్వెస్టర్ల తొలి ఓటు. కానీ దీర్ఘకాలంలో చూసినెట్లైతే ఈక్విటీలు మదుపరులకు పెద్ద ఎత్తునే రాబడులను అందించాయని అర్థమవుతుంది. గడిచిన దశాబ్దకాలంలో నిఫ్టీ ఆకర్షణీయ ప్రదర్శననే కనబర్చింది మరి. అయినప్పటికీ అత్యంత సున్నితమైన స్టాక్ మార్కెట్ కదలికలు.. ఇన్వెస్టర్లను పెట్టుబడుల పట్ల ఓ స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోనివ్వ లేకుండా చేస్తున్నాయి. సూచీలు తీవ్ర ఆటుపో ట్లకు లోనవుతున్న ప్రస్తుత సమయాల్లో నూ మదుపరులది ఇదే పరిస్థితి. ఇక సంప్రదాయ పెట్టుబడి సాధనాలుగా ఉన్న బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) పరిమిత స్థాయిలోనే రాబడులను మదుపరులకు అందిస్తున్నా.. సురక్షిత పెట్టుబడిగా ఉండటంతో వీటికుండే డిమాండ్ వీటిది. కానీ పన్ను చెల్లింపుల అనంతరం ద్రవ్యోల్బణాన్ని అధిగమించే రాబడులను అందించడంలో ఇవి విఫలమనే చెప్పవచ్చు. ఇలా పెట్టుబడుల విషయంలో మదుపరులకు అన్నివిధాలుగా లాభసాటి వేదికలే పెద్దగా కనిపించడం లేదు. మరి ఏం చేయాలి? చక్కని ప్రత్యామ్నాయం పెట్టుబడులపట్ల స్పష్టతలేని మదుపరులకు ఓ చక్కని ప్రత్యామ్నాయంగా మల్టీ అసెట్ ఫండ్స్ నిలుస్తున్నాయి. ఈ ఫండ్స్.. ఈక్విటీలు, డెట్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్, బంగారం లేదా ఇతర కమోడిటీల్లో పెట్టుబడుల్ని పెడుతాయి. తద్వారా పెట్టుబడుల్లో వైవిధ్యాన్ని కనబరుస్తాయి. ఓవైపు స్టాక్ మార్కెట్లలో.. మరోవైపు బాండ్లు, బంగారం వంటి వాటిపై ఇన్వెస్ట్ చేస్తూ హెచ్చుతగ్గులను సమన్వయం చేసుకుంటాయి. ఈ క్రమంలోనే మదుపరులకు మార్కెట్‌లో ఎలాంటి పరిస్థితులున్నా రిస్క్‌ను అధిగమించే రాబడులను అందించగలుగుతాయి. నిజానికి మ్యూచువల్ ఫండ్స్‌లో మల్టీ అసెట్ ఫండ్‌నూ ఓ రకమనే చెప్పవచ్చు. అందుకే వీటిని హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్‌గా పేర్కొంటారు. ఇక భారత్‌లో మల్టీ అసెట్ అల్లోకేషన్ ఫండ్స్.. ఈక్విటీ, డెట్, గోల్డ్ లేదా ఇతర కమోడిటీల్లో ఒక్కోదాంట్లో కనీసం 10 శాతమైనా పెట్టుబడుల్ని పెట్టాలని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నిబంధనలు చెప్తున్నాయి.

బంగారంపై పెట్టుబడులు ఎలా?

మల్టీ అసెట్ ఫండ్స్ సాధారణంగా గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్ల ద్వారా బంగారంలో పెట్టుబడుల్ని పెడుతాయి. అప్పుడప్పుడు సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ)లోనూ ఇన్వెస్ట్ చేస్తాయి. దీంతో మల్టీ అసెట్ ఫండ్స్‌ను ఎంచుకున్న ఇన్వెస్టర్లు.. భౌతిక బంగారాన్ని కొనడం, నిల్వ చేయడం వంటివి చేయకుండానే పరోక్షంగా గోల్డ్ రేట్లను ప్రభావితం చేయగలుగుతున్నారని చెప్పవచ్చు. అయితే ఈక్విటీలు, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌ల్లోనే ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తున్న మల్టీ అసెట్ ఫండ్స్.. కేవలం 10-20 శాతం పెట్టుబడుల్నే గోల్డ్‌పై పెడుతున్నది. దీంతో ఇక్కడ గోల్డ్ మద్దతు పాత్రనే పోషిస్తున్నది. అయినప్పటికీ ఒడిదుడుకులను తట్టుకొని రిస్క్ అడ్జస్టెడ్ రిటర్న్‌ను పెంచుకోవడానికి ఇది దోహదం చేస్తున్నది. కానీ ద్రవ్యోల్బణాన్ని అధిగమించేలా లేదా గోల్డ్ ర్యాలీని అందిపుచ్చుకోవాలన్నా ఈ మాత్రం పెట్టుబడులు చాలవు. అలాంటప్పుడు సావరిన్ గోల్డ్ బాండ్లు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వంటి సాధనాలను ఎంచుకోవడం ఉత్తమం. అప్పుడు మాత్రం మల్టీ అసెట్ ఫండ్స్‌ను కాకుండా నేరుగా గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్లకు దిగడమే తెలివైన పని. వాటికి ఎస్‌జీబీలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమం. అయితే గోల్డ్ రేట్లు ఆల్‌టైమ్ హైలో ఉన్నందున ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం లాభదాయకమని మరువద్దు.

ప్రయోజనాలు: ఒకే ఫండ్‌లో గోల్డ్, ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పెట్టుబడులకు ఆస్కారం . మార్కెట్ పరిస్థితులనుబట్టి ఫండ్ మేనేజర్లు చురుగ్గా అలోకేషన్స్‌ను సర్దుబాటు చేస్తూంటారు. సాధారణంగా స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ఉంటే బంగారం ధరలు పెరుగుతూపోతాయి.

## 9.1 శాతం వడ్డీ.. సీనియర్ సిటిజన్లకు ఈ ఎఫ్‌డీలు ఆకర్షణీయం




**న్యూఢిల్లీ-నవభూమి:** చాలాకాలం తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును తగ్గించింది. గత రెండు ద్రవ్యసమీక్షల్లో పావు శాతం చొప్పున అర శాతం కోత పెట్టింది. దీంతో ఆయా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు తమ రుణాలపైనా వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. ఈ క్రమంలో సేవింగ్స్ అకౌంట్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై కూడా వడ్డీరేట్లను దించుతున్నాయి.

ఫలితంగా ఇన్నాళ్లూ ఎఫ్‌డీలపై అధిక వడ్డీ ఆదాయాన్ని పొందినవారికి కాస్త ఇబ్బందికరంగానే ఉంటున్నది. ముఖ్యంగా ఎఫ్‌డీల ఆదాయమే ప్రధానంగా జీవనం సాగించే ఎంతోమంది సీనియర్ సిటిజన్లు నష్టపోతున్నారు. అయితే ఇప్పటికీ ఎఫ్‌డీలపై ఆకర్షణీయ వడ్డీరేట్లను కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు అమలు చేస్తున్నాయి.

మూడేండ్ల టెన్యూర్‌పై

సీనియర్ సిటిజన్లకు మూడేండ్ల కాలపరిమితికిగాను చేసే ఎఫ్‌డీలపై ఆయా స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 9.1 శాతం నుంచి 8.25 శాతం వరకు వడ్డీరేట్లను ఆఫర్ చేస్తున్నాయి. నిజానికి ప్రధాన వాణిజ్య బ్యాంకుల్లో ఈ స్థాయిలో వడ్డీరేట్లను ఆఫర్ చేస్తున్నవి పెద్దగా లేవనే చెప్పవచ్చు. కానీ చిన్న బ్యాంకులు ఇందుకు భిన్నంగా కస్టమర్లను ఆకట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి.

ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ గరిష్ఠంగా 9.1 శాతం వడ్డీరేటును అందిస్తున్నది. అయితే ఎఫ్‌డీ విలువ రూ.3 కోట్లను దాటరాదు. అలాగే నార్త్ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 9 శాతం వరకు వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది. ఇక జన, సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 8.75 శాతం వరకు, యునిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.65 శాతం వరకు వడ్డీరేట్లను చెల్లిస్తున్నాయి. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.25 శాతం వరకు వడ్డీరేటును ప్రకటించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ మంగళవారం 06 । మే । 2025

# నవ విశ్వం

## ఉద్రిక్తతలు కొనసాగితే భారత్ కంటే పాకిస్థాన్‌కే ఎక్కువ నష్టం..



**శ్రీనగర్-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ఉద్రిక్తలు ఇలాగే కొనసాగితే పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరించింది. ఉద్రిక్తతలవల్ల భారత్‌తో పోల్చుకంటే పాకిస్థానే తీవ్రంగా నష్టపోతుందని తెలిపింది. ఉద్రిక్తల కారణంగా పాకిస్థాన్ వృద్ధిరేటు మందగించడం, నిధుల సేకరణకు పాక్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందులు లాంటివి తలెత్తుతాయని మూడీస్ పేర్కొంది. పాకిస్థాన్‌కు బాహ్య అప్పుల లభ్యత పరిమితమైపోవడంతోపాటు ఆ దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు కరిగిపోతాయని మూడీస్ హెచ్చరించింది. ఇప్పుడు విదేశీ అప్పుల చెల్లింపులకు అవి సరిపోని పరిస్థితి నెలకొన్నట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో కూడా పాకిస్థాన్ ఐఎంఎఫ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. అదేవిధంగా భారత ఆర్థికవ్యవస్థ బలంగానే ఉంటుందని, స్థిరమైన వృద్ధిరేటును నమోదు చేస్తుందని మూడీస్ తెలిపింది. దీనికి తోడు నాణ్యమైన ప్రభుత్వ వ్యయాలు, ప్రజల వినిమయ శక్తి చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటాయంది. ప్రస్తుత ప్రాంతీయ ఉద్రిక్తతల ప్రభావం అతి స్వల్పంగానే ఉంటుందని పేర్కొంది. భారత ఆర్థిక కార్యకలాపాల్లో పెద్దగా ఇబ్బందులు ఉంటాయని అనుకోబోమని, ఎందుకంటే భారత్‌కు పాక్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు అతి తక్కువని, భారత్ మొత్తం ఎగుమతుల్లో ఇస్లామాబాద్‌కు వెళ్లేవి 0.5 శాతం మాత్రమేని మూడీస్ వెల్లడించింది.

# భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతల వేళ కరాచీ పోర్టులో టర్కీ యుద్ధనౌక



**శ్రీనగర్-నవభూమి:**జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాడిలో పాక్ ప్రమేయం ఉన్నట్టు ఆధారాలు లభ్యం కావడంతో దాయాదిపై భారత్ దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. పాక్ విమానాల కోసం భారత గగనతలాన్ని మూసివేసింది. ఆ దేశంతో దిగుమతులను ఆపేసింది. దీంతో పాకిస్థాన్ అన్ని విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భారత్ ప్రతీకార దాడి తప్పదని, ఎప్పుడు ఏం జరుగుతుందో అనే భయం పాక్‌ను వెంటాడుతోంది. అలాగే, తాము అణుబాంబులు వేయడానికి వెనుకాడబోమని పాక్ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారు. దీంతో ఇతర దేశాల మద్దతు కోసం పాకిస్థాన్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే టర్కీ చెందిన యుద్ధ నౌక కరాచీ తీరానికి చేరడం కలకలం రేపుతోంది. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాల అధికారులతో వరుసగా సమావేశం కావడం ఉత్కంఠ పెంచుతోంది. ఈ నేపథ్యంలో పాక్ ప్రభుత్వం ఆర్మీ అధికారులు, ప్రతిపక్ష పార్టీలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానీ, ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. ఉగ్రవాదాన్ని తాము ఖండిస్తున్నామని, ఇమ్రాన్ ఖాన్ కూడా ఇదే విషయాన్ని చాలాసార్లు చెప్పారని %బు×% తెలిపింది. 'చాలా కాలంగా ఉగ్రవాదాన్ని పీటీఐ ఖండిస్తోంది.. పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ కూడా ఈ విషయంలో తన వైఖరిని పలుమార్లు బహిరంగ సమావేశాల్లోనూ నొక్కి చెప్పారు' అని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇక, పాక్‌కు సాయంగా మిత్ర దేశమైన టర్కీ.. అత్యంత శక్తివంతమైన 'టీసీజీ బుయుకడా' అనే యుద్ధ నౌకను కరాచీ తీరానికి పంపినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నౌక జలాంతర్గాములను గుర్తించి దాడి చేయగలదు. ఇది గస్తీలో కూడా చాలా సమర్థవంతంగా పనిచేస్తుంది. అరేబియా సముద్రంలో పాకిస్థాన్ నౌకలకు ప్రయాణ మార్గాలను భారత్ ఇప్పటికే మూసివేసింది. భారత్ ఎప్పుడైనా దాడి చేయవచ్చని పాకిస్థాన్ భయపడుతోంది. అందుకే టర్కీ సహాయంతో గస్తీ నౌకను తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. మే 4 నుంచి 7 వరకు కరాచీలో ఉండనున్నట్టు సమాచారం. ఈ యుద్ధనౌక కరాచీ తీరంలో ఉన్నట్టు టర్కీ రక్షణ మంత్రిత్వ శాఖ పబ్లిక్ రిలేషన్స్, మీడియా సలహాదారు అడ్మిరల్ జెకీ ఆక్తుర్క్ ధ్రువీకరించారు. కానీ, ఇది లంకావీ అంతర్జాతీయ మారీటైమ్, ఏరోస్పేస్ ప్రదర్శన లో పాల్గొనేందుకు వెళ్తోందని చెప్పారు. అది ప్రయాణించే మార్గంలో ఒమన్, పాకిస్థాన్ పోర్టులు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు. 'వివిధ ఆపరేషన్లు, మిషన్లతో పాటు టర్కీ సాయుధ దళాలు తమ ఆపరేషనల్ సిద్ధత, సిబ్బంది నైపుణ్యాన్ని మెరుగుపరచేందుకు నిరంతరంగా శిక్షణలు, డ్రిల్స్ నిరంతరం జరుగుతున్నాయి' అని అడ్మిరల్ తన ప్రకటనలో తెలిపారు. ఇస్తాంబుల్‌లోని తుజ్లా నావెల్ షిప్‌యార్డ్ టీసీజీ బుయకడా నిర్మాణాన్ని 2008 జనవరి 22న ప్రారంభించి.. 2011 సెప్టెంబరు 27కి పూర్తిచేసింది. రెండేళ్ల పరీక్షల అనంతరం 2013 సెప్టెంబరు 27న నౌకాదళం చేరింది. ఇప్పటికే టర్కీకి చెందిన యుద్ధ విమానాలు కరాచీ విమానాశ్రయంలో దిగినట్టు ప్రచారం సాగుతోంది. ఈ సమయంలోనే యుద్ధ నౌక కరాచీ తీరానికి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక టర్కిష్ సీ-130ఈ హెర్క్యులస్ విమానం కరాచీలో దిగిందని, ఈ విమానంలో పాకిస్థాన్‌కు మిలటరీ సామాగ్రి పంపినట్టు సమాచారం. ఓపెన్-సోర్స్ ఇంటెలిజెన్స్ ట్రాకర్లు ప్రచురించిన విమాన ట్రాకింగ్ డేటా ఆధారంగా ఈ నివేదికలు వెలువడ్డాయి. ఈ విమానం ఏప్రిల్ 28న అరేబియా సముద్రం మీదుగా ప్రయాణిస్తున్నట్లు కనిపించింది. అయితే, ఈ ప్రచారాన్ని టర్కీ ఖండించింది.


## సిక్కు అల్లర్లపై రాహుల్ సమాధానం..

### స్వచ్ఛమైన హృదయమున్న నేతగా సంజయ్ రౌత్ ప్రశంస




**న్యూఢిల్లీ-నవభూమి:**కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ప్రశంసలు గుప్పించారు. ఆయన స్వచ్ఛమైన హృదయం కలిగిన రాజకీయ నాయకుడని కితాబు ఇచ్చారు. దేశంలో అలాంటి నాయకుడు ఉండటం మన అదృష్టమని అన్నారు. అమెరికా టూర్ సందర్భంగా సిక్కు అల్లర్ల గురించి ఒక సిక్కు విద్యార్థి అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ సమాధానం ఇచ్చారు. 'ఆపరేషన్ బ్లూస్టార్ ఒక పొరపాటు' అని ఒప్పుకున్నారు. అప్పుడు పార్టీలో తాను లేనప్పటికీ గతంలో కాంగ్రెస్ పరంగా జరిగిన కొన్ని తప్పులకు తాను సంతోషంగా బాధ్యత వహిస్తానని అన్నారు.కాగా, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ దీనిని ప్రస్తావించారు. సిక్కు అల్లర్లపై సమాధానం ఇచ్చిన రాహుల్ గాంధీని ఆయన ప్రశంసించారు. 'రాహుల్ గాంధీ స్వచ్ఛమైన హృదయం కలిగిన రాజకీయ నాయకుడు. ఆయన తన తప్పును అంగీకరించడం మనం చూశాం. మన దేశంలో అలాంటి నాయకుడు ఉండటం మన అదృష్టం. రాజకీయాల్లో తప్పును అంగీకరించడం చాలా పెద్ద విషయం. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా కూడా తప్పును అంగీకరించడం నేర్చుకోవాలి. రాహుల్ గాంధీ మాదిరిగా ముందుకు సాగాలి' అని అన్నారు.

## సమయ్ రైనా సహా పలువురు కమెడియన్‌లకు సుప్రీంకోర్టు సమన్స్.. ఎందుకంటే..!



**న్యూఢిల్లీ-నవభూమి:**సమయ్ రైనా తోపాటు మరో నలుగురు కమెడియన్‌ల కు సుప్రీంకోర్టు సమన్‌లు జారీచేసింది. దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేసినందుకు వారికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. కోర్టు ముందు స్వయంగా హాజరై ఆ అనుచిత వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. వ్యక్తిగతంగా హాజరుకాకపోతే తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. దివ్యాంగులను కించపర్చేలా ఉన్న డిజిటల్ మీడియా ప్రసారాలకు అడ్డుకట్ట వేయాలని, దివ్యాంగుల హక్కులు, గౌరవానికి భంగం కలుగకుండా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ క్యూర్ %హోహ% ఫౌండేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రతివాదులైన ఐదుగురు కమెడియన్స్‌కు సమన్‌లు జారీచేసింది. సమయ్ రైనాతో పాటు నోటీసులు అందుకున్న కమెడియన్‌లు నలుగురిలో విపుల్ గోయెల్, బాలరాజ్ పరంజీత్ సింగ్ ఘాయ్, సోనాలీ థాకర్ అకా సోనాలీ ఆదిత్య దేశాయ్, నిషాంత్ జగదీశ్ తన్వర్ ఉన్నారు. వీరంతా కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. లేదంటే కఠిన పరిణామాలు ఉంటాయని హెచ్చరిక చేసింది.

## భారత ఆర్మీ వెబ్‌సైట్లపై పాక్ హ్యాకర్ల దాడి



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ సైనిక వెబ్‌సైట్లను పాకిస్థాన్ సైబర్ గ్రూపులు టార్గెట్ చేస్తున్నాయి. దీంతో కొన్ని మిలిటరీ వెబ్‌సైట్లు డౌన్ అయ్యాయి. కొన్ని వెబ్‌సైట్లు ఆఫ్‌లైన్‌లోకి వెళ్లాయి. భారతీయ రక్షణ దళ అధికారులకు చెందిన సున్నితమైన సమాచారాన్ని హ్యాక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆఫీసర్లకు చెందిన లాగిన్ క్రెడెన్షియల్స్, పర్సనల్ డిటేల్స్‌ను పాకిస్థాన్ సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నారు. భారతీయ సైనిక దళాలతో పాటు మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు పాకిస్తాన్ సైబర్ ఫోర్స్ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నది.
రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్మర్డ్ వెహికిల్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన వెబ్‌సైట్‌ను కూడా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు తెలుస్తోంది. హ్యాక్ అయిన ఆ కంపెనీ వెబ్‌పేజీని ఎక్స్ అకౌంట్‌లో చేసింది ఆ సైబర్ గ్రూపు. ఆర్మర్డ్ వెహికిల్ నిఘమ్ లిమిటెడ్ స్థానంలో పాకిస్తాన్ జెండా, ట్యాంక్ కనిపిస్తున్నాయి. ఆర్మీ ఆఫీసర్లకు చెందిన కొన్ని పేర్లను ప్రచురించారు. అకౌంట్లు హ్యాక్ అయినట్లు కొందరు ఆఫీసర్లకు మెసేజ్‌లు వస్తున్నాయి. మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 1600 మంది యూజర్ల 10జీబీ డేటాను హ్యాక్ చేసినట్లు సైబర్ నేరగాళ్లు ప్రకటించారు. అయితే ముందస్తు జాగ్రత్తగా ఆర్మర్డ్ వెహికిల్ నిఘమ్ లిమిటెడ్ వెబ్‌సైట్‌ను ఆఫ్‌లైన్‌లో పెట్టినట్లు అధికారులు చెప్పారు. పాకిస్థాన్ చేస్తున్న సైబర్ దాడుల్ని తిప్పికొట్టేందుకు భారతీయ సైబర్ సెక్యూర్టీ నిపుణులు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారు. సైబర్ గ్రూపు %నూాశ%1337, నేషనల్ సైబర్ క్రూ అనే హ్యాకింగ్ గ్రూపులు జమ్మూలోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్ల వెబ్‌సైట్లను హ్యాక్ చేశాయి. పెహల్గామ్ బాధితుల ఫోటోలు మార్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆ హ్యాకింగ్ ప్రయత్నాలను భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది.

## రాఫెల్ టాయ్‌కు నిమ్మకాయ, మిర్చి కట్టిన కాంగ్రెస్ నేత..

**న్యూఢిల్లీ-నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ ఆరోపించారు. రాఫెల్ బొమ్మకు నిమ్మకాయ, మిరపకాలు కట్టి చూపిస్తూ కేంద్రాన్ని ఈ మేరకు ఎగతాళి చేశారు. 'చాలా మాట్లాడే ఈ ప్రభుత్వం ఉగ్రవాదులను అణిచివేస్తామని చెబుతుంది. వారు రాఫెల్స్‌ను తీసుకువచ్చారు. కానీ హ్యాంగర్లలో ఉంచి మిరపకాయలు, నిమ్మకాయలు వేలాడదీస్తున్నారు. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని ఆయన ప్రశ్నించారు.కాగా, 2019లో ఫ్రాన్స్‌లో రాఫెల్ యుద్ధ విమానానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పూజలు చేశారు. ఈ సందర్భంగా శుభసూచికంగా రాఫెల్ చక్రాల కింద నిమ్మకాయలను ఆయన ఉంచడాన్ని అజయ్ రాయ్ ఇలా గుర్తు చేశారు.

## రష్యా పర్యటనకు చైనా అధ్యక్షుడు.. మోదీ నో, జిన్ పింగ్ యస్..



**చైనా-నవభూమి:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యా పర్యటనకు వెళ్లనున్నారు. మాస్కోలో మే 9వ తేదీ విక్టరీ డే పరేడ్ జరగనుంది. ఈ నేపథ్యంలో విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనేందుకు షీ జిన్‌పింగ్‌కు రష్యా నుంచి ఆహ్వానం అందింది. దీంతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రష్యా వెళ్తున్నారు. ఈ మేరకు జిన్‌పింగ్ రష్యా పర్యటనను రష్యా అధికారులు అధికారికంగా ప్రకటించారు. మే 7 నుంచి మే 10 వరకూ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యాలో పర్యటించనున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు జిన్ పింగ్ రష్యాకు వస్తున్నట్లు క్రెమ్లిన్ తెలిపింది.. విక్టరీ డే వేడుకల్లో పాల్గొనటంతో పాటుగా ఇరుదేశాల వ్యూహాత్మక సంబంధాలపై ఇద్దరు నేతలు చర్చలు జరుపుతారని పేర్కొంది. అలాగే ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా చర్చిస్తారని తెలిపింది. ఈ సందర్భంగా రష్యా, చైనా పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేయనున్నట్లు వెల్లడించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా ఉక్రెయిన్‌లోకి సైన్యాన్ని పంపిన తర్వాత జిన్‌పింగ్ రష్యా పర్యటనకు వెళ్లడం ఇది మూడోసారి. రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి తాము తటస్థ వైఖరిని అవలంభిస్తున్నట్లు చైనా చెప్తోంది. అయితే పశ్చిమ దేశాలు రెచ్చగొట్టడమే రష్యా చర్యలకు కారణమనే క్రెమ్లిన్ వాదనలకు చైనా మద్దతు తెలుపుతోంది. అంతేకాదు ఆయుధాల ఉత్పత్తికి మాస్కోకు అవసరమైన కీలక భాగాలను చైనా సరఫరా చేస్తూనే ఉంది. ఇక రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత జిన్ పింగ్ 2023లో రష్యాలో అధికారికంగా పర్యటించారు. అనంతరం రష్యా అధ్యక్షుడ్ను వ్లాదిమిర్ పుతిన్ 2023 అక్టోబర్‌లో చైనాను సందర్శించారు. ఆ తర్వాత ఇద్దరు నేతలు మే 2024లో బీజింగ్‌లో సమావేశమయ్యారు. 2024 సెప్టెంబర్‌లోనూ బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సమావేశం కోసం జిన్‌పింగ్ రష్యాలో పర్యటించారు. ఇప్పుడు మూడోసారి రష్యా పర్యటనకు వెళు న్నారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రష్యా పర్యటనకు వెళ్లాల్సి ఉండేది. విక్టరీ డే వేడుకలకు రావాలంటూ పుతిన్ ప్రధాని మోదీని ఆహ్వానించారు. అయితే పహల్గాం ఉగ్రదాడి, భారత్ పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో మోదీ రష్యా పర్యటన రద్దయ్యింది. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ఇటీవల ప్రకటించింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా రష్యా ఏటా విక్టరీ డే వేడుకలు జరుపుకుంటోంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో ఈ సందర్భంగా భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. విక్టరీ డే వేడుకలు ఈ సారి 80 ఏళ్లు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో 80వ వార్షికోత్సవం సందర్భంగా మిత్ర దేశాధినేతలను రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానించారు.

## భారత్‌తో పోలిస్తే పాక్ క్షిపణుల సామర్థ్యం ఎంతంటే..



**శ్రీనగర్--నవభూమి:**ఉగ్రమూకలను భారత్‌పై ఉసిగొల్పి అమాయకులను పొట్టన పెట్టుకున్న పాక్.. క్షిపణి ప్రయోగాలు చేస్తూ భారత్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. తాజాగా అబ్దాలీ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని నిర్వహించింది. సాయుద్ధ దళాల యుద్ధ సన్నద్ధతను ప్రరిశీలించే నిమిత్తం ఈ పరీక్ష నిర్వహించినట్టు చెప్పుకొచ్చింది. భారత్‌ను టార్గెట్ చేసుకునే సత్తా తమకుందని చెప్పుకుంది. మరి ఈ నేపథ్యంలో భారత్, పాక్ క్షిపణుల సామర్థ్యం ఎంతో ఈ కథనంలో తెలుసుకుందాం. పాక్ ప్రయోగించిన అబ్దాలీ క్షిపణిని హత్ఫ్-2 అని కూడా పిలుస్తారు. దీన్ని పాక్‌కు చెందిన స్పేస్ రీసెర్చ్ కమిషన్ రూపొందించింది. భూమిపై నుంచి ప్రయోగించే ఈ బాలిస్టిక్ క్షిపణి 450 కిలోమీటర్ల దూరంలోని ఉపరితల లక్ష్యాలను ఛేదించేలా రూపొందించారు. ఇందులో అత్యాధునిక నావిగేషన్ వ్యవస్థ ఉన్నప్పటికీ అణువార్ హెడ్స్ మోసుకెళ్లే సామర్థ్యం మాత్రం లేదు. ఇక దాయాది దేశం వద్ద బాబర్ (700 కిలోమీటర్లు), ఘజ్నవీ(300 కిలోమీర్లు), షాహీన్ (2750కిమీటర్లు) మిసైళ్లు కూడా ఉన్నాయి.
ఇక భారత్ ఇప్పటికే వివిధ లక్ష్యాలను ఛేదించగలిగేలా పలు రకాల క్షిపణులను తయారు చేసుకుంది. బ్రహోస్, అగ్నీ-5, నిర్భయ్, ప్రళయ్, పృథ్వి-2 మిస్పైల్స్ భారత అమ్ములపొదిలో రెడీగా ఉన్నాయి. అగ్నీ-5 మిస్పైల్.. గరిష్ఠంగా 8 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. టన్ను బరువున్న వార్‌హెడ్‌లను దీని ద్వారా ప్రయోగించొచ్చు. భారత్ వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన దీర్ఘశ్రేణి క్షిపణిగా పేరుపొందింది. ఇక సబ్‌మెరైన్ ద్వారా ప్రయోగించగలిగే కే-4 ఎస్ఎల్‌బీఎమ్ 3500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సులువుగా ఛేదించగలదు. కే-4తో అణుబాంబులు కూడా ప్రయోగించొచ్చు. పాక్ రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేయగలిగేలా దీన్ని రూపొందించారు. సూపర్ సానిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ధ్వనికి మూడు రెట్లు సమానమైన వేగంతో( మాక్-3) ప్రయాణిస్తూ శత్రుదేశ లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించగలదు. వెయ్యి కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలిగే నిర్భయ్‌కు శత్రుదేశ రక్షణ వ్యవస్థలను తప్పించుకునేలా మార్గమధ్యంలో తన దిశను మార్చుకుని ప్రయాణించే సామర్థ్యం ఉంది. ఉపరితల లక్ష్యాలను ఛేదించేందుకు ఉద్దేశించిన టాక్టికల్ మిసల్ ప్రళయ్ పరిధి 150 కిలోమీటర్లు. ఇది శత్రుదేశ నిర్మాణాలను అత్యంత ఖచ్చితత్వంతో కూల్చగలదు. ఇక వైమానికశక్తిలో కూడా భారత్ ముందు పాక్ దిగదుడుపే. భారత ఎయిర్‌ఫోర్స్ విమానాల సంఖ్య 2229 కాగా వీటిల్లో యుద్ధ విమానాల సంఖ్య 513. పాక్ యుద్ధ విమానాల సంఖ్య 328. భారత్ వద్ద రఫేల్, సుఖోయ్, మిగ్ విమానాలు ఉంటే పాక్ వద్ద జే-17, ఎఫ్-16 యుద్ధ విమానాలు ఉన్నాయి.

## పహల్గాం ఘటనపై సోనూ నిగమ్ సంచలన కామెంట్స్



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రముఖ గాయకుడు సోను నిగమ్‌కు బెంగళూరు పోలీసులు నోటీసు జారీ చేశారు. వారం రోజుల్లోగా దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని ఆదేశించారు. కెఆర్‌వి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా బెంగళూరు గ్రామీణ జిల్లాలోని అవలహళ్లి పోలీస్ స్టేషన్‌లో గాయకుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఓ సంగీత కార్యక్రమంలో కన్నడిగులను టెర్రరిస్టులతో పోలుస్తూ సోనూ నిగమ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సీఎం సిద్ధరామయ్య సహా రాష్ట్ర ప్రజలంతా గాయకుడి తీరును నిరసిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశించారు.
భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్లు 351(2) (నేరపూరిత బెదిరింపు), 352 (ప్రజలకు హాని కలిగించే ప్రకటనలు), 352(1) (శాంతికి భంగం కలిగించే ఉద్దేశ్యంతో లేదా మరొక నేరాన్ని ప్రేరేపించే ఉద్దేశ్యంతో ఉద్దేశపూర్వకంగా అవమానించడం) కింద బెంగళూరులోని అవలహళ్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. కర్ణాటక రక్షణ వేదిక బెంగళూరు నగర జిల్లా యూనిట్ అధ్యక్షుడు ఎ. ధర్మరాజ్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు ఫైల్ చేశారు. "సోనూ నిగమ్ వ్యాఖ్యలు కన్నడిగ సమాజం మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయి. కర్ణాటకలోని వివిధ భాషా వర్గాల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టాయి. ఈ వ్యాఖ్యలు హింసను రేకెత్తించే అవకాశం ఉంది" అని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.
పహల్గాం ఘటనకు ఇదే కారణం..
మే 1 శనివారం నాడు బెంగళూరులోని ఈస్ట్ పాయింట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో జరిగిన కచేరీ సందర్భంగా ఈ వివాదం చెలరేగింది. ప్రేక్షకుల్లో నుంచి ఓ విద్యార్థి కన్నడ పాటను పాడమని సింగర్ సోనూ నిగమ్ ను అభ్యర్థించాడు. దీనిపై గాయకుడు తీవ్రంగా స్పందిస్తూ, "నేను వివిధ భాషలలో పాడాను. కన్నడలోనూ అత్యుతమం అని చెప్పదగ్గ ఎన్నో పాటలు పాడాను. కర్ణాటకకు ఎప్పుడూ చాలా ప్రేమ, గౌరవంతో వస్తాను. మీరందరూ నన్ను కుటుంబంలా చూసుకున్నారు. నేను కోరినప్పుడల్లా కన్నడ పాటలు పాడతాను. ఆ యువకుడి వయస్సు కంటే ఎక్కువ కాలం నుంచే నేను కన్నడలో పాడుతున్నాను. కానీ అతడు 'కన్నడ, కన్నడ' అని అరిచిన విధానం నాకు నచ్చలేదు. అలాంటి ప్రవర్తన వల్లే పహల్గాం దాడి వంటి సంఘటనలు జరుగుతాయి." అని అన్నారు. గాయకుడు చేసిన ఈ వ్యాఖ్యలు కర్ణాటక ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉగ్రవాద దాడికి, పాట పాడమని అభ్యర్థించడానికి మధ్య సంబంధం ఏంటని కన్నడ భాషా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కొందరు సోను నిగమ్‌పై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. కన్నడిగులను అవమానించారని, భాషా వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టారని ఆరోపించారు. సుమోటోగా కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు.

## మీ ఉప్పు మాకొద్దు..! పాకిస్తాన్ ఉత్పత్తుల దిగుమతిపై భారత్ బ్యాన్..!



**శ్రీనగర్--నవభూమి:**హహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ నుంచి దిగుమతులను భారత ప్రభుత్వం నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నది. రాక్‌సాల్ట్, డ్రై ఫ్రూట్స్ సహా పలు ఉత్పత్తులు దిగుమతి అవుతాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల నేపథ్యంలో వ్యాపారులు పెద్ద ఎత్తున రాక్ సాల్ట్ ఆర్డర్స్‌ను రద్దు చేశారు. కొత్తగా పాక్‌కు ఆర్డర్ ఇవ్వడం ఆపేశారు. చాంబర్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌కు చెందిన అశోక్ లాల్వానీ మాట్లాడుతూ రాక్ సాల్ట్ (కల్లుప్పు) ఉప్పు, ఖర్జూరం, నల్ల ఎండుద్రాక్ష, సబ్జా సీడ్స్ పాకిస్తాన్ నుంచి దిగుమతి దిగుమతి చేసుకుంటున్నట్లు అంజూర పండ్లు, ఎండుద్రాక్షలు పాకిస్తాన్ ద్వారా ఆఫ్ఘనిస్తాన్‌కు చేరుకుంటాయన్నారు. ప్రతి నెలా 250 నుండి 300 టన్నుల రాక్ సాల్ట్, 550-600 టన్నుల ఖర్జూరం, 15 టన్నుల పిస్తా-నల్ల ఎండుద్రాక్ష, సబ్జా సీడ్స్ వ్యాపారం జరుగుతుందన్నారు. పాకిస్తాన్ నుండి దిగుమతులపై నిషేధం కారణంగా, టోకు వ్యాపారులు ప్రస్తుతానికి పెద్ద మొత్తంలో రాక్ సాల్ట్ ఆర్డర్‌లను రద్దు చేశారు. కొత్త ఆర్డర్‌లు ఇవ్వడం లేదన్నారు. ఆగ్రా గ్రోసరీ కలర్ అండ్ కెమికల్ కమిటీ సభ్యుడు పవన్‌దీప్ కపూర్ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు 30 మంది డ్రై ఫ్రూట్స్ హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారని తెలిపారు. అందరూ పాకిస్తాన్ ద్వారా ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఎండుద్రాక్ష, పిస్తాపప్పులు, అంజూరలు దిగుమతి చేసుకున్నట్లు చెప్పారు. ఆగ్రాలో 25-30 టన్నుల అంజూరలు, 40-50 టన్నుల ఎండుద్రాక్ష వ్యాపారం జరుగుతుందన్నారు. ఇప్పుడు వాటిని ఇతర దేశాల ద్వారా దిగుమతి చేసుకోనున్నట్లు చెప్పారు. రవాణా ఖర్చు పెరుగుదల వాటి ధరలను ప్రభావితమయ్యే అవకాశం ఉంటుందన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా, మొత్తం వ్యాపార సంఘం భారత ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతుందన్నారు. అలాగే, పాకిస్తాన్ నుంచి దిగుమతులను నిలిపివేయడం వల్ల కాటన్ బట్టల ధరలపై ప్రభావం చూపుతుందని ఆగ్రా వ్యాపార్ మండల్ అధ్యక్షుడు టీఎన్ అగర్వాల్ పేర్కొన్నారు. పత్తిని పాక్ నుంచి దిగుమతి అవుతుందన్నారు. కాటన్ బట్టలకు డిమాండ్ వేగంగా పెరిగిందన్నారు. చొక్కాలు, ధోతీలు, లోదుస్తులు అన్నీ కాటన్ నుంచే తయారవుతున్నాయన్నారు. బంగ్లాదేశ్‌తో సంబంధాలు సరిగా లేవని రాజీవ్ గుప్తా తెలిపారు. ఈ పరిస్థితుల్లో కాటన్ వస్త్రాల ధరలు పెరిగే అవకాశం ఉందని.. పాకిస్తాన్ నుంచి దిగుమతులను నిలిపివేయడంతో దేశంలోని కొంతమందిని మాత్రమే ప్రభావితం చేస్తుందని.. కానీ, పాకిస్తాన్ భారీ నష్టాలను చూస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

**పాకిస్తాన్ నుంచి దిగుమతి చేసుకునే ఉప్పు స్పెషల్ ఏంటీ..!**

హిందువులు ఉపవాసం ఉండే సమయాల్లో ఈ ప్రత్యేకమైన ఉప్పును వాడుతారు. ఈ ఉప్పును కల్లుప్పు. హిమాలయన్ స్టాల్ పేరుతో పిలుస్తుంటారు. ఈ ఉప్పు పాకిస్తాన్ నుంచి భారత్‌కు దిగుమతి అవుతుంది. ప్రస్తుతం, పహల్గాం ఉగ్రదాడి తర్వాత అన్ని రకాల దిగుమతులను నిలిపివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఏళ్లుగా భారత్ ఈ ఉప్పును చౌకగా దిగుమతి చేసుకుంటూ వస్తుంది. ఈ ఉప్పుని శుద్ధి చేయరు. ఇందులో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. సాధారణ ఉప్పుతో పోలిస్తే ఈ మూడు అంశాలు ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇది ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ రాక్ సాల్ట్‌ని సేంధా నమక్‌గా పిలుస్తారు. సింధు ప్రాంతం వస్తున్నందున ఆ పేరు వచ్చింది. పాకిస్తాన్‌లోని లాహోర్ నుంచి వస్తుందున లాహోరీ ఉప్పు అని సైతం పేరుంది. ప్రస్తుత పాకిస్తాన్‌లోని వాయవ్య పంజాబ్‌లో నమక్ కోహ్ అనే ప్రసిద్ధ కొండ దగ్గర ఈ ఉప్పు కనిపిస్తుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు గని అయిన 'ఖేవ్డా సాల్ట్ మైన్' ఉంది. అంటారియోలోని సిఫ్టో కెనడా సాల్ట్ మైన్స్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నది. ఖేవ్డా సాల్ట్ మైన్ నుంచి ఏటా 4.65 లక్షల టన్నుల ఉప్పు వెలికి తీస్తుండగా.. రాబోయే 500 సంవత్సరాలకు ఇక్కడి నుంచే ఉప్పు సరఫరా అవుతుందని పేర్కొంటున్నారు. ఖేవ్డా సాల్ట్ మైన్‌లో 40 కిలోమీటర్ల పొడవైన సొరంగం ఉన్నది. ఇక్కడి నుంచి సేకరించి ఉత్తర భారత ఉపఖండానికి సరఫరా చేస్తారు. భారత్ రాజస్థాన్‌లోని సంభార్ నది నుంచి ఈ ఉప్పు ఉత్పత్తి అవుతుంది. కానీ, తక్కువ పరిమాణంలోనే లభిస్తుంది. నాణ్యత సైతం తక్కువగా ఉంటుంది. ఈ ఉప్పును ఆహార పదార్థాలు, ఔషధాల తయారీలో వినియోగిస్తారు.

## ఆర్సీబీ కప్ గెలువాలంటే రూ.10 డొనేట్ చేయండి..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్ అంటే కేవలం ఒక క్రికెట్ టోర్నమెంట్ మాత్రమే కాదు. ఇది దేశంలోనే ఒక క్రీడా పండుగలా మారిపోయింది. ప్రతి ఏడాది ఐపీఎల్ సీజన్‌లో క్రికెట్ ప్రేమికుల హంగామా మామూలుగా ఉండదు. తమ అభిమాన టీమ్ గెలువాలని అభిమానులు పరితపిస్తుంటారు. ఐపీఎల్ ఫ్రాంచైజీలన్నింటిల్లో కల్లా బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్ ) టీమ్‌కు బలమైన ఫ్యాన్ బేస్ ఉంది. ఇది ఎవరూ కాదనలేని నిజం. అయితే ఆర్సీబీ టీమ్‌లో పెద్ద సెలెబ్రిటీలు ఉన్నప్పటికీ ఐపీఎల్ చరిత్రలో ఇంతవరకు బెంగళూరు ఒక్కసారి కూడా కప్ గెలుచుకోకపోవడం దురదృష్టకరం. అందుకే ఆర్సీబీ ఈసారి ఐపీఎల్ కప్ కొట్టాలని ఫ్యాన్స్ భారీగా హంగామా చేస్తున్నారు.



## పెద్దిలో రామ్ చరణ్ షాట్‌ని రీక్రియేట్ చేసిన డీసీ.. అదిరిపోలా?

రామ్ చరణ్, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలలో బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది. అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు. అయితే ఈ మూవీని వచ్చే ఏడాది రామ్ చరణ్ బర్త్ డే స్పెషల్‌గా రిలీజ్ చేయనున్నారు. ఇటీవల మూవీ నుండి గ్లింప్స్ విడుదల కాగా, ఇందులో రామ్ చరణ్ క్రికెట్ షాట్ అయితే ఓ రేంజ్‌లో ఉంది. పెద్ది సినిమాను బుచ్చిబాబు ఏ స్థాయిలో ఊహించుకున్నాడో.. అతని విజన్ ఏంటో ఒక్క ఫస్ట్ షాట్‌తోనే అర్థమైపోయింది. గ్లింప్స్ రిలీజ్ అయిన తర్వాత నుండి ఆ షాట్‌ని చాలా మంది అనుకరించే ప్రయత్నం చేస్తున్నారు. చిన్న చిన్న టోర్నమెంట్స్‌లోనే కాక ఇప్పుడు ఐపీఎల్ జట్టు డీసీ తమ ప్రమోషన్‌లో కూడా వాడుకోవడం విశేషం. మరికొద్ది గంటలలో ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ నేపథ్యంలో డీసీ టీమ్ ఓ వీడియో విడుదల చేయగా, ఇది ఎంతగానో ఆకట్టుకుంది. 'పెద్ది' సినిమా గ్లింప్స్ ఆడియోతో ఈ వీడియోను ఎడిట్ చేయగా, ఇందులో రామ్‌చరణ్ కొట్టిన షాట్‌ను ఢిల్లీ ఆటగాడు సమీర్ రిజ్వీ రీక్రియేట్ చేసి చూపించాడు. దీన్ని ఢిల్లీ క్యాపిటల్స్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయగా పెద్ది టీమ్ రీట్వీట్ చేసింది. ఇప్పుడు ఈ వీడియో కూడా ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం వీడియో అయితే నెట్టింట తెగ హల్‌చల్ చేస్తుంది.





## టాలీవుడ్‌లో కన్నడ భామల డిమాండ్

హీరోయిన్ శ్రీనిధి శెట్టికి ఎంతో టాలెంట్ ఉంది. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల్లో హీరోయిన్ గా నటించి అందరికీ పరిచయమైంది శ్రీనిధి. కానీ ఆ సినిమాలు హీరో పాత్ర ప్రధానంగా తెరకెక్కడంతో శ్రీనిధి శెట్టి కేవలం గ్లామర్ పాత్రకే పరిమితమైంది. కెజిఎఫ్ సినిమాల్లో నటించడం ద్వారా శ్రీనిధికి పాన్ ఇండియా స్థాయిలో అటెన్షన్ అయితే వచ్చింది కానీ స్టార్‌డమ్ మాత్రం రాలేదు. కానీ రీసెంట్ గా తెలుగులో శ్రీనిధి చేసిన హిట్3 సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో ఆ సినిమా అమ్మడికి మంచి స్టార్ డమ్‌ను తెచ్చి పెట్టింది. హిట్3 సక్సెస్ తో శ్రీనిధి తెలుగులో బిజీ అయ్యే అవకాశాలు పుష్కలంగానే కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడో ఇంట్రెస్టింగ్ విషయముంది. కన్నడ సినిమా నుంచి వచ్చిన రష్మిక మందన్నా, శ్రీలీల తమ కెరీర్ ను కన్నడలోనే మొదలుపెట్టారు కానీ ఎప్పుడైతే తెలుగు సినిమాలు చేశారో అప్పట్నుంచి వారికి విపరీతమైన స్టార్‌డమ్ వచ్చి ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీ అయ్యారు. రష్మిక, శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్ లో కూడా తమ సత్తా చాటుతున్నారు. రీసెంట్ టైమ్ లో సప్త సాగారాలు దాటి ఫ్రాంచైజ్ సినిమాలతో సక్సెస్ అందుకున్న రుక్మిణి వసంత్ కూడా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమాలో ఛాన్స్ కొట్టేసింది. డ్రాగన్ మూవీ షూటింగ్ కూడా పూర్తవకముందే రుక్మిణి డిమాండ్ టాలీవుడ్ లో బాగా పెరిగింది. దీంతో ఇప్పుడు శ్రీనిధి శెట్టి కూడా కన్నడ లో కెరీర్ ను స్టార్ట్ చేసి తెలుగులో స్టార్‌డమ్ అందుకున్న హీరోయిన్ల లిస్ట్ లో చేరింది. ఇక శ్రీనిధి విషయానికొస్తే ఆమె మధ్యలో కోబ్రా అనే తమిళ సినిమా చేసింది, కానీ అది శ్రీనిధికి అనుకున్న గుర్తింపు ఇవ్వలేదు. మూడేళ్ల తర్వాత ఆమె హిట్3తో తిరిగి సిల్వర్ స్క్రీన్ పై మెరిసి మంచి హిట్ తో పాటూ భారీ గుర్తింపును కూడా అందుకుంది. హిట్3 రిలీజ్ కు ముందే ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటూ సోషల్ మీడియాలో ఎంతోమందిని ఎట్రాక్ట్ చేసిన శ్రీనిధి గురించి అందరూ డిస్కస్ చేసుకున్నారు. హిట్3 సక్సెస్‌తో ఆల్రెడీ శ్రీనిధికి టాలీవుడ్ లో డిమాండ్ పెరిగింది. హిట్3 సక్సెస్ తో ఆమె వెంటనే స్టార్ హీరోయిన్ల లీగ్ లోకి ఎంటరయ్యే ఓ భారీ ఛాన్స్ దొరకడమే ఆలస్యం. ప్రస్తుతం సిద్దు జొన్నలగడ్డ హీరోగా శ్రీనిధి శెట్టి తెలుసు కదా అనే సినిమా చేస్తోంది. ఈ సినిమాతో పాటూ కన్నడలో సుదీప్ తో ఓ సినిమా చేస్తోంది శ్రీనిధి.

## ఎన్టీఆర్ బర్త్‌డే స్పెషల్ ఏంటో తెలిస్తే మతి పోవడం ఖాయం..!




ఎన్టీఆర్ బర్త్‌డే కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎన్టీఆర్ బర్త్‌డే అంటే అభిమానుల్లో కచ్చితంగా ఓ రేంజ్‌లో అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ప్రశాంత్ నీల్ ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు అనే వార్తలు వచ్చాయి. ఇటీవల మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చింది. ఎన్టీఆర్ నీల్ సినిమా నుంచి గ్లిమ్స్ రాబోతున్నాయనే వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ ఫ్యాన్స్‌తో పాటు, ప్రేక్షకులు ఎదురు చూస్తున్నట్లుగానే ప్రశాంత్ నీల్ భారీ సర్‌ప్రైజ్‌ను ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటికే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయింది. కనుక సినిమా నుంచి బిగ్ అప్డేట్ ఉంటుంది అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలోనే కాకుండా హిందీ సినిమా వార్ 2 లోనూ ఎన్టీఆర్ నటిస్తున్న విషయం తెల్సిందే. వార్ 2 సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చింది. సినిమాను ఆగస్టులో విడుదల చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ తేదీకి విడుదల చేయాలని నిర్మాతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. విడుదల తేదీ ఎలాగూ దగ్గర పడుతుంది. కనుక ఎన్టీఆర్ యొక్క ఫస్ట్ లుక్‌ను రివీల్ చేయాలని నిర్ణయించారు అని తెలుస్తోంది. అతి త్వరలోనే సినిమా నుంచి అధికారిక ప్రకటన వస్తుందని తెలుస్తోంది. ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఎన్టీఆర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేయబోతున్నారు. అంతే కాకుండా టీజర్‌ను విడుదల చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. వార్ 2 సినిమా కోసం నందమూరి అభిమానులతో పాటు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత ఎన్టీఆర్‌కి పాన్ ఇండియా స్థాయిని దాటి ఫ్యాన్స్ అయ్యారు. అందుకే ఈ సినిమా పై అన్ని భాషల ప్రేక్షకుల్లోనూ ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే సినిమా మేకర్స్ భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు. భారీ అంచనాల నడుమ రూపొందిన వార్ 2 సినిమాలో హీరోగా హృతిక్ రోషన్ నటిస్తూ ఉండగా, కీలక పాత్రలో ఎన్టీఆర్ కనిపించబోతున్నాడు. ఎన్టీఆర్ విలన్‌గా కనిపించబోతున్నాడు అనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై క్లారిటీ రాలేదు. త్వరలోనే విడుదల కాబోతున్న ఎన్టీఆర్ ఫస్ట్ లుక్‌తో ఆ విషయమై క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్టీఆర్ పుట్టిన రోజు అయిన మే 20న ఫ్యాన్స్ కోసం రెండు సర్‌ప్రైజ్‌లు దాదాపుగా కన్ఫర్మ్ అయింది. ఎన్టీఆర్ అభిమానులు, ఇండస్ట్రీ వర్గాల వారు ఎదురు చూస్తున్న ప్రశాంత్ నీల్ సినిమాకు సంబంధించిన అప్డేట్ కచ్చితంగా భారీ ఎత్తున ఉండే అవకాశాలు ఉన్నాయి. కేజీఎఫ్, సలార్ సినిమాలను మించి ఎన్టీఆర్ నీల్ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.

## 'పుష్ప 2' తర్వాత 'పెద్ది'... ఇది చాలా స్పెషల్ గురూ!




టాలీవుడ్‌లో శ్రీలీల ప్రస్తుతం మోస్ట్ యాక్టివ్ హీరోయిన్ అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాయి. మొదటి సినిమా పెళ్లి సందడి పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అయినా కూడా లక్ కలిసి వచ్చి శ్రీలీలకు ధమాకా సినిమాతో బిగ్ హిట్ దక్కింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఏకంగా అర డజను సినిమాలు చేసే అవకాశం ను దక్కించుకున్న విషయం తెల్సిందే. గత ఏడాది మహేష్ బాబు మూవీ గుంటూరు కారం తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన ఏడాది చివర్లో పుష్ప 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమాలో కిస్సిక్ అంటూ శ్రీలీల చేసిన ఐటెం సాంగ్ మరో స్థాయికి సినిమాను తీసుకు వెళ్లింది. అందుకే శ్రీలీల క్రేజ్ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో పెరిగింది. కిస్సిక్ కారణంగానే బాలీవుడ్‌లో సినిమాను చేసే అవకాశంను దక్కించుకుంది. తమిళనాట కూడా ఈమె ఒక సినిమాను చేస్తుంది. హీరోయిన్‌గా వరుసగా సినిమాలు చేస్తున్న శ్రీలీల త్వరలోనే తెలుగులో ఒక బిగ్ సినిమాలో ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఆ బిగ్ మూవీ మరేదో కాదు మెగా పవర్ స్టార్ నటిస్తున్న పెద్ది సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో పుకార్లు గుప్పుమంటున్నాయి. రామ్ చరణ్ హీరోగా ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే ధీమాతో ప్రేక్షకులు ఉన్నారు. బుచ్చి బాబు ఈ సినిమా కోసం ఒక ప్రత్యేక పాటను ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. ఆ పాటను శ్రీలీలతో చేయిస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని నిర్మాతలు చర్చించారని సమాచారం అందుతోంది. పుష్ప 2 సినిమాతో శ్రీలీల ఐటెం సాంగ్‌తో ఆకట్టుకుంది. కనుక రిస్క్ తీసుకోకుండా, కొత్త అమ్మాయితో కాకుండా శ్రీలీలను ఐటెం సాంగ్ కు ఎంపిక చేయడం అనేది మంచి నిర్ణయం అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. శ్రీలీల కూడా ఐటెం సాంగ్స్ చేసేందుకు ఓకే అంటుంది. పైగా రామ్ చరణ్ వంటి బిగ్ స్టార్‌కి జోడీగా ఐటెం సాంగ్‌లో నటించడం, పైగా ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించిన పాటలో కనిపించాలి అనుకోవడం ఎవరికి అయినా డ్రీమ్. కనుక శ్రీలీల కచ్చితంగా అవకాశం వస్తే పెద్ది సినిమాలో ఐటెం సాంగ్ చేయడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ విషయం గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. త్వరలోనే మరింత క్లారిటీ రావాల్సి ఉంది. సుకుమార్ సినిమాను ఫాలో అవుతూ బుచ్చిబాబు పెద్ది సినిమాను తీస్తున్నాడు. కనుక ఐటెం సాంగ్ ఖచ్చితంగా ఉండబోతుంది. ఆ ఐటెం సాంగ్‌లో శ్రీలీల ఉంటుందా అనేది చూడాలి.

## ఇక్కడ ఒకే...మరి అక్కడ ఎప్పుడు పవన్ జీ!



ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' షూటింగ్ షురూ చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం నుంచి చివరి షెడ్యూల్ మొదలవ్వడంతో చిత్రీకరణకు హాజరవుతున్నారు. హైదరాబాద్లో ప్రత్యేకంగా వేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు చిత్రీకరణ జరుగుతుంది. ఇందులో పవన్ పై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. అంటే మరికొన్ని గంటల్లో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. అనంతరం 6వతేదిన గుమ్మడికాయ కొట్టేస్తారు. అటుపై కొత్త రిలీజ్ తేదీని ప్రకటిస్తారు. ఇలా వీరమల్లు గట్టెక్కిసినట్లే. మరి 'ఓజీ' సంగతేంటి? అంటే ఉలుకు పలుకు లేకుండా కనిపిస్తుంది. కొన్ని నెలలుగా ఆ సినిమా మేకర్స్ కూడా పవన్ రాక కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఇదిగో వస్తు న్నాను..అదిగో వస్తున్నాను అనే మాట తప్ప ఆయన రావడం మాత్రం కనిపించలేదు. ఈ గ్యాప్ లో అటెన్షన్ తప్పకుండా ఏదో విషయం చెబుతూ టీమ్ కూడా మ్యానేజ్ చేసుకుంటూ వచ్చింది. అలాగని ఇంకెంత కాలం మ్యానేజ్ చేయగలరు. వాళ్లు కూడా కొన్ని రోజులుగా సైలెంట్ గా నే ఉంటు న్నారు. ఆయన వచ్చినప్పుడు చూసుకుందాంలే అన్న ధీమాకి వచ్చేసారు. అయితే వీరమల్లు పూర్తయిన నేపథ్యం లో పవన్ 'ఓజీ'కి కూడా డేట్లు ఇచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సినిమాకు పవన్ చాలా రోజులు డేట్లు కేటాయించాలి. హైదరాబాద్ సహా ముంబైలో కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాలి. పవన్ డేట్లు ఇస్తే టీమ్ తో పాటే కొన్ని రోజులు ఉండాలి. మధ్యలో రాజకీయం అంటూ అమరావతి రావడానికి వీలుండదు. ఇవన్నీ చూసుకుని పవన్ ఓజీకి డేట్లు కేటాయించాల్సి ఉంది. మరి దీనికి సంబంధించి రెండు..మూడు రోజుల్లో కొత్త అప్ డేట్ ఏదైనా వస్తుందేమో చూడాలి.

## ఏడిపించిన ముమైత్



తెలుగు ప్రేక్షకులకు ముమైత్ ఖాన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఈతరం ప్రేక్షకులు ముమైత్‌ను టీవీలో చూస్తూ ఉంటే, పదేళ్ల క్రితం వరకు ఆమె సినిమాల్లో ఏ రేంజ్‌లో సందడి చేసిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. టాలీవుడ్‌లో పెద్ద హీరోల సినిమాల్లో ప్రత్యేక పాటల్లో నటించి మెప్పించిన ముమైత్ ఖాన్ కొన్ని హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాల్లోనూ నటించడం ద్వారా టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకుంది. అప్పట్లో సోషల్ మీడియా కాస్త తక్కువ కావడంతో సినిమా ఆఫర్లు తగ్గిన వెంటనే ఈ అమ్మడిని జనాలు మెల్లగా మరచిపోతూ వస్తున్నారు. సినిమాల్లో మాత్రమే మొన్నటి వరకు కనిపిస్తూ వచ్చిన ముమైత్ ఇప్పుడ టీవీల్లో ప్రముఖంగా కనిపిస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం తెలుగు బిగ్‌బాస్ లో పాల్గొన్న ముమైత్ ఖాన్ కొన్నాళ్ల పాటు సినిమా ఇండస్ట్రీతో పాటు, బుల్లి తెరకు దూరంగా ఉంది. ఆమె కొన్ని వివాదాల కారణంగా వార్తల్లో నిలిచింది. కాని ఒకానొక సమయంలో పూర్తిగా సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చింది. ఆ సమయంలో ముమైత్ ఆరోగ్యం సరిగా లేదని తెలుస్తోంది. అనారోగ్య సమస్యల కారణంగా పూర్తిగా ఇండస్ట్రీకి దూరం అయిన ముమైత్ ఖాన్ ఇప్పుడు బుల్లి తెర ద్వారా రీ ఎంట్రీ కి సిద్ధం అయింది. ముమైత్ ఖాన్ ప్రస్తుతం ఒక డాన్స్ షో కి జడ్జ్‌గా వ్యవహరిస్తోంది. ఆ సమయంలో తన కెరీర్‌కి సంబంధించిన విషయాలను, తన ఇతర విషయాలను గురించి ప్రముఖంగా మాట్లాడుతూ వచ్చింది. తాజా ఎపిసోడ్‌లో ముమైత్ ఖాన్ మాట్లాడుతూ తన ఆరోగ్యం పై షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. ఇంట్లో ఒక సందర్భంలో డాన్స్ చేస్తున్న సమయంలో కాలు స్లిప్ అయ్యి పడి పోవడంతో మెదడులోని నరాలు కట్ అయ్యాయి. ఆ సమయంలో బతకడమే కష్టం అన్నారట. 15 రోజుల పాటు కోమాలో ఉన్నాను. ఆ సమయంలో ఏం జరిగింది అనేది తెలియదు. పదిహేను రోజుల తర్వాత కోమా నుంచి బయటకు వచ్చానని చెబుతూ ఉంటారు. సర్జరీ చేసిన తర్వాత కొంత మెమొరీ కూడా లాస్ అయింది. చాలా విషయాలను గుర్తు పెట్టుకోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. కొన్ని విషయాలను గుర్తు తెచ్చుకోవడంకు చాలా కష్టపడుతూ ఉంటాను అంది. ముమైత్ ఇప్పటికీ తీవ్రమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుందట. తన తలలో ఇప్పటికీ 9 వైర్లు ఉన్నాయని ముమైత్ చెప్పింది. చాలా యాక్టివ్‌గా కనిపిస్తూ, నవ్వుతూ నవ్వించే ముమైత్ వెనుక ఇంత కథ ఉందా అని చాలా మంది షాక్ అవుతూ ఉన్నారు. షో లో చాలా మంది ముమైత్ ఆ విషయాలు చెబుతూ ఉంటే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆమె ఏడవడం తో పాటు, అందరినీ ఏడిపించింది. ఆపరేషన్ తర్వాత చాలా మారినట్లుగా ఆమె చెప్పుకొచ్చింది. తన అందం కూడా చాలా తగ్గిందని, ఫిజికల్‌గా మెంటల్‌గా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ముమైత్ ఆవేదన వ్యక్తం చేసింది. సినిమా ఇండస్ట్రీలో ముమైత్ రీ ఎంట్రీకి ప్రయత్నాలు చేస్తున్నా అది సాధ్యం అయ్యేలా లేదు. ప్రస్తుతానికి బుల్లితెరపై సందడి చేస్తూ ఉంది.

## శ్రీతేజ్‌ని పరామర్శించిన అల్లు అరవింద్, బన్నీ వాసు.. ఇప్పుడు ఆరోగ్యం ఎలా ఉంది?




పుష్ప 2 ప్రీమియర్ సమయంలో హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కొద్ది రోజులుగా సికింద్రాబాద్ కిమ్స్‌లో అతనికి చికిత్స అందిస్తున్నారు. శ్రీతేజ్ గత మూడు నెలలుగా ఆసుపత్రిలోనే ఉన్నాడు. ఇప్పుడు ఆయన ఆరోగ్యం కాస్త కుదుటపడడంతో ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేశారు. వెంటనే అక్కడి నుండి ఏషియన్ ట్రాన్స్‌కేర్ రీహాబిలిటేషన్ సెంటర్ కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. శ్రీతేజ్‌ని మాములు మనిషిగా మార్చేందుకు వైద్యులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే శ్రీతేజ్ తమను ఇంకా గుర్తు పట్టడం లేదని శ్రీతేజ్ తండ్రి తెలిపారు. తాజాగా.. శ్రీతేజ్‌ను అల్లు అరవింద్, బన్నీ వాస్ పరామర్శించారు.. అతని ఆరోగ్యం కుదుటపడి మామూలుగా మారే వరకూ అండగా ఉంటామని.. భవిష్యత్తులోనూ శ్రీతేజ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అతని కుటుంబానికి అండగా నిలుస్తామంటూ వారు భరోసా ఇచ్చారు. శ్రీతేజ్ త్వరగా కోలుకొని అందరి పిల్లల మాదిరిగా స్కూల్‌కి వెళ్లాలని ఆకాంక్షించారు అల్లు అరవింద్. కాగా, శ్రీతేజ్ ఆసుపత్రిలో చేరినప్పటి నుండి అతని ఆసుపత్రి ఖర్చులు, కుటుంబ అవసరాలు అన్నింటిని భరిస్తున్నారు బన్నీ. దర్శకుడు సుకుమార్, నిర్మాతలు కూడా వారికి ఆర్థికంగా సాయం చేశారు.

## శ్రీలంక అదరహో.. భారత్‌పై ఏడేండ్ల తర్వాత విజయం



**కొలంబో-నవభూమి :** శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా వన్డేల్లో టీమ్‌ఇండియాపై ఏడేండ్లలో తొలి విజయాన్ని లంక సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 275/9 స్కోరు చేసింది. రీచా ఘోష్ (58) అర్ధసెంచరీతో రాణించగా, రోడ్రిగ్స్ (37), ప్రతికా రావల్ (35) ఆకట్టుకున్నారు. ప్రతిక, స్మృతి మందన..జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 51 పరుగులు జతచేశారు. మిడిలార్డర్ కూడా తలో చేయి వేయడంతో భారత్‌కు పోరాడే స్కోరు దక్కింది. సుగందిక, చమరి..మూడేసి వికెట్లు తీశారు. నిర్దేశిత లక్ష్యాన్ని లంక మరో 5 బంతులు మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి 278 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వా (56), హర్షిత (53) అర్ధసెంచరీలతో జట్టు విజయంలో కీలకమయ్యారు. ముఖ్యంగా నీలాక్షిక తన ఇన్నింగ్స్‌లో 5ఫోర్లు, 3సిక్స్‌లతో చెలరేగింది. స్నేహ్‌రానా(3/45) మూడు వికెట్లు తీసింది.


## వన్డేలు, టీ20ల్లో టీమిండియా టాప్.. ర్యాంకులు రిలీజ్ చేసిన ఐసీసీ



**ముంబై-నవభూమి:** అంతర్జాతీయ క్రికెట్ మండలితాజా ర్యాంకులను రిలీజ్ చేసింది. వన్డేలు, టీ20ల్లో ఇండియా టాప్ ప్లేస్ కొట్టేసింది. ఇక టెస్టు ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా ఫస్ట్ ప్లేస్‌లో నిలవగా, ఇండియా నాలుగో స్థానానికి పడిపోయింది. పురుషుల క్రికెట్‌కు చెందిన వార్షిక ర్యాంకింగ్స్‌ను సోమవారం ఐసీసీ రిలీజ్ చేసింది. 2024 మే నుంచి ఆడిన మ్యాచ్‌ల ఆధారంగా ర్యాంకులను వెల్లడించారు.

టెస్టుల్లో ఆస్ట్రేలియా లీడింగ్‌లో ఉన్నది. టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆ జట్టు టాప్ ప్లేస్ లో ఉంది. వార్షిక పాయింట్లు 15 నుంచి 13కు తగ్గినా.. పాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా 126 పాయింట్లతో అగ్రస్తానంలో నిలిచింది. బెన్ స్టోక్స్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు రెండో స్థానానికి ఎగబాకింది. సౌతాఫ్రికా, ఇండియాను ఆ టీమ్ వెనక్కినెట్టింది. ఈ ఏడాది ఆడిన 4 టెస్టుల్లో ఇంగ్లండ్ మూడింటిలో విజయం సాధించింది. ఇంగ్లండ్ రేటింగ్ పాయింట్లు 113 కాగా, దక్షిణాఫ్రికా 111, ఇండియా 105 పాయింట్లతో మూడవ, నాలుగవ స్థానాల్లో ఉన్నాయి. వన్డే ర్యాంకుల్లో ఇండియా అగ్రస్థానంలో ఉన్నది. ఇటీవల ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని భారత్ గెలుచుకున్నది. రేటింగ్‌ను 122 నుంచి 124కు పెంచింది. చాంపియన్స్ ట్రోఫీ రన్నరప్ న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉన్నది.

## మాడ్రిడ్ చాంప్ సబలెంకా



**మాడ్రిడ్-నవభూమి:** మాడ్రిడ్ ఓపెన్‌లో ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ ఎరీనా సబలెంకా చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సబలెంకా 6-3, 7-6(3)తో అమెరికా యువ టెన్నిస్ ప్లేయర్ కొకో గాఫ్‌పై అద్భుత విజయం సాధించింది. వరుస సెట్లలో గాఫ్‌ను చిత్తుచేసిన సబలెంకా మూడోసారి మాడ్రిడ్ ఓపెన్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. ఫ్రెంచ్ గ్రాండ్‌స్లామ్‌కు సన్నాహక టోర్నీ అయిన మాడ్రిడ్ ఓపెన్‌లో సబలెంకా సత్తాచాటింది. 2021, 23లో టైటిళ్లు గెలిచిన సబలెంక మూడోసారి టైటిల్ ఒడిసిపట్టి పెట్రా క్విటోవా రికార్డును సమం చేసింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**